ప్రజలే ప్రభువులు

# జనబలం

మార్చి 2025 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-







## EVMలపై ఆరోపణలు
## vs
## జమిలి
## vs
## నిజమైన ఎన్నికల సంస్కరణలు

## రాష్ట్రాల ఆర్థిక స్థిరత్వం, సవాళ్లు



## 'ఆప్' కి ఆత్మశోధన అవసరం



## AP బడ్జెట్ ఘనం, ఆదాయం అనుమానం

## తెలంగాణ సోషల్ జస్టిస్ డే?





హర్యానా సోనిపట్‌లోని అశోక విశ్వవిద్యాలయంలో యంగ్ ఇండియా ఫెలోషిప్ శిక్షణా కార్యక్రమంలో ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. 'వ్యవస్థ లోపల, బయట నుండి మార్పు సాధించడం'పై దిశ నిర్దేశం చేశారు.





# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

మార్చి 2025

సంపుటి 26 సంచిక 03


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్




*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్




ఇవ్వకపోతే మనకు ఓటేయడానికి ఇష్టపడరు!


06 రాష్ట్రాల ఆర్థిక స్థిరత్వం, సవాళ్ళ గణన

11 మూలాలు బలంగా ఉన్నాయి, సద్వినియోగానికి సంస్కరణలు తేవాలి

19 ఫిబ్రవరి 4- తెలంగాణ సోషల్ జస్టిస్ డే ?

25 'ఆప్'కి ఆత్మశోధన అవసరం

33 రూ.3,22,359 కోట్లతో ఏపీ 25-26 బడ్జెట్



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# నమామి గంగే...!

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ లో త్రివేణీ సంగమం వద్ద జరిగిన 'మహా కుంభ మేళా' భారతీయ సమాజంలోని భక్తి విశ్వాసాలకు, నమ్మకాలకు అద్దం పట్టింది. మకర సంక్రమణం రోజున ప్రారంభం అయిన కుంభమేళా నలభై ఐదు రోజులపాటు కొనసాగి శివరాత్రి రోజున ముగిసింది.

ప్రతీ నదికి పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలు భారతీయ జీవన విధానంలో ఒక భాగంగా చిరకాలంగా ప్రఖ్యాతి పొందాయి. ప్రజల భక్తి, విశ్వాసాల్లో పుష్కరాలకు తొలినుండీ బలమైన స్థానం ఉన్నది. నదుల్లో పుణ్యస్నానాలు చేయడం, ముఖ్యంగా సంగమ ప్రదేశాల్లో చేయడం పరమ పవిత్రమని భక్తులు అనాదిగా భావిస్తూ వచ్చారు. ఉత్తరాది రాష్ట్రాల్లో "కుంభ మేళా" కున్న ప్రత్యేకత కూడా మనకు తెలుసు. ప్రజల విశ్వాసాలకు సంబంధించిన విషయాలుగా వాటిని గౌరవించడం నేర్చుకోవాలి.

గత కొన్నేళ్లుగా పెరిగిన సామాజిక మాధ్యమాల విస్తృతి, వాటిలో ఉధృతంగా సాగుతున్న ప్రచారం కారణంగా ఇటీవల ఇలాంటి సందర్భాలకు విశేష ప్రాచుర్యం లభిస్తోంది. 2019 లో ప్రయాగ్‌రాజ్ లో జరిగిన "అర్ధ కుంభమేళా" కు కూడా పన్నెండు కోట్లమంది భక్తులు హాజరయ్యారని ప్రభుత్వం ప్రకటించింది. అప్పట్లో దానికోసం 4500 కోట్ల రూపాయల బడ్జెట్ ను కేటాయించి వ్యయం చేసింది.

అయితే 2025 కుంభమేళా నూట నలభై నాలుగేళ్లకు ఒకసారి వచ్చే ప్రత్యేక "కుంభ మేళా" గా ప్రాచుర్యం పొందింది. దాంతో జనం అసంఖ్యాకంగా తరలివచ్చారు. ప్రతిష్ఠాత్మకమైన మహాకుంభ్ ను విజయవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయి. అధికారపార్టీ భావజాలంలో మత, ధార్మిక విశ్వాసాలకు ఉన్న ప్రాధాన్యత రీత్యా అది సహజమే. గత రెండేళ్లుగా యూపీ ప్రభుత్వం మహాకుంభ్ ఏర్పాట్లు సాగిస్తూ వచ్చింది. నలభై కోట్లమంది భక్తులు తరలి వస్తారని అంచనా వేసిన యూపీ ప్రభుత్వం అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. ఉత్సవ ఏర్పాట్ల కోసం, నిర్వహణ కోసం సుమారు 6480 కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయించింది. 10 వేల ఎకరాల్లో లక్షా యాభైవేల గుడారాలను నిర్మించింది. వాహనాల పార్కింగ్ కోసం మరో ఐదువేల ఎకరాల స్థలాన్ని ఏర్పాటు చేసింది. పన్నెండు కిలోమీటర్ల పొడవున స్నాన ఘాట్లను నిర్మించింది. రైల్వేశాఖ మొత్తం16 వేల రైళ్ళను ఏర్పాటు చేసింది.

కోట్లకొలది తరలివచ్చే భక్తులకు వసతి, ఆహారం, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, నదీ జలాల కాలుష్యం, రవాణా, ప్రజల రక్షణ, భద్రత వంటి అంశాలన్నిటిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. పారిశుద్ధ్యం కోసం పదిహేను వేల మంది సిబ్బందిని నియమించింది. కుంభమేళా ముగిశాక ప్రభుత్వం ప్రకటించిన ప్రకారమే 67 కోట్లమంది ప్రయాగ్ రాజ్ కు తరలివచ్చారు. సంస్కృతి, ధర్మం, భక్తి విశ్వాసాలు, ఆధ్యాత్మికత వంటివాటికి ప్రజాజీవితంలో ఉన్న ప్రాముఖ్యం ఒక ఎత్తు అయితే, అసంఖ్యాకంగా తరలివచ్చే భక్తులకు ఏర్పాట్లు చేయడం మరో ఎత్తు. ప్రపంచంలోనే అత్యధిక జనసందోహం గుమికూడి పాల్గొనే ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంగా మహా కుంభ్ రికార్డు సృష్టించింది. అంతటి బృహత్తర కార్యక్రమాన్ని సజావుగా జరిగేలా చూడటం ప్రజా ప్రభుత్వాల బాధ్యత.

మహా కుంభ్ ముగిశాక ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వాల బాధ్యతను గుర్తు చేసేవిగా ఉన్నాయి. సంస్కృతీ సంప్రదాయాలు, భక్తి విశ్వాసాలు, పవిత్ర స్నానం, భక్తుల భాగస్వామ్యం వంటి అంశాలను ఆయన ప్రశంసించారు. ఇలాంటి సందర్భాల్లో పాలనా యంత్రాంగం బాధ్యతలను ఆయన ప్రస్తావించారు. ఆయన యూపీ ప్రభుత్వాన్ని సహజంగానే అభినందించారు.

అత్యధిక జనసందోహం గుమికూడి పాల్గొనే ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ విషయంలో "మహా కుంభ్" ఒక " కేస్ స్టడీ" గా అధ్యయనం చేయాల్సి ఉంటుందని ప్రధానమంత్రి అభిప్రాయ పడ్డారు. "నిర్వహణలో ఏవైనా చిన్న చిన్న లోపాలు జరిగితే క్షమించాలని" కూడా మోదీ అభ్యర్థించారు.

కేస్ స్టడీ లో భాగంగా అధ్యయనం చేయాల్సిన అనేక అంశాలు ఉన్నాయి. ముఖ్యంగా నదీ జలాల కాలుష్యం గురించి ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కోట్లాది మంది స్నానాలు చేసే చోట జలాలు కలుషితం కావడం అత్యంత సహజం. నీటిలో మానవ విసర్జితాల కాలుష్యం తీవ్రంగా ఉందని కేంద్ర కాలుష్య నియంత్రణా మండలి కూడా చెప్పింది. దానికి యూపీ ప్రభుత్వం స్పందించిన తీరు మాత్రం గర్హనీయంగా ఉంది.

ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సమస్యను నిరాకరించే ధోరణిలో ఉన్నాయి. అవి పరిష్కారానికి దారి చూపవు. పైగా ఆయన విమర్శలను భక్తుల విశ్వాసాలతో ముడిపెట్టే ప్రయత్నం చేసి సమస్యను వివాదంగా మార్చారు. గంగానది లో కాలుష్యం

లేదని, స్నానాలకు , ఆచమనం చేయడానికి నీరు శుద్ధంగా ఉందని ఆయన అధికారికంగా ప్రకటించారు.

"కాలుష్యాన్ని హరించే 1100 రకాల బాక్టీరియాలు గంగానదిలోనే ఉన్నాయని, అందువల్ల సహజసిద్ధంగానే నదిలో కాలుష్య నివారణ జరిగి పోతోందని ఒక ఊరూ పేరూ లేని శాస్త్రవేత్త ఇచ్చిన ప్రకటనను కూడా యూపీ ప్రభుత్వం ప్రచారంలో పెట్టింది. 2015 లో ప్రారంభం అయిన "నమామి గంగే" ప్రాజెక్టు నత్త నడకన నడుస్తున్నది. గత పదేళ్ళలో దాదాపు 37 వేల కోట్ల రూపాయలు వ్యయం అయ్యింది. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వంటి సంస్థలు "నమామి గంగే" అమలు చేస్తున్న తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చాయి.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కూడా నమామి గంగే ప్రాజెక్ట్ వ్యయాలను , ఫలితాలను తప్పు పడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

ఇప్పటికీ 81 మురుగు కాల్వల ద్వారా 135 కోట్ల లీటర్ల మురుగు గంగలో కలుస్తున్నట్లు అంచనా.మురుగు శుద్ధి వ్యవస్థలు సక్రమంగా పనిచేయడం లేదని, అందులో బోలెడు అవినీతి జరుగుతోందని పర్యావరణ కార్యకర్తలు గగ్గోలు పెడుతూనే ఉన్నారు. ప్రభుత్వం ఈ సమస్య తీవ్రతకు తగిన పరిష్కారం చూడకుండా సమస్యను లేవనెత్తి చూపించిన వారిపై విరుచుకు పడటం ఒక విధానంగా చేపట్టింది.

కుంభ్‌మేళా నిర్వహణ సందర్భంలో కూడా ఎదురైన సమస్యల విషయంలో యూపీ ముఖ్యమంత్రి నిరాకరణ ధోరణినే అనుసరించారు. విమర్శకులను అనుచిత పదాలతో నిందించడమే కాకుండా అలాంటి వారికి దుర్గతి పడుతుందంటూ శాపనార్థాలు కూడా పెట్టారు. ఆధ్యాత్మిక వ్యవహారాల్లో ఒక మఠాధిపతి తనకు నచ్చిన పద్ధతుల్లో మాట్లాడటం వేరు, ప్రజా ప్రభుత్వానికి బాధ్యత వహించే ముఖ్యమంత్రి తనకు నచ్చిన పద్ధతుల్లో మాట్లాడటం వేరు. ఈ ధోరణి ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కాదు. ప్రజా ధనాన్ని వ్యయం చేసే ప్రభుత్వాలు అందుకు జవాబుదారీగా ఉండి తీరాలి. ఎక్కువసార్లు ఎన్నికల విజయాలు సాధించినంత మాత్రాన జవాబు చెప్పాల్సిన బాధ్యత లేకుండా పోదు.

నమామి గంగే ప్రాజెక్ట్ లక్ష్యాలను సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవడం అవసరమని మహా కుంభ్ ఇస్తున్న సందేశం. ప్రయాగ్ రాజ్‌లో ఒక స్నాన్ ఘాట్‌లో జరిగిన తొక్కిసలాటలో 37 మంది, న్యూఢిల్లీలో రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది భక్తులు మృత్యువాతపడటం అత్యంత విషాదకరం. అత్యధిక భక్తులు వస్తారనుకున్న పవిత్ర దినాల్లో అందుకు తగిన సన్నద్ధత లేకపోవడం, పోలీసుల నుండి తగిన సూచనలు ఇవ్వకపోవడం వల్ల ఈ మరణాలు సంభవించాయని ప్రాథమిక పరిశీలనలో తేలింది.

పవిత్ర స్నానాలు ఆచరించడానికి తరలి వచ్చిన భక్తుల లెక్కలను ప్రతిరోజూ ప్రకటించిన ప్రభుత్వం తొక్కిసలాటలో మరణించిన భక్తుల సంఖ్యను ప్రకటించడానికి సుదీర్ఘ సమయం తీసుకున్నది. పైగా తొక్కిసలాట వీడియోలను తొలగించాలని సామాజిక మాధ్యమాలను ఆదేశించింది. భద్రతా ఏర్పాట్లలోని లోపాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం పారదర్శకతకు పాతర వేయడమే అవుతుంది.

2019 లో ప్రయాగ్ రాజ్ అర్ధ కుంభ్ సందర్భంగా విశిష్ట సేవలను అందించిన ఐదుగురు పారిశుద్ధ్య కార్మికులకు పాదపూజ చేసి ప్రధానమంత్రి వారికి కృతజ్ఞతలు చెప్పారు. మొన్న కూడా యూపీ ముఖ్యమంత్రి పారిశుద్ధ్య కార్మికులతో సహపంక్తి భోజనం చేసి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సంకేత ప్రాయమైన చర్యలు నిజానికి పారిశుద్ధ్య కార్మికుల జీవితాల్లో మార్పులకు నాంది పలకాలి.

ప్రయాగ్ రాజ్ మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల నెల జీతం ప్రస్తుతం పదివేల రూపాయలుగా ఉంది. 2017 లో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజట్ ప్రకారం కనీస వేతనం 24 వేల రూపాయలు ఇవ్వాల్సి ఉంది. పారిశుద్ధ్య పనులు చేసే వారిలో నూటికి తొంభై అయిదు మంది ఎస్.సి, ఎస్.టి కులాలకు చెందిన వారే కావడం మన సామాజిక జీవనంలోని కఠోర వాస్తవం. కుంభ్ మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు కడగటానికి ఐదువేల మంది రోజు కూలీలను వినియోగించారు. వారికి కూలిగా రోజుకు నాలుగు వందల రూపాయలు ఇచ్చారు. ఇలాంటివి సమస్యలు కాదనుకుంటే అంతకు మించిన ఆత్మ వంచన మరొకటి ఉండదు.

ఆదిమ కాలం నుండి ప్రకృతి శక్తులను ఆరాధించడం ప్రపంచంలోని అన్ని సంస్కృతుల్లోనూ గమనించవచ్చు. ముఖ్యంగా భారతీయులు వేలాది సంవత్సరాలుగా తమ భూభాగంలో ప్రవహించే నదులన్నిటినీ పవిత్ర దేవతలుగా ఆరాధించడం కూడా తెలిసినదే. ఇలాంటివి సమాజానికి ఒక ఆధ్యాత్మిక స్ఫూర్తిని ఇస్తాయి. సమకాలీన సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిణతితో పరిష్కరించు కోవడం ఆధునిక నాగరికతా లక్షణం. కుంభ్ మేళా కేస్ స్టడీ మనకు అలాంటి స్ఫూర్తిని ఇస్తుందని ఆశిద్దాం!

డి. సోమ సుందర్

# రాష్ట్రాల ఆర్థిక స్థిరత్వం, సవాళ్ళ గణన

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధిని పెంచటానికి, ప్రజలందరికీ అవసరమైన వస్తువుల అందుబాటుకి విజ్ఞతతో కూడిన ద్రవ్య నిర్వహణ కీలకం. ఒక కుటుంబాన్నే చూడండి. ఆదాయం కంటే రోజువారీ ఖర్చు తక్కువగా ఉండేలా చూసుకుంటారు. వృద్ధి చెందుతారు. తమకంటే తమ తర్వాతి తరం మరింతగా ఎదగాలని కష్టపడతారు; ఆస్తుల కోసం పొదుపు చేయటం, పెట్టుబడులు పెట్టటం చేస్తారు. ప్రభుత్వాలూ అదేరకంగా వ్యవహరించాలి. ఈవేళ్టి అవసరాలను తీర్చటంతో పాటు, సురక్షిత భవిష్యత్తు అభివృద్ధికి వనరుల్ని వివేకవంతంగా కేటాయించాలి.

భారత సమాఖ్య వ్యవస్థలో యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాల్ని స్పష్టంగా నిర్వచించారు. ఎవరి పాత్ర వారిది. అయితే, ఆర్థికంగా దేశమంతా ఒకే యూనిట్. ఏ రాష్ట్రమైనా ఆర్థిక ఒడిదుడుకులకు లోనైతే, సంక్షోభం ఆ రాష్ట్రానికే పరిమితం కాదు. యూనియన్ ప్రభుత్వంపై కూడా ప్రభావం పడుతుంది. రాష్ట్రాలు దివాళా తీస్తే మొత్తం దేశం దివాళా తీస్తుంది. ఈ పరస్పర ఆధారితాన్ని గుర్తించే, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలకుండా నిరోధించేందుకు రాజ్యాంగం కొన్ని రక్షణ కవచాలని ఏర్పాటు చేసింది. ఆయా రాష్ట్రాలు ఉన్న పరిస్థితుల్లో కొంతమేరకు అప్పు తెచ్చుకోవచ్చు. ఎంత మేరకు అప్పు తెచ్చుకోవచ్చో తేల్చి చెప్పటానికి, పరిస్థితి మరీ దిగజారితే రాష్ట్రాల్లో ఆర్థిక ఎమర్జెన్సీ విధించటానికి 293, 360 అధికరణాల ద్వారా యూనియన్ ప్రభుత్వానికి బాధ్యత ఇచ్చారు. అయితే, ఈ చర్యలపై రాజకీయ పక్షపాతమంటూ తరచూ ఆరోపణలు వస్తుంటాయి. అందువల్ల, ఆర్థిక క్రమశిక్షణకు సానుకూల వ్యవస్థీకృత ఏర్పాట్లు అవసరం.

ఇటీవలి సంవత్సరాలలో యూనియన్ ప్రభుత్వం ప్రశంసనీయంగా ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తుండగా, రాష్ట్రాల్లో కొన్ని మాత్రమే అలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నాయి. రాజకీయ పక్షపాతం ఆరోపణలకి ఆస్కారం లేకుండా, సకాలంలో నిష్పాక్షికంగా, పారదర్శకంగా రాష్ట్రాల ఆర్థిక స్థితిగతుల అంచనా కీలకం. ద్రవ్య ఆరోగ్య అంచనాలకు అటువంటి నిష్పాక్షికత ఎంత అవసరమో, సుప్రీంకోర్టులో కేరళ వాదనను చూస్తే అర్థమవుతుంది. మార్కెట్ నుంచి మరింత అప్పు తెచ్చుకునే స్వేచ్ఛ యూనియన్ తమకు ఇవ్వాలని ఆ రాష్ట్రం కోర్టుకెక్కింది. బ్యాంకుల ఒత్తిడి సామర్థ్యాన్ని గుర్తించేందుకు రిజర్వుబ్యాంకు ఎలాగైతే పరీక్షలు నిర్వహిస్తుందో (స్ట్రెస్ టెస్ట్) ఆ నమూనాలో రాష్ట్రాల్లో ఆర్థిక దుర్బలత్వాన్ని గుర్తించి, సుస్థిరతకి భరోసా చర్యలు తీసుకోవచ్చు.


### ఆర్థిక ఆరోగ్యానికి కీలక సూచికలు

**1. అప్పులు - జీఎస్‌డీపీ నిష్పత్తి:**

ఇది రాష్ట్రాలకు 20% దాకా ఉండటం ఆదర్శ ప్రమాణం. గుజరాత్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక అప్పుల్ని తమ స్థూల రాష్ట్ర జాతీయాదాయంలో (జీఎస్‌డీపీ) 17% నుంచి 27% మధ్య నిర్వహించగలుగుతున్నాయి. అందుకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, పంజాబ్‌లలో అప్పులు 39% దాటిపోయాయి; 50% దాకా చేరుతున్నాయి. అప్పులు పెరుగుతున్నకొద్దీ వడ్డీ చెల్లింపులు పెరుగుతుంటాయి. చివరికి ఇది అప్పుల ఊబిలోకి నెట్టే ప్రమాదం ఉంది.

**2. తప్పనిసరిగా భరించాల్సిన ఖర్చు:**

జీతాలు, పెన్షన్లు, వడ్డీలు కట్టటం వంటివి అనివార్యమైన




ఖర్చులు. రాష్ట్రాలు ఆదాయంతో పొంతన లేకుండా అధికవాటా వీటికే వెచ్చించాల్సి వస్తోంది. గుజరాత్, కర్ణాటక లాంటి మెరుగైన ఆర్థిక ఆరోగ్యమున్న రాష్ట్రాలు తమ సొంత ఆదాయాల్లో 62% – 79% అటువంటి తప్పనిసరి ఖర్చులకే వెచ్చిస్తున్నాయి. ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌ల్లోనైతే ఈ ఖర్చు 100% దాటేసింది. జాతీయస్థాయి ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల్ని కూడా ఈ ఖర్చుల కోసం వాడేస్తున్నాయి.

**3. వడ్డీ భారం :**

ఆదాయంలో ఎక్కువ భాగం వడ్డీ చెల్లింపులకి పోవటం ఆర్థిక ఒత్తిడికి సంకేతం. ఈ విషయంలో తమిళనాడు, తెలంగాణ మధ్యస్థంగా ఉన్నాయి. బలమైన ఆర్థిక వ్యవస్థలు, వేగంగా విస్తరిస్తున్న మహానగరాలు, అధిక తలసరి ఆదాయాలు ఉన్నప్పటికీ, జీఎస్‌డీపీలో అప్పులు, తప్పనిసరి వ్యయాల వాటా తగ్గించేలా ఆ రాష్ట్రాల ద్రవ్య నిర్వహణ మెరుగుపడటం అవసరం.

## పారదర్శకత సవాళ్లు

ద్రవ్య అంచనాలు నిష్పాక్షికంగా ఉండాలంటే, వాస్తవాలు, గణాంకాల సమాచారం కచ్చితత్వంతో ఉండాలి. అయితే రాష్ట్రాలు తరచుగా తమ మొత్తం అప్పుల్ని బడ్జెట్‌లో చూపటం లేదు. బడ్జెటేతర రుణాలుగానూ చూపుతున్నాయి. సొంతంగా ఆదాయం లేని ప్రత్యేక కార్యనిర్వహణ వాహకాలకు (స్పెషల్ పర్పస్ వెహికల్స్) అప్పును బదలాయిస్తున్నాయి. చెల్లించకుండా వాయిదా వేసే బిల్లులు అప్పుల్ని మరింత మరుగున పడేస్తాయి. కానీ ఏదోకరోజు వీటిని చెల్లించక తప్పదు. అటువంటి దోరణులు నగదు లావాదేవీల పద్ధతిని దుర్వినియోగం చేస్తాయి. వాస్తవాల పరిశీలనను జాప్యం చేస్తాయి. ఆర్థిక ఆరోగ్యాన్ని నిక్కచ్చిగా అంచనా వేయటానికి పద్దుల నిర్వహణలో పారదర్శకత తప్పనిసరి.

## ఏమిటి పరిష్కారం?

రాష్ట్రాలు ఆర్థికంగా ఎక్కడెక్కడ దుర్బలంగా ఉన్నాయో గుర్తించేందుకు నిర్ణీత కాలవ్యవధిలో విధిగా బేరీజు వేసే పరీక్షల పద్ధతి ఉండాలి. ఆ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి. ఇవి రాష్ట్రాల ఆర్థిక లోటుపాట్లను సరిదిద్దటానికి, ఆర్థికాంశాల్ని పక్షపాత రాజకీయాల నుంచి వేరు చేసి చూడటానికి, భారత ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు తోడ్పడతాయి.

ఆర్థిక క్రమశిక్షణ బలోపేతం, కచ్చితత్వంతో కూడిన నివేదికలు – సకాలంలో దిద్దుబాటు చర్యల సామర్థ్యాన్ని పెంచుతాయి, దేశవ్యాప్తంగా ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందిస్తాయి.

✴

# రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్యంపై నీతి ఆయోగ్ నివేదిక 2025

తెలంగాణ ఆర్థిక ఆరోగ్యం మధ్యస్థంగా ఉందని నీతిఆయోగ్ ఇటీవల విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. మొత్తం 18 పెద్ద రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను విశ్లేషిస్తూ ర్యాంకులు రూపొందించగా, 43.6 మార్కులతో తెలంగాణ 8వ స్థానంలో నిలిచింది.

కాగ్, ఆర్‌బీఐతో పాటు వివిధ మార్గాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నీతిఆయోగ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గోవా, జార్ఖండ్, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లు తెలంగాణ కన్నా మెరుగైన స్థితిలో ఉన్నాయి.

2014-15 నుంచి 2021-22 మధ్యకాలంలో తెలంగాణ సగటున 36.2 మార్కులతో 9వ ర్యాంకులో ఉండగా, 2022-23లో 43.5 మార్కులతో 8వ స్థానానికి చేరుకొని ఒక మెట్టు పైకెక్కింది. ఖర్చుల నాణ్యతలో 12, ఆదాయ సమీకరణలో 2, ఆర్థిక హేతుబద్ధత, రుణ సూచికల విభాగంలో 9 స్థానాల్లో నిలిచింది.

⇨ తెలంగాణ మూలధన వ్యయం నికర జీఎస్‌డీపీ నిష్పత్తితో పోల్చిచూసినప్పుడు తగ్గింది. రాష్ట్ర మొత్తం వ్యయంలో మూలధన ఖర్చు 2018-19లో 17.6% ఉండగా, 2022-23 నాటికి అది 9.3%కి తగ్గిపోయింది.

⇨ మిగతా రాష్ట్రాలతో పోలిస్తే విద్య, వైద్య రంగాలకు తెలంగాణ కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. వైద్య రంగంలో చేసే ఖర్చు 2018-19లో 4.67% ఉండగా, 2022-23 నాటికి 4.57%కి పడిపోయింది.

⇨ అయిదేళ్లలో ప్రభుత్వ అప్పుల వృద్ధిరేటు 11.9% నుంచి 19.1% మధ్యలో నమోదైంది.

⇨ ప్రభుత్వ రుణాలపై చెల్లించే సగటు వడ్డీ రేటు 2018-19లో 8.2% ఉండగా, 2022-23 నాటికి అది 7.6%కి తగ్గింది. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో ప్రధాన భాగం అప్పులు, వడ్డీ చెల్లింపులకు కేటాయిస్తున్నారు. 2018-19లో ఇందుకోసం రూ.12,586 కోట్లు కేటాయించగా, 2022-23 నాటికి అది రూ.21,821 కోట్లకు (73%) పెరిగింది. రెవెన్యూ వ్యయంలో అప్పులు, వడ్డీల వాటా అత్యధికంగా ఉంది.

### అడుగు నుంచి రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ఆరోగ్యం గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఎంత దారుణంగా ఉందో నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. 18 రాష్ట్రాల్లో ఏపీ 17వ స్థానంలో నిలిచింది.




పంజాబ్ మినహా అన్ని రాష్ట్రాలూ ఆంధ్రప్రదేశ్ కంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి.

2014-15 నుంచి 2021-22 మధ్య సగటున 13వ ర్యాంకులో నిలిచిన ఏపీ, 2022-23లో 17కి పడిపోయింది. ఖర్చుల నాణ్యత విషయంలో 15, ఆదాయ సమీకరణ, ఆర్థిక హేతుబద్ధతలో 16, రుణ సూచికలో 12 ర్యాంకులను రాష్ట్రం దక్కించుకుంది. పంజాబ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలు పెను ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.

2022-23లో ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఆర్థిక లోటుతో సతమతమైంది. అప్పులతో పాటు వడ్డీ చెల్లింపులు పెరగటం రాష్ట్రానికి ప్రధాన ఆర్థిక సమస్యగా మారింది. మొత్తం వ్యయంలో రాష్ట్ర మూలధన వ్యయం 3.5%కి పరిమితమైంది. 2022-23లో చేసిన అప్పుల్లో 4.4% మాత్రమే మూలధన వ్యయానికి ఖర్చు చేశారు.

2018-19 నుంచి 2022-23 మధ్య ఏపీ సొంత ఆదాయంలో వార్షిక వృద్ధి -6%గా నమోదైనట్లు నివేదిక తెలిపింది. మొత్తం ఆదాయంలో రాష్ట్ర సొంత ఆదాయం 2018-19లో 64% ఉండగా, 2022-23 నాటికి అది 67%కి చేరింది. సొంత ఆదాయ వృద్ధి రేటు 2018-19లో 17.1% ఉండగా, 2022-23లో 9.8%కి పడిపోయింది. 2022-23లో ఆర్థికలోటు జీఎస్‌డీపిలో 4% ఉంది. ఏపీ 2014-15లో 3, 2015-16లో 7, 2016-17లో 14, 2017-18లో 16, 2018-19లో 13, 2019-20లో 15, 2020-21లో 13, 2021-22లో 11, 2022-23లో 17వ స్థానంలో ఉంది.


⇨ ప్రభుత్వ అప్పులు 2018-19 నుంచి 2022-23 మధ్య సగటున 16.5% మేర పెరిగాయి.

⇨ 2022-23లో వడ్డీ చెల్లింపులు 15% మేర పెరిగాయి. 2018-19 నుంచి 2022-23 మధ్య ఏటా సగటున (సీఏబీఆర్) 10% మేర వృద్ధి చెందాయి. ✶

# రుణ సామర్థ్యంలో ఏపీకి సున్నా మార్కులు

రుణ సామర్థ్యం అంశంలో ఆంధ్రప్రదేశ్‌కి నీతి ఆయోగ్ సున్నా మార్కులు వేసింది. అప్పులు కుప్పతెప్పలుగా పెరిగిపోయాయని, వాటిని చెల్లించలేని స్థాయికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందని తెలిపింది.

దేశంలోని 18 పెద్ద రాష్ట్రాలను 2022-23 నాటికి ఉన్న ఆర్థిక పరిస్థితుల ఆధారంగా విశ్లేషణకు నీతి ఆయోగ్ అయిదు కీలకాంశాలను, మరో 9 సూక్ష్మ అంశాలను ప్రమాణాలుగా ఎంచుకుంది. ఇవే ప్రమాణాల ప్రాతిపదికన 2014-19 మధ్య ఏపీ 31.7 మార్కులతో 13వ స్థానంలో ఉంది. 2022 వచ్చే సరికి స్కోర్ 27.7కు పడిపోయినా స్థానం మారలేదు. 2022- 23లో రాష్ట్ర స్కోర్ 20.9కి తగ్గి 17వ స్థానానికి పడిపోయింది.




**నీతి ఆయోగ్ ప్రాతిపదికగా తీసుకున్న అయిదు అంశాలు :** ఖర్చుల నాణ్యత, వనరుల సమీకరణ, ద్రవ్య వివేచన, అప్పుల సూచీ, రుణాలు భరించే సామర్థ్యం.

రాష్ట్రాలు రుణాలు భరించగల స్థితిలో ఉన్నాయా? తిరిగి తీర్చగలవా? అన్న పరిశీలనలో ప్రతికూల ఫలితాలు రావటం వల్లే ఆంధ్రప్రదేశ్‌ను 'ఆర్థిక ఒత్తిళ్లు పెరుగుతున్న రాష్ట్రం'గా పేర్కొంటూ నీతి ఆయోగ్ ఈ కేటగిరిలో సున్నా మార్కులు ఇచ్చింది.

**'ఖర్చుల నాణ్యత'ను లెక్కగట్టేందుకు నీతి ఆయోగ్ పరిగణించిన అంశాలివీ...**

☆ రాష్ట్ర ప్రభుత్వ మొత్తం ఖర్చులో అభివృద్ధి పనులకు చేసిన వ్యయం వాటా ఎంత?

☆ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో మూలధన వ్యయం వాటా ఎంత?

☆ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి, రెవెన్యూ రాబడులకు మధ్య పోలిక

☆ రెవెన్యూ లోటు, స్థూల ద్రవ్యలోటు ఎంత?

☆ మొత్తం రెవెన్యూ రాబడి ఎంత? ప్రతిగా వడ్డీ చెల్లింపులు ఏ స్థాయిలో ఉన్నాయి?

☆ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో మొత్తం రుణాల శాతం ఎంత? రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధిరేటు ఎలా ఉంది? వడ్డీ చెల్లింపుల్లో వృద్ధిరేటు ఎలా ఉంది?

### ఏపీ ఇతర గణాంకాలు

☆ ఆంధ్రప్రదేశ్‌లో 2022-23లో రుణంగా తెచ్చిన రూ.67,985 కోట్లతో (బడ్జేటేతర అప్పులు అదనం) రూ.2.25 లక్షల కోట్లు ఖర్చుపెడితే, దానిలో మూలధన వ్యయం రూ.7,244 కోట్లు (3.2%) మాత్రమే.

☆ 2018-19 పోలిస్తే 2022-23 నాటికి రాష్ట్రంలో సామాజిక సేవా రంగాల్లో మూలధన వ్యయం 84.3%, ఆర్థిక సేవా రంగాల్లో 60.1% తగ్గింది.

☆ 2022-23లో జీఎస్‌డీపీలో 0.5 శాతమే మూలధన వ్యయంగా వెచ్చించారు.

☆ 2019-24 మధ్య తీసుకున్న ప్రతి వంద రూపాయల రుణంలో రూ.22.54 మాత్రమే మూలధన వ్యయంగా వెచ్చించారు.

☆ సొంత వనరుల ద్వారా ఆదాయ వృద్ధి 2022-23 నాటికి 9.8 శాతానికి పడిపోయింది. జీఎస్‌డీపీలో 7.1 నుంచి 6.4 శాతానికి తగ్గింది.

☆ అప్పులు పెరిగిపోవటం, మూలధన వ్యయాన్ని కుదించటం, అనుత్పాదక వ్యయం పెరగటం, ఆదాయం తగ్గిపోవటం, అధిక పన్నులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదేలైంది.

☆ జీఎస్‌డీపీ వృద్ధిరేటు 13.21% నుంచి 9.6 శాతానికి తగ్గటంతో ఏపీ సుమారు రూ.7 లక్షల కోట్ల ఆదాయం కోల్పోయినట్లయింది.

## తెలంగాణాలో మెరుగ్గా ఆదాయం ...

**కానీ అప్పులవల్ల నాణ్యమైన వ్యయంలో రాష్ట్రం వెనుకంజ**

తెలంగాణలో ఆదాయం మెరుగ్గా ఉన్నా ... అప్పుల భారంతో సామాజిక, ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధుల కేటాయింపులు తక్కువగా ఉంటున్నాయని

నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ వ్యయంలో అత్యధిక వాటా అప్పులపై కట్టాల్సిన కిస్తీలకే పోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. 2014-23 కాలంలో రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో అప్పుల శాతం 13.5 నుంచి 27.2కి పెరిగినట్లు వివరించింది. అప్పులపై ప్రభుత్వం కడుతున్న వడ్డీ సగటున 7.6 శాతం ఉంది. 2018-23 కాలంలో పాత అప్పులపై కిస్తీలకు చెల్లించాల్సిన సొమ్ము రూ.12,586 కోట్ల నుంచి ఏకంగా 73 శాతం పెరిగి రూ.21,821 కోట్లకు చేరింది. రెవెన్యూ రాబడులు రాబట్టటంలో మెరుగ్గా ఉన్నందువల్ల కర్ణాటక కన్నా ఆర్థిక ఆరోగ్య సూచికలో తెలంగాణ ముందుంది. అయితే ప్రజా ధనాన్ని నాణ్యమైన విధానంలో వెచ్చించటంలో మాత్రం అధ్వాన్నంగా ఉంది.

☆ రెవెన్యూ రాబడుల పెంపులో గోవా, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర ముందున్నాయి.

☆ రాష్ట్రాభివృద్ధికి కీలకమైన పెట్టుబడి వ్యయం 2018-19లో 17.6 శాతం ఉండగా... 2022-23లో 9.3 శాతానికి పడిపోయింది. ఇది ఆందోళనకరం.

## రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచిక - 2025 (ఎఫ్‌హెచ్‌ఐ)

సగటున రాష్ట్రాల పద్దులో పబ్లిక్ స్పెండింగ్ 2/3 ఉండగా, మొత్తం రాబడి 1/3 వంతు ఉన్నట్లు నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది.

| రాష్ట్రం | ఎఫ్‌హెచ్‌ఐ స్కోరు | ర్యాంకు | ఖర్చుల నాణ్యత | ఆదాయ సమీకరణ | ఆర్థిక వివేచన | రుణ సూచిక | రుణ సుస్థిరత |
|---|---|---|---|---|---|---|---|
| ఒడిశా | 67.8 | 1 | 52.0 | 69.9 | 54.0 | 99.0 | 64.0 |
| ఛత్తీస్‌గఢ్ | 55.2 | 2 | 55.1 | 56.5 | 56.0 | 79.6 | 29.0 |
| గోవా | 53.6 | 3 | 45.5 | 87.1 | 59.4 | 51.0 | 25.2 |
| జార్ఖండ్ | 51.6 | 4 | 47.3 | 45.7 | 62.4 | 66.9 | 35.7 |
| గుజరాత్ | 50.5 | 5 | 40.0 | 48.7 | 52.7 | 69.0 | 42.0 |
| మహారాష్ట్ర | 50.3 | 6 | 37.1 | 59.1 | 41.8 | 76.4 | 36.8 |
| ఉత్తరప్రదేశ్ | 45.9 | 7 | 45.8 | 34.6 | 44.7 | 59.9 | 44.5 |
| తెలంగాణ | 43.6 | 8 | 36.9 | 75.2 | 40.8 | 53.3 | 11.7 |
| మధ్యప్రదేశ్ | 42.2 | 9 | 59.7 | 27.6 | 35.6 | 61.0 | 27.2 |
| కర్ణాటక | 40.8 | 10 | 47.4 | 43.9 | 43.9 | 62.2 | 6.7 |
| తమిళనాడు | 29.2 | 11 | 32.0 | 41.2 | 25.8 | 36.0 | 11.1 |
| రాజస్థాన్ | 28.6 | 12 | 38.3 | 35.4 | 19.9 | 32.3 | 16.8 |
| బీహార్ | 27.8 | 13 | 56.1 | 5.3 | 11.5 | 47.2 | 18.8 |
| హర్యానా | 27.4 | 14 | 24.8 | 47.8 | 26.1 | 24.1 | 14.3 |
| కేరళ | 25.4 | 15 | 4.2 | 54.2 | 34.0 | 23.1 | 11.3 |
| పశ్చిమబెంగాల్ | 21.8 | 16 | 32.3 | 12.4 | 25.4 | 18.3 | 20.6 |
| ఆంధ్రప్రదేశ్ | 20.9 | 17 | 31.4 | 22.1 | 13.3 | 37.8 | 0.0 |
| పంజాబ్ | 10.7 | 18 | 4.7 | 28.1 | 5.6 | 0.0 | 15.2 |

# మూలాలు బలంగా ఉన్నాయి, సద్వినియోగానికి సంస్కరణలు తేవాలి




భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కోవలసిన నేపథ్యంలో సుస్థిరాభివృద్ధి కోసం నిర్మాణాత్మక సంస్కరణలను తేవలసి ఉందని జాతీయ ఆర్థిక సర్వే తెలిపింది. మన ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయని పేర్కొంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.3–6.8% మధ్య ఉంటుందని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంటుందని వెల్లడించింది.

**యూనియన్ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025లోని కొన్ని ముఖ్యాంశాలు:**

☞ కృత్రిమ మేధ (ఏఐ) భారత కార్మిక రంగంపై చూపించే ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి. ఏఐ దుర్వినియోగం కాకుండా సరైన విధివిధానాలను రూపొందించాలి.

☞ సేవల రంగమే భారత ఆర్థిక శక్తికి చోదకంగా పనిచేస్తోంది. దేశ ఎగుమతుల్లో ఎక్కువ భాగం ఐటీ, వ్యాపార సేవల రంగాలే ఉన్నాయి. ముమ్ముందుకూడా సేవల రంగం వృద్ధి కొనసాగే అవకాశముంది.

☞ కొవిడ్ సంవత్సరం (2020–21) వృద్ధిరేటు – 5.8%. ఆ తర్వాత వృద్ధిరేటు పెరుగుతూ వచ్చింది. 2025–26లో గత నాలుగేళ్ళలో తక్కువగా 6.3% నుండి, 6.8% నమోదయ్యే అవకాశం ఉంది. అయితే భారీ విదేశీ మారక ద్రవ్య నిల్వలతో పాటు -- మెరుగ్గా ఉన్న ద్రవ్య స్థిరీకరణతో దేశీయ ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక అంశాలు పటిష్ఠంగా ఉన్నాయి. ప్రయివేటు వ్యయం నిలకడగా ఉంది. నిరుద్యోగిత రేటు 3.2% తగ్గింది.

**8% వృద్ధితోనే 'అభివృద్ధి చెందిన దేశం'**

మన దేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే వచ్చే రెండు దశాబ్దాల పాటు 8% వృద్ధి సాధించాలని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ఇందుకోసం భూ, కార్మిక సంస్కరణలపై దృష్టి సారించాలని సూచించింది. పెట్టుబడులు 35%కి పెరగటంతోపాటు, నూతన సాంకేతికలతో ఉత్పత్తి రంగాన్ని బహుముఖంగా చర్యలు తీసుకోవాలని తెలిపింది.

☞ 2047 కల్లా వికసిత్ భారత్ సాధ్యమవ్వాలంటే, వచ్చే ఇరవయ్యేళ్లపాటు 8% చొప్పున నిలకడగా వార్షిక వృద్ధిరేటు నమోదు కావాలి. దీన్ని సాధించాలంటే జీడీపీలో పెట్టుబడుల శాతం ప్రస్తుతం ఉన్న 31 శాతం నుండి 35కి పెరగాలి.

☞ అంతర్జాతీయ పోటీని తట్టుకుని నిలబడాలంటే, నియంత్రణలు ఎత్తివేయాలి, సులభతర వ్యాపారాన్ని ప్రోత్సహించాలి.

☞ రానున్న రోజుల్లో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వివిధ ప్రాంతాల్లో ఘర్షణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు విసరనున్నాయి. ఈ నేపథ్యంలో సుస్థిరాభివృద్ధిని కొనసాగించటానికి తగిన వ్యూహాలు, విధానాల్ని భారత్ రూపొందించుకోవాలి.



☞ పంట మార్పిడి, సుస్థిర వ్యవసాయ పద్ధతుల్ని ప్రోత్సహించాలి. దీర్ఘకాలంలో ఇవి ఆహార భద్రతకు భరోసా ఇస్తాయి. సహకార రంగాన్ని బలోపేతం చేయాలి. ఆహార శుద్ధి పరిశ్రమల్ని ప్రోత్సహించాలి. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల్ని కల్పించి మార్కెట్‌లతో అనుసంధానించాలి.

☞ ఏఐ, డిజిటల్ టెక్నాలజీలకు అనుగుణంగా ఉద్యోగులు, కార్మికుల నైపుణ్యాలు ఎప్పటికప్పుడు మెరుగుపరచాలి. పని ప్రదేశంలో సంస్కరణలతో శ్రామిక జనాభాలో మహిళల పాత్ర పెరిగేలా చర్యలు తీసుకోవాలి. ఆరోగ్యం, పరిశోధన, న్యాయ, విద్య, వ్యాపార రంగాల్లో రానున్న రోజుల్లో ఏఐ కీలక పాత్ర పోషించనుంది.

**నాణ్యమైన విద్య - ఏటా 78.5 లక్షల కొత్త ఉద్యోగాలు**

వ్యవసాయేతర రంగాల్లో 2030-32 వరకు ఏటా 78.5 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించాలి. విద్యా సంస్థలను బలోపేతం చేయటం ద్వారా నాణ్యమైన విద్య లభించే ఏర్పాటు చేయాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0లో భాగం కావాలని సర్వే సూచించింది.

☞ తయారీ రంగాన్ని అభివృద్ధి చేసుకోవాలి. అదే సమయంలో కృత్రిమ మేధ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ రంగాలపై భారీగా పెట్టుబడులు పెట్టాలి.

☞ కార్మిక మార్కెట్‌కి ఏఐ అంతరాయం కలిగించకుండా సంస్థలు జాగ్రత్త వహించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. అవకాశాలూ, సవాళ్లూ ఉన్నందున ఈ సాంకేతికత దుర్వినియోగం కాకుండా నియంత్రణలు విధించాలి.

☞ ఈ - గవర్నెన్స్, యూపీఐ, ఆధార్ తదితర డిజిటల్, మౌలిక వసతులను బలోపేతం చేయాలి. 5జీ నెట్‌వర్క్‌ను విస్తరించాలి. ఇందుకు ఏఐ, డేటా ఆధారిత విధాన నిర్ణయాలు తీసుకోవాలి.

☞ అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నా ... తయారీ రంగంలో శక్తిమంత కేంద్రంగా భారత్ అవతరించాలంటే ప్రభుత్వ, ప్రయివేటు, విద్యా సంస్థలు, పరిశోధన, అభివృద్ధి సంస్థలు, ఆర్థిక సంస్థలు సమన్వయంగా పనిచేయాలి.

☞ నియంత్రణల సడలింపుతో పాటు, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పన వ్యూహాలు, చిన్న సంస్థలకు సహకారంపై దృష్టి పెట్టాలి.

☞ విద్యుత్ వాహన వినియోగం పెరిగేందుకు అవసరమైన లోహాలు, వస్తువులు, యంత్రాలు, సామాగ్రికి సరఫరాపరంగా సవాళ్లు పొంచి ఉన్నాయి.

☞ పలు కీలక మౌలిక రంగాల్లో ప్రయివేటు పెట్టుబడులను వేగవంతం చేయాలి. రూపకల్పన, ప్రాజెక్టు ప్రణాళిక, రుణ మంజూరు, నిర్వహణ, నగదీకరణ, ప్రభావ మదింపు విషయాల్లోనూ వేగం కనిపించాలి. మౌలికరంగ అభివృద్ధికి ప్రభుత్వ నిధులు మాత్రమే చాలవు.

☞ విద్యుత్ వాహన తయారీ వ్యవస్థకు ప్రపంచానికే చైనా కీలక శక్తిగా మారింది. మనదేశం లిథియం అయాన్ బ్యాటరీల్లో 75% చైనా నుంచే దిగుమతి చేసుకుంటోంది. స్వయం సమృద్ధిపై దృష్టి సారించాలి.

☞ అమెరికా స్టాక్ మార్కెట్‌లలో దిద్దుబాటు చోటు చేసుకుంటే, ఆ ప్రభావం భారత స్టాక్ మార్కెట్లలోనూ ఉండే అవకాశం ఉంది. కొవిడ్ తర్వాత వచ్చిన కొత్త మదుపర్లు ఇప్పటివరకు స్టాక్ మార్కెట్లలో సుదీర్ఘకాల, పెద్ద దిద్దుబాటును చూడలేదని గమనించాలి.

**ఆర్థిక మార్కెట్లపై అతిగా ఆధారపడొద్దు**

విధాన, ఆర్థిక పరమైన నిర్ణయాలను ఆర్థిక మార్కెట్లు మరీ ఎక్కువ ప్రభావితం (ఫైనాన్షియలైజేషన్) చేయకుండా జాగ్రత్త వహించాలని ఆర్థిక సర్వే హెచ్చరించింది. స్టాక్ మార్కెట్లు, స్థిరాస్తి ధరలు విపరీతంగా పెరగటం ఫైనాన్షియలైజేషన్ ముఖ్య లక్షణాల్లో ఒకటి. క్రమంగా ఆర్థిక వ్యవస్థ కుంగుతుంది. దీనివల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలు మరీ ఎక్కువగా ఇబ్బంది పడతాయి. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే... ఆర్థికరంగ విస్తరణ, ఆర్థికాభివృద్ధి మధ్య సమతుల్యతను పాటించాలి.

☞ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం, రోడ్లు, మెట్రో నెట్‌వర్క్‌ల ద్వారా మౌలిక సదుపాయాల సృష్టి వల్ల ఆఫీసులకు, నివాస సముదాయాలకు గిరాకీ పెరిగింది. రెరా, జీఎస్‌టీ చట్టాల వల్ల స్థిరాస్తి రంగానికి ఎన్నో ప్రయోజనాలు కలిగాయి. 2036 నాటికి దేశంలో మరో 9.3 కోట్ల గృహాలు కావాలని అధ్యయనాలు చెబుతున్నాయి.

☞ ఔషధ రంగంలో వినూత్నత, కొత్త మందుల ఆవిష్కరణ, బయో ఫార్మాస్యూటికల్స్‌పై దృష్టి సారించాలి. అంతర్జాతీయ దిగ్గజాలతో పోలిస్తే ఆర్ అండ్ డీ విషయంలో మనం ఇంకా వెనుకబడే ఉన్నాం. 2023-24లో ఫార్మా మొత్తం వార్షిక టర్నోవరు రూ.4.17 లక్షల కోట్లుగా ఉంది. గత అయిదేళ్లలో 10.1% సగటు వృద్ధి సాధించింది. మొత్తం టర్నోవర్‌లో 50% వాటా ఎగుమతులదే.

☞ ఆర్థిక సేవల రంగం ఎన్నో సానుకూలతల్ని సూచిస్తోంది. బ్యాంకులు బలంగా ఉన్నాయి. డిపాజిట్లు - రుణాల్లో వృద్ధి మెరుగైన స్థితిలో ఉంది. ఐపీఓ (పబ్లిక్ ఇష్యూ)లకు అధిక ఆదరణ లభిస్తోంది. ఈక్విటీ పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్నాయి.

**రూ.40 లక్షల కోట్లు పెరిగిన కుటుంబాల సంపద**

కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు మెరుగ్గా ఉండటం, సూక్ష్మ ఆర్థిక పరిస్థితుల్లో స్థిరత్వం, మొబైల్ అప్లికేషన్ల కారణంగా క్యాపిటల్ మార్కెట్లలో ఇన్వెస్టర్ల ప్రాతినిధ్యం పెరిగింది. 2024 చివరి నాటికి ఎన్ఎస్ఈలో నమోదిత మదుపర్ల సంఖ్య 11 కోట్లకు పెరిగింది. దేశీయంగా షేర్లలో కుటుంబాల సంపద గత అయిదేళ్లలో రూ.40 లక్షల కోట్లకు పైగా పెరిగిందని సర్వే ఉటంకించింది.

**ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రూ.9.52 లక్షల కోట్లకు**

2014-15లో దేశీయంగా ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి రూ.1.90 లక్షల కోట్ల స్థాయిలో జరిగితే, 2023-24 సంవత్సరానికి 17.5% సమ్మిళిత వార్షిక వృద్ధి రేటుతో రూ.

**ప్రపంచ ఆర్థిక పరిస్థితులను సద్వినియోగం చేసుకోవాలి**

మన ఆర్థికాభివృద్ధి నెమ్మదించటానికి ప్రపంచ పరిస్థితులే ఎక్కువ కారణమని యూనియన్ ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ తెలిపారు. వందో స్వతంత్ర దినోత్సవం నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యాన్ని సాధించాలంటే, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనుకూల పరిస్థితుల్ని సద్వినియోగం చేసుకుపోవాలన్నారు.

9.52 లక్షల కోట్లకు చేరిందని ఆర్థిక సర్వే తెలిపింది.

✦ దేశీయంగా వినియోగిస్తున్న మొబైల్ ఫోన్లలో 99% ఇక్కడే తయారవుతున్నాయి.

✦ అయితే ఈ పరిశ్రమ అసెంబ్లింగ్ పైనే ఎక్కువ దృష్టి సారించింది. డిజైన్, విడి భాగాల తయారీలో పరిమిత ప్రగతే సాధించింది.

**బంగారం తగ్గి, వెండి ధర పెరుగుతుంది**

ఈ ఏడాది బంగారం ధరలు తగ్గి, వెండి ధరలు పెగుతుతాయని ఆర్థిక సర్వే అంచనా వేసింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 2024లో బంగారం నిల్వలు గరిష్ట స్థాయికి చేరాయని వివరించింది. ఇందుకు అభివృద్ధి చెందుతున్న దేశాల కేంద్రీయ బ్యాంకులు అధికంగా కొనుగోల జరపటమే కారణంగా విశ్లేషించింది. చమురు ధరలు కూడా దిగివస్తాయని, అయితే గ్యాస్ ధర పెరుగుతుందని, లోహాలు, వ్యవసాయ ముడి సరుకుకు స్థిర గిరాకీ లభిస్తుందని తెలిపింది. ముడి ఇనుము, జింక్ ధరలూ తగ్గుతాయంది.

**జీసీసీల్లో అంతర్జాతీయ ఉద్యోగాలు నాలుగింతలు**

దేశంలోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) 2030 కల్లా అంతర్జాతీయ ఉద్యోగాల సంఖ్య నాలుగింతలు పెరిగే అవకాశముందని ఆర్థిక సర్వే తెలిపింది. తక్కువ వ్యయాలు అవుతాయనే స్థాయి నుంచి... వినూత్నత, అత్యున్నత నైపుణ్యం ఉన్న వ్యక్తుల దేశంగా భారత్ మారుతుంది. అంతర్జాతీయ స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్) సిబ్బందిలో 28%, అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ఉద్యోగుల్లో 23% వాటా చొప్పున భారత్‌కు ఉంది.

✦2018–19లో భారత్‌లో జీసీసీల సంఖ్య 1430 ఉండగా, 2023–24 కల్లా 1700కి పెరిగాయి.

**భారత్ తన ఆర్థిక లక్ష్యాలను సాధించాలంటే, సత్వరం ప్రజల జీవనశైలి ఎంపికపై దృష్టి సారించాలని ఆర్థిక సర్వే సూచించింది. పిల్లలు, యువతగా ఉన్నప్పుడే వాటి ఎంపిక జరుగుతోంది.**

✦ ఒక వ్యక్తి వారానికి 60 గంటలకు పైగా పనిచేస్తే, అది ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపవచ్చు.

✦ మానసిక వ్యాకులత, ఆందోళన కారణంగా ఏటా 1 లక్ష కోట్ల డాలర్ల మేర అంతర్జాతీయంగా నష్టపోతున్నాం.

✦ అల్ట్రా ప్రోసెస్డ్ ఫుడ్స్ (యుపీఎఫ్‌లు) వినియోగాన్ని తగ్గించేందుకు కఠిన ఎఫ్ఎఫ్ఎస్ఏఐ లేబులింగ్ విధానాన్ని అమలు చేయాలి. వీటి వినియోగం తగ్గేలా అవగాహన కార్యక్రమాలు అమలు చేయాలి. పోషకాహారం అంటూ యూపీఎఫ్‌లపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలి. చక్కెర, ఉప్పు, శాచ్యురేటెడ్ ఫుడ్స్ విషయంలో న్యూట్రియంట్ పరిమితులను ఆరోగ్యశాఖ తక్షణమే విధించాలి.

✦ చిరుధాన్యాలు (మిల్లెట్స్), స్థానిక పండ్లు, కూరగాయల లభ్యత, వినియోగం పెరిగేలా సానుకూల సబ్సిడీలను అందించాలి. ✶

**తెలంగాణాలో 88% పన్నుల వసూళ్లు**

పన్నుల వసూలులో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక, హర్యానాలున్నాయి. దేశంలో 50 శాతం కన్నా ఎక్కువగా పన్నులు వసూలు చేసిన రాష్ట్రాలు 15 ఉన్నాయి.

✦ తెలంగాణా ప్రభుత్వం ప్రకటించిన కొత్త సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక విధానం ఈ-కామర్స్ వాణిజ్యాన్ని ప్రోత్సహించేదిగా ఉంది.

✦ తెలంగాణలో 86 శాతం పంట పొలాలకు ప్రభుత్వం సాగునీటిని అందిస్తోంది. జలజీవన్ మిషన్ కింద పైపులైన్ల ద్వారా వంద శాతం సురక్షిత నీటిని అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణా ఉంది.

✦ ఐటీ రంగంలో అత్యధిక సేవలు తెలంగాణ అందిస్తోంది. ఎలక్ట్రికల్ మౌలిక వసతుల విభాగంలో మహారాష్ట్ర, తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నాయి. సిమెంట్ పరిశ్రమలు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి.

✦ శిక్షణ ఫౌండేషన్ ద్వారా ప్రేరణ ఆదర్శ విద్యా విధానం రాష్ట్రంలో అమలవుతోంది. ఇందులో నలుగురు లేదా అయిదుగురు విద్యార్థులతో ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేసి బోధనపై అవగాహన కల్పిస్తారు. ఒకరి నుండి మరొకరు నేర్చుకునేలా చేస్తారు.

✦ వైద్య సేవలకు, ఔషధాల పంపిణీకి డ్రోన్లను వినియోగిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుంది.

✦ ప్రభుత్వం మద్దతిస్తే మహిళా పారిశ్రామిక వేత్తలు అభివృద్ధి చెందుతారనటానికి తెలంగాణ ప్రభత్వం చేపట్టిన మహిళా పారిశ్రామిక వేత్తల కేంద్రం (వీహబ్) మంచి ఉదాహరణ. దేశంలోనే మొట్టమొదటిదైన ఈ మహిళా పారిశ్రామిక వేత్తల ఇంక్యుబేటర్... 6,376 అంకురాలు, సూక్ష్మ, చిన్న పరిశ్రమల స్థాపనకు 7,828 మందికి సహకారం అందించింది.

# ఫిబ్రవరి 4- తెలంగాణ సోషల్ జస్టిస్ డే ?

తెలంగాణ అసెంబ్లీ 2025 ఫిబ్రవరి 4న ప్రత్యేకంగా సమావేశమై రెండు అంశాలను చర్చించింది. ఒకటి, ఎస్.సి వర్గీకరణ, ఇంకోటి కులగణన. ఈ రెంటిపై వెలువరించిన తాజా నివేదికల్ని సభ చర్చించింది. వీటిలో శాసనసభ, మండలి కూడా ఆమోదించిన ఎస్.సి వర్గీకరణ నివేదిక అంశాన్ని ముందుగా చూద్దాం.

రాష్ట్రంలో ఎస్.సి వర్గీకరణ కోసం 2024 ఫిబ్రవరి 4వ తేదీన మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, వర్గీకరణకు విధివిధానాలను నిర్దేశించటానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే ముందు వర్గీకరణను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రభుత్వోద్యోగుల భర్తీ క్యాలెండర్‌ను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. ఎస్.సి.ల్లో సమన్యాయం లభించేలా ప్రక్రియ పూర్తయ్యాకే ఉద్యోగాల భర్తీ చేపడతామని ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పును అధ్యయనం చేయటంతో పాటు వివిధ అంశాలను పరిశీలించే క్రమంలో ఎస్.సి సంక్షేమ శాఖకు చెందిన సీనియర్ అధికారులను పంజాబ్, హర్యానా, తమిళనాడు రాష్ట్రాలలో చర్యలు తెలుసుకునేందుకు ఉపసంఘం పంపింది. న్యాయశాఖ సలహాలు కూడా తీసుకున్న అనంతరం విస్తృత సంప్రదింపుల తర్వాత ఏకసభ్య కమిషన్ ఏర్పాటుకు సిఫార్సు చేసింది. 2024 అక్టోబర్‌లో జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో కమిషన్ ఏర్పాటైంది.

అందుబాటులోని జనాభా గణన సమాచారాన్ని తీసుకుని శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించాలని, వివిధ ఉపకులాల మధ్య అంతరాలను గుర్తించేందుకు సమగ్ర అధ్యయనం చేయాలని కమిషన్‌కు ఉపసంఘం సూచించింది. ఉప సమూహాల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా వెనుకబాటుతనానికి సంబంధించిన వివిధ కోణాలను పరిశీలించటంతోపాటు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్.సి వర్గీకరణ సమగ్రంగా చేసే విధానాన్ని గుర్తించాలని తెలిపింది. రిజర్వేషన్ ప్రయోజనాలను ఎస్.సి కులాల్లోని వివిధ సమూహాలకు పంపిణీ చేసేందుకు చేపట్టాల్సిన చర్యలను సూచించాలని కోరింది.

కమిషన్ 82 రోజుల్లో నివేదికను పూర్తిచేసి 2025 ఫిబ్రవరి 3న ఉపసంఘానికి అందజేసింది. పరిశీలన అనంతరం ఫిబ్రవరి 4న మంత్రివర్గం ఆమోదించటం, శాసనసభలో ప్రవేశపెట్టటం, ఉభయ సభలూ ఆమోదించటం చకచకా జరిగిపోయాయి.

కమిషన్ నాలుగు సిఫార్సులు చేసింది. 15 శాతం ఎస్.సి రిజర్వేషన్లను మూడు గ్రూపులకు పంచాలని సూచించింది. క్రీమీలేయర్‌ని అమలు చేయాలని తెలిపింది.

తెలంగాణలోని ఎస్.సి జనాభాలో 61.96% ఉన్న మాదిగలు సహా 18 కులాలను గ్రూప్-2లోకి తెచ్చి 9% రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్ సిఫార్సు చేసింది. 29.26% ఉన్న మాల, మాల అయ్యవార్‌లతో సహా 26 కులాలకు గ్రూప్-3 కింద 5%, అదేవిధంగా 3.28% ఉన్న 15 కులాలకు గ్రూప్-1 విభాగంలో 1% రిజర్వేషన్లు ఇవ్వాలని నివేదిక వర్గీకరించింది. వీటిల్లో క్రీమీలేయర్ మినహా అన్ని సిఫార్సుల్నీ మంత్రివర్గం ఏడాది తర్వాత మళ్లీ ఫిబ్రవరి 4నే ఆమోదించిందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

దశాబ్దాల కాలం నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని, మిగతా పార్టీల సభ్యులూ కలిసి వచ్చారని, ఈ తేదీకున్న ప్రాధాన్యత రీత్యా ఫిబ్రవరి 4ను ఆయా వర్గాలు 'తెలంగాణ సోషల్ జస్టిస్ డే'గా జరుపుకోవాలని శాసనసభాముఖంగా ముఖ్యమంత్రి విజ్ఞప్తి ప్రకటన చేశారు.

ఎస్.సి వర్గీకరణకు లోక్‌సత్తా మొదటినుండీ మద్దతిస్తోంది. చాలా పార్టీలు, ప్రజా సంఘాలు కూడా ఆ పోరాటానికి అండగా నిలిచాయి. ఇటీవల కూడా వర్గీకరణకు మద్దతుగా హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మేధావుల సభ జరిగినపుడు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డిఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ హాజరై మరోసారి సంఘీభావం ప్రకటించారు. ఎందుకు ఈ ఉద్యమం న్యాయమైనదో వివరించారు. వర్గీకరణ ప్రక్రియను వెంటనే పూర్తిచేసి మాదిగలకు న్యాయం చేయాలని కొందరు మేధావులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇతర రాష్ట్రాల్లో కూడా వర్గీకరణ వేగవంతం చేసేలా తనవంతు తోడ్పాటుకు జేపీ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో, ముప్ఫై ఏళ్లుగా జరుగుతున్న ఓ ఉద్యమం న్యాయమైన లక్ష్యాన్ని నెరవేర్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ సంబరాలు జరుపుకోవటంలో తప్పులేదు. కాంగ్రెస్ పార్టీ ఆ ఘనతను చాటుకోవటంలోనూ తప్పులేదు. కానీ ఆ రోజును తెలంగాణ సోషల్ జస్టిడ్ డే గా జరుపుకోవాలనటం మాత్రం అభ్యంతరకరం.

వర్గీకరణ ఉద్యమానికి తెలుగునాట 1994లో ప్రకాశం జిల్లాలో నాంది పలికి, ఎన్ని కష్టనష్టాలెదురైనా, అప్పుడప్పుడూ అదుపు తప్పినా, మొత్తమ్మీద రాజ్యాంగ పద్ధతుల్లో పోరాటాన్ని కొనసాగించి, అందరినీ ఒప్పించిన మందకృష్ణ వర్గీకరణ ఆమోదంపై స్పందిస్తూ, మాదిగల వాటాను 11%కి పెంచాలని డిమాండ్ చేశారు. అయితే ఇతర కులాలతో కూడా కలిపితే మాదిగలకు మొత్తంగా 10% దాకా వస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. కమిషన్ పరిగణలోకి తీసుకున్న జనాభా లెక్కలు 2011 లోనివి. ఇటీవల జరిగిన కులగణన లెక్కల ప్రకారం తెలంగాణలో ఎస్.సి జనాభా అప్పటికంటే ఇంకో 2% పెరిగింది. కాబట్టి శాతంగా కాకున్నా సంఖ్యలో మాదిగలకు అదనంగా ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. క్రీమీలేయర్ మినహాయించి కమిషన్ సిఫార్సుల్ని తాము యథాతథంగా ఆమోదించామని, ఎటువంటి

రాజకీయ జోక్యం లేదని ముఖ్యమంత్రి చెబుతుండగా, ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని కులాలూ ఇప్పుడు లేవని, కేవలం 59 కులాలు ఉన్నందున అప్పట్లోలా ఎ,బి,సి,డి వర్గీకరణ కాకుండా, మూడు గ్రూపులుగానే విభజించామని కాంగ్రెస్ వర్గాలు వివరణ ఇస్తున్నాయి. ఇవన్నీ అలా ఉంచి మందకృష్ణ డిమాండ్ చేస్తున్నట్లు మాదిగలకు 11% వాటా ఇచ్చినా (ఈ డిమాండ్ నేపథ్యంలో జస్టిస్ షమీమ్ అక్తర్ కమిటి గడువును పొడిగించి మరోసారి అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది). మరో గ్రూప్‌ను సృష్టించినా … నివేదిక ఆమోదం పొందిన రోజు తెలంగాణ సోషల్ జస్టిస్ డే అవదు.

ఎందుకంటే, ప్రభుత్వంలో ఉండే ఉద్యోగులు నూటికి మూడు. అందులో రిజర్వేషన్ల వాటా 50% దాటకూడదని సుప్రీంకోర్టు తీర్పు చాలా స్పష్టంగా ఉంది. కాబట్టి ఏరకంగా చూసినా 50% పరిధిలోపు 3% ప్రభుత్వోద్యోగాల్లో మాదిగలు తమకొచ్చే అతికొద్ది వాటా కోసం పోటీపడాల్సి ఉంటుంది. క్రీమీలేయర్ కూడా కొనసాగుతుంది కాబట్టి, అవకాశాలు, పదవులు పొందిన కొద్దిమందే, ఉన్న కొద్దిపాటి అవకాశాల్నీ మళ్లీ మళ్లీ ఉపయోగించుకొనే అవకాశముంది. అవే కులాల్లో, అదే విభాగంలో ఇంకా వెనుకబడిన కులాల్లో రిజర్వేషన్ ఉన్నా, అవకాశాలు లేనివాళ్లు అనేకమంది ఉంటారు. పాఠశాల విద్యలో రిజర్వేషన్లు లేవు కాబట్టి, ఇక్కడ కాస్త మెరుగైన విద్యను అదృష్టవశాత్తో, యాదృచ్ఛికంగానో, అప్పటికే రిజర్వేషన్ ఫలాలు పొందినవారి పిల్లలవటం చేతో ఉచిత విద్యలో, ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్‌లను అందుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అంటే, మన పాఠశాల విద్య అధ్వాన్నంగా ఉంది కాబట్టి, ప్రభుత్వ పాఠశాలల్లో మరీ అధ్వానంగా ఉంది కాబట్టి, సర్కారీ స్కూళ్లల్లో ఎక్కువమంది రిజర్వేషన్ కులాల్లోనివారు, పేదల పిల్లలే చేరతారు కాబట్టి … పాఠశాల స్థాయిలోనే ఒక అంతరం ఏర్పడి 80% మంది పిల్లలు రిజర్వేషన్‌లను అందుకోవటంలో పైస్థాయిలో విఫలమవుతారు. ఒకవేళ విద్యాసంస్థల్లో వరకూ ఉన్నత స్థాయిలో రిజర్వేషన్‌లను పొందగలిగినా, నాణ్యమైన పాఠశాల విద్య పునాది లేదు కాబట్టి ఉద్యోగావకాశాల్ని అందుకోవటంలో వెనుకబడతారు. వృత్తి విద్యలో ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ సదుపాయం ఉన్నా ఎంతమంది తమ విద్యార్హతకు తగ్గ ఉద్యోగాల్ని పొందగలుగుతున్నారు?

**అంబేద్కర్ భావాల్ని సిమ్యులేట్ చేసి చూడండి !**

మనకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గణనీయ స్థాయిలో ఉంది. ఒక్కసారి బాబాసాహెబ్ అంబేద్కర్ భావజాలాన్ని కంప్యూటర్‌లో సిమ్యులేట్ చేసి చూడండి. ఇవాళున్న పరిస్థితుల్లో అంబేద్కర్ ఎలా ఆలోచించి ఉండేవారో పరిశీలించండి. రిజర్వేషన్లను తాత్కాలిక ఉపశమనంగానే ఆయన భావించారు. వాటికి నిర్దిష్ట కాలపరిమితి ఉండాలని రాజ్యాంగ నిర్మాతగా స్పష్టంగా అభిప్రాయపడ్డారు. రిజర్వేషన్ల ద్వారా ప్రభుత్వోద్యోగాల్లో లబ్ది పొందిన కొద్దిశాతం మంది మిగిలిన కోట్లాదిమంది ఎస్.సి, ఎస్.టిలు ఎదిగే అవకాశమున్న వ్యవస్థ నిర్మాణంలో భాగస్వాములవుతారని ఆశించారు. కానీ రిజర్వేషన్ పొందిన ఎస్.సిలు మిగిలిన కోట్లాదిమంది సహోదరుల పట్ల ఎంత బాధ్యతారాహిత్యంగా ఉన్నారో, తమ బొజ్జలు పెంచుకుంటూ, అగ్రవర్ణాలనబడేవారిలోని అవలక్షణాలను ఎలా అనుకరిస్తున్నారో 1956లో తన చివరిదశలో చేసిన ప్రసంగంలో మందలింపుగా చెబుతూ అంబేద్కర్ కన్నీటిపర్యంతమయ్యారు. కేవలం కొద్దిమందిని, కొన్ని కుటుంబాల్ని బాగుచేయటం కోసం బాబాసాహెబ్ రిజర్వేషన్లను ప్రతిపాదించలేదు. ఆయా వర్గాల్లోని కోట్లాదిమందిని బాగుచేయటానికి అది తొలి దశలో ఒక సాధనంగా ఉపయోగపడుతుందని ఆశించారు. అలా దళితుల్లో, ఇతర అణగారిన, బలహీన వర్గాల్లో అందరికీ అవకాశాలు పుట్టుకతో వివక్ష లేకుండా వచ్చినప్పుడే సామాజిక న్యాయం అందినట్లు. కానీ ఇప్పటికీ ఉన్న కొద్దిశాతం అవకాశాల్లో లబ్ది పొందటం కోసం రిజర్వేషన్లు పొందాలనే ఆరాటం, పోరాటం తప్ప అంబేద్కర్ ఆశించినట్లు అందరికీ ఎదిగే అవకాశాలను అందించే ప్రయత్నం కొరవడింది. రేవంత్‌రెడ్డి చాలా తెలివిగా మాట్లాడారు. ఫిబ్రవరి 4ను తెలంగాణ సోషల్ జస్టిస్ డేగా 'ఆయా వర్గాలు' జరుపుకోవాలన్నారు. ఆయా వర్గాలంటే … మాదిగలే అనుకుందాం. రాష్ట్రంలో 32 లక్షల దాకా వారి సంఖ్య ఉండొచ్చంటున్నారు. ఎస్.సి రిజర్వేషన్ వర్గీకరణ వల్ల వారిలో ఎంతమందికి ప్రభుత్వోద్యోగాలు అందుతాయి? ఎంతమంది జీవితాలు బాగుపడతాయి? అన్ని లక్షలమంది జీవితాలూ రాష్ట్రంలో బాగుపడకుండా సోషల్ జస్టిస్ డే ఎలా అవుతుంది? దేశవ్యాప్తంగా చూస్తే, మిగతా రిజర్వేషన్ వర్గాలని కూడా చూస్తే, ఈ సంఖ్య కోట్లలో, కొన్ని పెద్ద దేశాల జనాభాతో సమానంగా ఉంటుంది. వారందరికీ పేరుకు రిజర్వేషన్ ఉండటం తప్ప అవకాశాలు అందకపోతే ఏం సామాజిక న్యాయం? కేవలం మాదిగల్లో 1% మందికి అవకాశాలు అందించటం కోసం మందకృష్ణ 30 ఏళ్లు అంత పెద్ద ఉద్యమం చేయాలా?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలుగానీ, మందకృష్ణ సుదీర్ఘ ఉద్యమం వెనుక లక్ష్యంగానీ నెరవేరాలంటే సామాజిక న్యాయం అందించేందుకు కొన్ని నిర్దిష్ట చర్యలు అమలుచేయాలి. ఇవి ప్రభుత్వాలు తమ మౌలిక బాధ్యతల్లో భాగంగా అమలు చేయాలని అంబేద్కర్ ఆశించారు. కానీ ఇప్పటికే ప్రభుత్వాలు ఆ బాధ్యతల అమలులో ఘోరంగా విఫలమవుతున్నాయి.

కాబట్టి నిజమైన సామాజిక న్యాయం కోసం ఒక ప్రభుత్వాధినేతగా రేవంత్‌రెడ్డి ఈ చర్యలు తీసుకోవాలి. అలా తీసుకునేలా చేసేందుకు తన వర్గీకరణ ఉద్యమాన్ని మలిదశకు మందకృష్ణ విస్తరించాలి.

సామాజిక న్యాయం అందించడంలో అత్యంత కీలకమైనవి న్యాయమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలన. కనీసం ఇంతమేరకు చేసినా అణగారిన వర్గాలకు అవకాశాలు అందుబాటులోకి వస్తాయి, వారి ఉత్పాదకత పెరుగుతుంది. కొన్నేళ్లలో పేదరికం, వివక్ష నుంచి బయటపడగలుగుతారు.

ఏ విద్య ద్వారా అయితే అంబేద్కర్ ఆ స్థాయికి ఎదగగలిగారో,

ఆ విద్యను సమాజంలో అత్యధికులకు అందకుండా చేస్తున్నాం. కొంతమంది అంబేద్కర్ వాదులు చాలాకాలంపాటు విద్య పాత్రను గుర్తించలేదు. గుర్తించాక కూడా విద్యా ప్రమాణాల ప్రాధాన్యతను పట్టించుకోలేదు. దీనివల్ల ప్రధానంగా నష్టపోయింది అణగారిన వర్గాలు, పేదలు. వీరికి ప్రభుత్వం పేరుకి ఉచిత విద్యను అందిస్తోందిగానీ, పనికొచ్చే చదువును అందించటం లేదు. ఇంతకుముందు అనుకున్నట్లు, రిజర్వేషన్లను అందుకోవటానికి కూడా చాలామందికి ఈ విద్య ఉపయోగ పడటంలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవాళ్లలో అత్యధికులైన దళితులు, ఇతర బలహీన వర్గాలు, పేదలు కూడా ప్రయివేటు లోనైనా చదువొస్తుందన్న ఆశతో, శక్తికి మించి ఖర్చుపెడుతూ, అక్కడా పెద్దగా తేడా లేకపోవటంతో చాలా సందర్భాల్లో పై చదువులకెళ్లకుండా మధ్యలోనే మాన్పిస్తున్నారు. తెలంగాణలో ప్రభుత్వం ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ.1,10,000 పైగా ఖర్చు పెడుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా విద్యాశాఖను చూస్తు న్నారు. అయినా విద్యా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో మెరుగవలేదు. ఈ మధ్య ఓ పత్రిక రాసింది – 'ముఖ్యమంత్రి ఉపాధ్యాయుల సభలో మాట్లాడుతూ ... రెండు లక్షల మంది దాకా పిల్లలు ప్రయివేటు స్కూళ్లకు మళ్లే ప్రమాదముందని హెచ్చరించారు. కానీ లక్షా 70 వేల మందివరకే స్కూళ్లు మారటం కొంత మెరుగు' అని. ఆ స్థాయిలో ఆలోచిస్తుంటే, విద్యారంగమంటే ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్, వాళ్ల జీతభత్యాలు, ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు, కొంతమంది విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఐఐటీలు అనుకుంటుంటే, ప్రభుత్వం ఖర్చు చేస్తున్న స్కూలు ఫీజులో సగంకంటే తక్కువగానే ప్రయివేటు స్కూళ్లు కొంత మెరుగైన విద్యను అందిస్తుంటే... లోపం ఎక్కడో గుర్తించి, వేగంగా చర్యలు తీసుకోకుండా కొత్తగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, గురుకులాలు అంటూ ఇంకెంతకాలం తాత్సారం చేస్తారు? ఇంకెన్ని తరాల జన్యుసంపదను వృద్ధి చేస్తూ, కుల వివక్షను కొనసాగిస్తారు? డబ్బు కూడా అదనంగా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు కాబట్టి, ప్రభుత్వం ప్రతి రూపాయినీ సద్వినియోగం చేసేలా సర్కారీ బడుల్లో విద్యా ప్రమాణాల్ని మెరుగు పరిచేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. దీనివల్ల దళితులు, పేదలు అత్యధికంగా లాభం పొందుతారు. అదేవిధంగా అందరికీ నాణ్యమైన విద్యను అందించటం తన బాధ్యతే కాబట్టి, ప్రయివేటు స్కూళ్లలోనూ విద్యాప్రమాణాల్ని పెంచటం మీదా ప్రభుత్వం దృష్టి సారించాలి. డబ్బున్నవాళ్లు ఏదోకరకంగా మంచి విద్యను పొందగలుగుతారు, కానీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యాంశంగా పట్టించుకుంటే గానీ, అణ గారిన పేద, దిగువ మధ్యతరగతి వర్గాల పిల్లల్లో ఎక్కువమందికి, ప్రభుత్వంలోగానీ, ప్రయివేటులోగానీ నాణ్యమైన విద్య అందదు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని రీతిలో విద్యను గౌరవించే, విద్య కోసం ఎంత త్యాగమైనా చేసే తల్లిదండ్రులున్న సమాజం కాబట్టి మనది ... విద్యా ప్రమాణాల్ని పెంచేరీతిలో మార్కెట్ కూడా స్పందించేలా విద్యలో సక్సెస్‌కి నిర్వచనం మార్చటంలో ప్రభుత్వం కీలక పాత్ర పోషించాలి. ఇక మిగతాది సమాజం చూసుకుంటుంది. ఏవో కొన్ని ప్రత్యేక పాఠశాలలు కాకుండా ప్రతి ప్రభుత్వ స్కూల్‌లో నాణ్యమైన విద్య అందేలా, ప్రయివేటు స్కూల్‌లో చదివినా మంచి ప్రమాణాల చదువు అందేలా చేసిన ప్పుడే సామాజిక న్యాయానికి నిజమైన పునాది ఏర్పడుతుంది.

**ఇప్పుడైతే గురజాడ పదాలు మారేవి !**

సామాజిక న్యాయం నెలకొనటానికి మరో కీలకావసరం ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జేబుఖర్చు లేకుండా అందించడం. మహాకవి గురజాడ అప్పారావు చెప్పిన గొప్ప మాటలు మనలో చాలామందికి ఎంతోకొంత పరిచయం. గాంధీ స్వతంత్ర పోరాటానికి రావటానికిముందే స్వతంత్రానికి అర్థమేంటో గురజాడ చాలా స్పష్టంగా ఒక్క వాక్యంలో 'దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్' అని చెప్పారు. అదేవిధంగా, దేశ ప్రజల గురించి చెబుతూ, 'తిండి కలిగితే కండ కలదోయ్, కండ కలవాడేను మనిషోయ్ ... ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్' అన్నారు. ఈరోజు ఆ మహానుభావుడు ఉండి ఉంటే, పౌష్టికా హారంతో పాటు అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్య, ఆరోగ్యం గురించి పదాలు అల్లి ప్రచారం చేసి ఉండేవారు. 'మంచి చదువు, ఆరోగ్యంతో బుద్ధి వికసించినవాడు, ఉత్పాదకత పెంచగలవాడే మనిషోయ్ ... అలాంటి మనుషుల్ని తయారు చేయటమే పరిపాలనోయ్' అని చెప్పేవారు.

ఆరోగ్య రంగంలో ప్రభుత్వాలు మనదేశంలో స్వతంత్రం వచ్చినప్పటినుంచీ చేస్తున్న తప్పిదాల్ని ఇప్పటికీ కొనసాగిస్తుం డటం వల్ల ప్రతి సంవత్సరం 5.5 కోట్ల మంది పేదరికంలోకి జారిపోతున్నారు. వీరిలో అత్యధికులు దళితులు, బలహీన వర్గాలు. గంజాయి కంటే ప్రమాదకరమైన మద్యాన్ని ఒక వ్యస నంగా మార్చే స్థాయిలో ప్రోత్సహిస్తూ భారీ ఆదాయాలు పొందు తున్న ప్రభుత్వాలు, ఆ వ్యసనం వల్ల కలిగే అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొనే స్థాయిలో కూడా ఆరోగ్య రంగానికి కేటాయింపులు చేయటంలేదు. కొందరు గొప్ప భారతీయులు చేసిన అసాధారణ కృషివల్ల, విదేశాల్లో నేర్చుకొని వచ్చి ఇక్కడ అందిస్తున్న వైద్యసేవల వల్ల సంపన్నులు ఎక్కువ లబ్ధి పొందుతున్నారుతప్ప అణగారిన వర్గాలు భారీ మూల్యం చెల్లిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటివి కొంత ఆర్థిక భారం తగ్గిస్తున్నాయి తప్ప, ఆరోగ్యం అందించలేకపోతున్నాయి. జబ్బు రాకముందు, వచ్చిన వెంటనే గుర్తించి ప్రాథమిక స్థాయిలో చికిత్స అందించే పటిష్ఠ వ్యవస్థ లేకుండా, జబ్బు ముదిరాక ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయిస్తే, ఆ వ్యక్తి ఉత్పాదకత తగ్గుతుంది తప్ప పెరుగుతుందా? పనిచేసే శక్తి, కొత్త నైపుణ్యాలు నేర్చుకొనే సామర్థ్యం తగ్గితే ఆదాయాలు ఎలా పెరుగుతాయి? ఆ ఇళ్లల్లో బిడ్డలకు నాణ్యమైన జీవితం, భవిష్యత్తు ఎలా సాధ్యమవుతాయి? కాబట్టి అణగారిన వర్గాలు, పేదలు అవకాశాల్ని అందుకోవటంలో, ఆదాయాల్ని పెంచుకోవటంలో ప్రభుత్వ బాధ్యతతో సమగ్ర ఆరోగ్య విధానం అవసరం. కొద్దిపాటి అదనపు బడ్జెట్ కేటాయించి, సరైన రీతిలో ఖర్చు చేస్తే జేబు ఖర్చు లేకుండా ఈ దేశంలోని ప్రతి సామాన్యునికీ మంచి వైద్యం అందుబాటులోకి తేవచ్చు, పేదరికాన్ని శాశ్వతంగా పారదోలవచ్చు, ఉపాధి, ఉత్పాదకతలతో ఆదాయాల్ని,

దేశ ఆర్థిక రంగాన్ని పెంచవచ్చు.

ఇక మూడోది చట్టబద్ధ పాలన. దౌర్జన్యాలు చేయటం, గూండాలు జడ్జీల్లా వ్యవహరిస్తూ బందన్యాయం అందించటం వల్ల ప్రధానంగా బాధితులు డబ్బు, పలుకుబడి లేనివారు. 2020–22లో ఒక్క ఏపీలోనే ఎస్.సిలపై 6,279 దాడులు అధికారికంగా నమోదయ్యాయి.

పోలీస్‌స్టేషన్‌కి వెళ్లాలంటే వణికిపోయేవాళ్లు ప్రధానంగా దళితులు, బలహీన వర్గాలు. దొంగ సాక్ష్యాలతో కేసుల్లో ఇరుక్కుని శిక్షలు అనుభవించేవారూ ఈ వర్గాలే. కోర్టుల్లో విచారణ ఏళ్ల తరబడి సాగుతుండటం వల్ల సామర్థ్యానికి మించిన ఖైదీల్ని కుక్కు తున్న జైళ్లలో అండర్ ట్రయల్స్‌గా బెయిల్ కూడా తెచ్చుకోలేక మగ్గుతున్నవారు ఈ సామాన్యులే. సమన్యాయం లేకుండా బడితె ఉన్నవాడిదే బర్రె కావటం వల్ల అవకాశాల్ని కోల్పోతున్నదీ ఈ వర్గాలే. పోలీసులు నిష్పాక్షికంగా నేర పరిశోధన చేసే ఏర్పాటు లేకపోవటం వల్ల బాధితులవుతున్నదీ ఎక్కువగా దళిత, బలహీన వర్గాల ప్రజలే. కాబట్టి చట్ట సమానత, కాగితాల నుంచి ఆచ రణలకి రావటం, న్యాయస్థానాల్లో వేగంగా, సమానంగా కేసుల విచారణ పూర్తవ్వటం, న్యాయాలయాల చట్టం ద్వారా స్థానిక కోర్టుల ఏర్పాటు మొదలైన మార్పులతో చట్టబద్ధ పాలనను సక్ర మంగా అందించటం అణగారిన, పేద వర్గాల ఎదు గుదలకి ఎంతో కీలకం.

ఈ రకంగా రిజర్వేషన్లు, ప్రభుత్వోద్యోగాలకు ఆవల ఆయా కుటుంబాల్లోనే కోట్లమంది ఉన్నారు. అగ్రకులాల్లోనూ పేదలు న్నారు. వీరిని ఓటు బ్యాంకులుగా ఉపయోగించుకోవటం కోసమే తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాల్ని భావితరాల మీద అప్పుల భారం మోపుతూ మరీ అందిస్తున్నారనే వాదనలో ఎంతో వాస్తవం ఉంది. పేదరికాన్ని నిరంతరం కొనసాగించే, వచ్చే తరాలవారిని కూడా అర్థించేవారిగా తయారుచేసే ఈ నమూనా నుంచి – సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకంతో స్వావలం బనను, ఆత్మగౌరవాన్ని, ఆదాయాల్ని పెంచే ఆర్థిక నమూనా వైపు రిజర్వేషన్ కులాల వారిని, బయట ఉన్న పేదలను నడిపించటం ఎంతో అవసరం.

ఈ లక్ష్యాన్ని సాధించి, నాణ్యమైన విద్య, మంచి ప్రమాణాల ఆరోగ్యం, చట్టబద్ధ పాలన, సంక్షేమం – అభివృద్ధి మధ్య సమతూకం ఉన్న ఆర్థిక నమూనా కోసం రేవంత్‌రెడ్డి కృషి చేయాలి. అందుకోసం మందకృష్ణ తన వర్గీకరణ ఉద్యమాన్ని విస్తరించాలి. అప్పుడు మాత్రమే జీరోసమ్ గేమ్ లేకుండా నిజమైన సోషల్ జస్టిస్ సాధ్యమవుతుంది. ఎస్.సి వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రంగానే కాక, సామాజిక న్యాయంలోనూ తెలంగాణ దేశానికి ఆదర్శం కాగలుగుతుంది. అంబేద్కర్ భావజాలాన్ని సిమ్యులేట్ చేసినా ఇదే పరిష్కారం వస్తుంది. ఒకసారి ప్రయత్నించి చూద్దామా?

**(ఆ తర్వాత కులగణనను కూడా కలిపి ఫిబ్రవరి 4న అధికారికంగా తెలంగాణ సోషల్ జస్టిస్ డేగా జరుపుకోవాలని చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. కులగణనను కలిపినా సోషల్ జస్టిస్ ఎలా అవ్వదో ఇదే సంచికలో తర్వాత వ్యాసంలో చూద్దాం)**

★

## Form IV

Statement about ownership and other particulars about Monthly magazine **Janabalam**

1.Place of Pubilcation : Hyderabad

2.Periodicity of its pubication : Monthly

3. Printers
a. Name : Dr. Jayaprakash Narayan
b. Nationality : Indian
c: Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

4. Publisher's Name : Dr.Jayaprakash Narayan
Nationality : Indian
Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

5. Editior's Name : Dr.Jayaprakash Narayan
Nationality : Indian
Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

6. Name and Address of Individual(S) Who own the news paper and partners of Shareholders holding more than one percent of the capital : Foundation for Democratic Reforms for loksatta, Represented by Dr. Jaya prakash Narayan, National Co ordinator , H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

I, Dr. Jaya prakash Narayan,Hereby declare that the Particulars above are true to the best of my knowledge and belief.

(Sd)
Dr. Jaya prakash Narayan
Signature of the Publisher

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Jugaad Bharat United Voters
## Simplifying Democracy - Strengthening Unity

**స్వజాతీయ నమూనా మార్పు** - Model Political System

MLA **నియోజకవర్గం ప్రాతిపదికగా జుగాడ్ ద్విపక్ష పార్టీకి అంకురార్పణ**

**ఈ ప్రతిపాదన జుగాడ్ ఓటర్లది. సుపరిపాలన భారతీయులందరిదీ.**

**ధర్మో రక్షతి రక్షితః** 7th March 2025 **భారతదేశం మన జన్మభూమి**

**కష్టపడి పనిచేద్దామనే నిజాయితీ కలిగిన నిరుద్యోగులకు చక్కని అవకాశం**

1) 25 నుండి 60 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ-యువకులందరికీ "ప్రతిపాదిత జుగాడ్ ద్విపక్ష పార్టీ ఓటర్లు"గా ఇదే మా ఆహ్వానం! Co operation based on trust (నమ్మకంపైఆధారపడిన పరస్పర సహకారం) అనే ధ్యేయంతో సంఘటితంగా మీకోసం మరియు మీ పిల్లల భవిష్యత్తు కోసం ఒక ప్రయత్నం చేద్దాం రండి!

2) పార్టీ పెట్టాలన్నా, దానిని సక్రమంగా నడపాలన్నా మనకు డబ్బు కావాలి. నేనైనా మీరైనా మనయొక్క స్వార్థ ప్రయోజనానికి దీన్ని వాడుకోకూడదు. పార్టీ కార్యకర్తగా నమోదు చేసుకోవాలంటే జీవితంలో ఒకేసారి తనకష్టార్జితమైన రూ.10,000/ విరాళమివ్వగలిగి ఉండాలి. లేని పక్షంలో, సుపరిపాలన కోరుకునే జుగాడ్ ఓటరుగా జీవితంలో ఒకేసారి రూ. 5,000 కానీ, రూ. 2,000 కానీ విరాళం ఇచ్చి మమ్మల్ని ప్రోత్సహించండి. బేషరతుగా మీ ఓటుని మీకు నచ్చిన పార్టీకి వేసుకోవచ్చు. ఇది జుగాడ్ పార్టీ హామీ.

3) ఓటర్లలో పాలకవర్గం, పాలితవర్గం అని రెండే రెండు సమూహాలున్నాయి! దేశంలోని వందకోట్లమంది ఓటర్లనూ శాసిస్తున్నది మనచేత ఎన్నుకోబడిన షుమారు 4000మంది MLAలు మరియు, 1000 మంది MPలు మాత్రమే. మూడవ సమూహం మనదైనందిన జీవితంలో మనల్ని శాసించడానికి నియమితులైన శాశ్వతప్రభుత్వ ఉద్యోగస్తులే!

4) ఓటర్లే అవినీతిలేని-పార్టీ నిర్మించుకుని క్రమశిక్షణతో అత్యంత పారదర్శకంగా నిర్వహించుకోవాలి. పదవులకోసం కీచులాడుకోకూడదు. చట్టబద్ధపాలన, అధికార-వికేంద్రీకరణ, ఆర్థిక-వికేంద్రీకరణ పార్టీలోనే జరిగితీరాలి. అందుకే ఆర్థిక వికేంద్రీకరణ తగిన నిష్పత్తిలో జరగాలి మిగతా పొలిటికల్ పార్టీలు చేసిన మంచిని మెచ్చుకోవాలి. వారిని ఊరికే విమర్శించరాదు.

**జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు :** (Rs/-10,000 donors)
**Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)**

**జుగాడ్ ఓటర్లు : Sarvasri (11) JVL. NARAYANA (Nellore AP) (12) S.D.BABU (Tamilnadu) (13) T.SURYANARAYANA (Vizag AP) (14)Smt.D. SUBHADRA (15) M.RANGA RAO (16) M.SAI SUBBARAO (17) Smt.D.JANAKI (18) J.VENKATA RAO (Vijayawada AP) (19) P.NARASIMHA RAO (20) SAI SURYANARAYANA (Karnataka) (21) MSS KUMAR (22) Dr.U.V.KRISHNA MURTHY (23) M.RAMA RAO (24) NANDAN SRIDHAR (25) Smt.K.RAJESWARI (26) Smt.K.LAKSHMI (27) Justice CHANDRAKUMAR (28) K. VASUDEVA RAO (29) NARAGONI (30) D.KONDALA RAO (31) M.S. Narayana Rao (32) Sriram (Amalapuram AP) (33) P.Sunil (Bhimavaram AP) (34) Amaranath (35) B.Poorna Kumar Das 36) KHS Sarma 37) Metta Ramarao (Vizag, AP) 38) IR Rao 39) S Madhavarao 40) DRK Rao 41) Smt.P Amulya 42) pallela Devaraju 43) YSN MURTY (Kakinada, AP) 44) DV KOTESWARA RAO 45) Santosh M.Tech 46) Somanchi Radhakrishna.**

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) Your MLA Constituency name (2) your name and gender (3) your age (4) Your Voter ID 5) Cell No:**

advt

# కులగణన రాజకీయ విన్యాసాలు

***ఫిబ్రవరి 4వ తేదీనే తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన మరో నివేదిక కులగణన. పూర్తి నివేదికను కాకుండా, కొన్ని ముఖ్యాంశాలను మాత్రమే సభ్యులకు అందజేశారు.***




మొత్తం 57 ప్రశ్నలతో, 75 అంశాలతో 1,03,889 మంది ఎన్యూమరేటర్లు ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజానీకం నుంచి వివరాలు సేకరించారు. దీనికి సమగ్ర కుటుంబ సర్వే అనే పేరు తగిలించినప్పటికీ కులగణన సర్వేగానే ప్రభుత్వం ఎక్కువ ప్రచారం చేస్తోంది. అదేవిధంగా ఇందులో వెల్లడైన వివరాలన్నీ ప్రజలు స్వచ్ఛందంగా ఇచ్చినవని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తమ చేతికి తప్పొప్పుల మట్టి అంటకుండా, న్యాయస్థానాల్లో ఇబ్బంది రాకుండా జాగ్రత్త పడుతున్నారేమో తెలియదు. పైకి మాత్రం, తెలంగాణ వచ్చిన తొలినాళ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రోజులో పూర్తి చేయించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు బయటపెట్టనందున, తాజా సర్వేలోని వివరాలే అధికారికమని, నివేదికలోని వ్యక్తిగత గోప్య అంశాలు మినహాయించి మిగిలిన వివరాలను వెల్లడించడంతో పాటు, చట్టబద్ధత కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

శాసనసభలో చెప్పిన వివరాల ప్రకారం, 2024 నవంబర్ 6న మొదలుపెట్టిన కులగణన సర్వే డిసెంబర్ 25న పూర్తయింది. రాష్ట్రంలోని మొత్తం 1,15,71,457 కుటుంబాలకు గాను, 1,12,15,134 కుటుంబాలను సర్వే కవర్ చేసింది (96.9%). సర్వేలో వివరాలు చెప్పిన కుటుంబాలు గ్రామాల్లో 66,99,602 కాగా, నగర ప్రాంతాల్లో 45,15,532. వివిధ కారణాల వల్ల సర్వే చేయని 3,56,323 కుటుంబాల్లో ఎక్కువ జీహెచ్ఎంసీ, ఇతర నగరాల పరిధిలో ఉన్నాయి. సర్వేలో ఎస్.సిలు 17.43%, ఎస్.టిలు 10.45%గా తేలింది. ముస్లింలు 12.56 శాతం కాగా అందులో బీసీలు 10.8, ఓసీలు 2.48 శాతంగా ఉన్నాయి. ముస్లిం మైనారిటీలు మినహాయించి ఓసీలు 13.31%, వారితో కలిపి 15.79%. బీసీలు ముస్లింలతో కలిపి 56.33 శాతం కాగా, వారిని మినహాయించి 46.25%. ఎస్.సి వర్గీకరణ నివేదిక విషయంలో వాస్తవ ఫలితాలు, భవిష్యత్తు కార్యాచరణపై సూచనలిచ్చే లోతైన చర్చ లేకుండా పూర్తి మద్దతు తెలిపిన ప్రతిపక్ష పార్టీలు, కులగణన విషయంలో మాత్రం పలు అభ్యంతరాలను వ్యక్తం చేశాయి.

ఎన్యూమరేటర్లకి చాలా ఇళ్లలో ఎదురైన ప్రశ్న – ఎందుకోసం కులగణన చేస్తున్నారు, మేం ఎందుకు వివరాల్ని ఇవ్వాలి. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, ఇతర పట్టణ ప్రాంతాల్లో ఈ ప్రశ్న ఎదురైంది. దీనికి వారు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. అయితే ప్రశ్నించినవారిలో కూడా కొందరు... పోన్లే, ఎన్యూమరేటర్లు ఇంత దూరం వచ్చారన్న సానుభూతితో వివరాలిచ్చారు. అందులో ఆదాయం, ఆస్తుల వివరాలను చాలామంది సరిగా చెప్పలేదని ఎన్యూమరేటర్లు బాహాటంగానే చెప్పారు. ఈ రచయిత ఇంటికొచ్చినామె అయితే, ఆ కాలమ్ దగ్గర మీకు నచ్చిన ఆదాయ సంఖ్య వేసుకోండి సార్, స్థిరాస్తుల వివరాలైతే పాస్‌బుక్‌లు వంటి సాక్ష్యాధారాల్ని జతపరచాల్సి ఉంటుంది కాబట్టి, తలనొప్పి లేకుండా ఖాళీ వదిలేయండి అని సూచించారు. ఏ వివరాల వరకు ప్రజలు నిజాయితీగా సమాచారం చెప్పారో తెలియదు. అయితే పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ తెలంగాణలో వివరాల్లో కచ్చితత్వం మెరుగ్గా ఉందంటున్నారు. ఈ నేపథ్యంలోనే, తమ ఆస్తుల వివరాలు బయటపడతాయనే భయంతోనే కేసీఆర్, కేటీఆర్ సర్వేలో పాల్గొనలేదని ఒక ఉమ్మడి మిత్రుడు చెప్పినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో వ్యాఖ్యానించారు. ఆ తర్వాత సర్వే సమగ్రంగా లేదని, చాలా కుటుంబాలను విస్మరించారని కాంగ్రెస్ అగ్రనేత, తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శమని చాటుతున్న రాహుల్‌గాంధీకి కేటీఆర్ లేఖ రాశారు. కులగణన మళ్లీ జరపాలని ఈసారి అందులో తాను వివరాలు చెబుతానని తెలిపారు. పలు ప్రతిపక్ష పార్టీలు, బీసీ సంఘాలు కూడా కులగణన మళ్లీ జరపాలని డిమాండ్ చేస్తున్నాయి. పెరగాల్సిన బీసీ జనాభా 2014లో సర్వేలో కంటే 5–6% తగ్గిందని, రేషన్ కార్డులు వంటి సమాచారం ద్వారా చూసినా 30 లక్షల మంది బీసీల వివరాలు నమోదు కాలేదని కొందరంటున్నారు. బీసీలను

హిందూ బీసీలు, ముస్లిం బీసీలుగా విడదీస్తూ రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం మాట్లాడుతోందని బీజేపీ వారు ఆరోపిస్తున్నారు. ఈ రాజకీయాలన్నీ అలా ఉంచితే, అసలు కులగణన ఎందుకు అన్న మౌలిక ప్రశ్న మీద రాజకీయ పార్టీలేవీ చర్చను లేవనెత్తటం లేదు.

ఇప్పటివరకూ జరిగిన, జరుగుతున్న చర్చను బట్టి, కామారెడ్డిలో రాహుల్ ప్రకటించిన ఎన్నికల డిక్లరేషన్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు, బీసీలకు కల్పించటం, ఆ తర్వాత చట్టసభల్లో రిజర్వేషన్ కోసం పోరాటం చేయటం కులగణన లక్ష్యంగా కనబడుతోంది. కులగణన ప్రకటన సమయాల్లో పేర్కొన్న చాలా ప్రయోజనాలు వేటికీ అసలు ఆ ప్రక్రియ అక్కర్లేదని ఇప్పటికే చాలామందికి అర్థమైంది. కానీ, బీసీలకు, ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే కులగణన అవసరమని ఇప్పటికీ ఆయా వర్గాల్లో పలువురు నమ్ముతున్నారు. వాస్తవానికి రిజర్వేషన్లకి, కులగణనకి ఎటువంటి సంబంధం లేదు. కులం ఆధారిత వెనుకబాటుతనాన్ని నిర్ణయించటానికి, ఎస్.సి, ఎస్.టిల జనాభాలో మార్పుల కనుగుణంగా వారి రిజర్వేషన్ శాతంలో మార్పులకి, వెనుకబడిన వర్గాలను గుర్తించటానికి ఇప్పటికే చట్టపరమైన పద్ధతులున్నాయి. ఆయా కుల సర్టిఫికెట్లతో రిజర్వేషన్లు వర్తిస్తున్నాయి. అదేవిధంగా హిందూయేతర మతాలు ముస్లింలు కావచ్చు, క్రైస్తవులు కావచ్చు. కులం ఆధారిత రిజర్వేషన్లు పొందటానికి రాజ్యాంగం అనుమతించదు. కుల జాడ్యం ఉన్న హిందూ మతం లేదా ఆ మతం నుంచి పుట్టిన ఇతర దేశీయ మతాలకు మాత్రమే కులాధారిత రిజర్వేషన్లు వర్తిస్తాయి. మతం ఆధారిత రిజర్వేషన్లు మన రాజ్యాంగం ద్వారా సాధ్యం కాదు. కానీ వెనుకబాటుతనం ఆధారంగా భారత పౌరులుగా ఉన్న ఏ మతం వారికైనా బీసీ విభాగంలో రిజర్వేషన్ కల్పించవచ్చు. ఇప్పటికే ముస్లింలకు ఆ రకంగా రిజర్వేషన్ సదుపాయాలు అమలవుతున్నాయి. ఇవన్నీ పక్కాగా ఉన్నప్పుడు, కులగణన ద్వారా సాధించేదేమిటి? కుల స్పృహను పెంచటం తప్ప! రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విధించిన 50% పరిమితిని తొలగించి 100% రిజర్వేషన్లను కల్పిస్తామని రాహుల్ చెప్పిన మాటలు ఆచరణలో అసాధ్యం. అది సమానత్వమనే రాజ్యాంగ మౌలిక సూత్రానికే విరుద్ధం. ఒక పక్క రాజ్యాంగాన్ని కాపాడతామని, మరోపక్క రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమైన హామీలనివ్వటం అణగారిన వర్గాలను, ఇతర ప్రజలను మోసం చేయటం, ఒకరిమీద ఇంకొకర్ని ఉసిగొల్పటమే అవుతుంది. ఇవన్నీ తెలిసినా ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధికోసం యాగీ చేస్తుండగా, ఇరకాటం తప్పించుకునేందుకు రేవంత్‌రెడ్డి తమ పార్టీ తరపున 42% స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని, ఆ మేరకు బీసీలకు టిక్కెట్లిస్తామని ప్రకటించారు. రిజర్వేషన్‌ను 50% మంది పొందాలంటే, రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందని, రాహుల్ హామీపట్ల తన నిస్సహాయతను వ్యక్తం చేస్తూ వాస్తవాన్ని వెల్లడించారు. తెలంగాణ స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ఇప్పటికే ప్రత్యేకంగా ఏకసభ్య కమిషన్‌ని ఏర్పాటు చేశారు.




స్థానిక ప్రభుత్వాల్లో బీసీల రిజర్వేషన్ల ఖరారు కోసం ప్రభుత్వం అక్టోబర్ 2024లో బీసీ కమిషన్‌కు బాధ్యతలు అప్పగించింది. అయితే వెనుకబడిన వర్గాలకు సమగ్ర న్యాయం జరగాలంటే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డెడికేటెడ్ కమిషన్ వేయాలంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం సూచన మేరకు విశ్రాంత ఐఏఎస్ బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ప్రభుత్వం డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను నవంబర్ 4న ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన నివేదికను ఈ ఏడాది ఫిబ్రవరి 10న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. బీసీ సంఘాలు, ప్రజలు, మేధావుల నుంచి విజ్ఞప్తులు, బహిరంగ సమావేశాల్లో సూచనలు, ప్రణాళికా శాఖ నిర్వహించిన సమగ్ర కులగణన నుంచి లెక్కలు తీసుకుని మదింపు చేసి, తొలుత గ్రామీణ స్థానిక ప్రభుత్వాల్లో రిజర్వేషన్లపై సిఫార్సుతో నివేదిక ఇచ్చింది. సుప్రీంకోర్టు 50% మార్గదర్శకాలకు లోబడి, ఎస్.సి, ఎస్.టిలకు పోను మిగిలిన స్థానాలను రిజర్వేషన్ విభాగంలో బీసీలకు కేటాయించాలని సూచించినట్లు సమాచారం. 2019లో ఇదే తరహాలో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు పోగా స్థానిక రిజర్వేషన్‌లో బీసీలకు 22.78%, మండల పరిషత్‌లలో 18.77%, జిల్లాపరిషత్‌లలో 17.11% వాటా లభించింది. ప్రత్యేక కమిషన్ సిఫార్సును పరిగణనలోకి తీసుకొని పంచాయతీరాజ్ శాఖ రిజర్వేషన్లను ఖరారు చేసి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వివరాలను సమర్పిస్తుంది. ఇదే తరహాలో మునిసిపల్, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులు చేస్తుంది.

ఎన్నికల హామీకి అనుగుణంగా స్థానిక ప్రభుత్వాల్లో బీసీలకు 42% రిజర్వేషన్‌పై ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో రెండు అంశాలు కీలకంగా చర్చనీయం. ఒకటి, జనాభాలోని అన్ని వర్గాలలోని ప్రతిభను ప్రోత్సహిస్తూ పార్టీ టిక్కెట్లలో ప్రాతి నిధ్యం ఇవ్వటం, రెండు, ఇప్పుడు ఏదైతే స్థానిక ప్రభుత్వాల్లో బీసీలకు 42% రిజర్వేషన్ ఇస్తామన్నారో, వారి ద్వారా మిగిలిన వెనుక బడిన, పేద వర్గాలకి, మొత్తంగా సమాజానికి సాధికారత లభిం చేలా, వారిలో కొందరు రాష్ట్ర, జాతీయ స్థాయికి సైతం ఎదిగేలా స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయటం.

ఇందులో పార్టీకి టిక్కెట్లు కేటాయించాలన్న ప్రతిపాదనను ప్రతిపక్షాలు, బీసీ సంఘాలు కూడా వ్యతిరేకించటంతో, రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డెడికేటెడ్ కమిషన్ నివేదికను కూడా వారు తోసిపుచ్చటంతో ప్రభుత్వం తన చేతులకు మట్టి అంటకుండా ఈ సురక్షిత మార్గాన్ని ఎంచుకుంది. అదేవిధంగా విద్య, ఉద్యోగ రంగాలను కూడా జోడించి, స్థానిక ప్రభుత్వాలతో పాటు మొత్తం రాజకీయ రంగానికి కోటా ప్రతిపాదన చేసింది. "విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీ, ఓబీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభ సమావేశాలలో బిల్లును ఆమోదించి యూనియన్ ప్రభుత్వానికి పంపుతాం. అన్ని పార్టీల మద్దతుతో జాతీయ స్థాయిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, పార్లమెంటులో ఆమోదింపచేస్తాం. కలిసి వచ్చే రాజకీయ పార్టీల వారితో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్తుంది. ప్రధానితో పాటు అన్ని పార్టీల నేతలనూ కలుస్తాం, విజ్ఞప్తి చేస్తాం" అని సమీక్ష అనంతరం ఉపముఖ్యమంత్రి తెలిపారు. దీనివల్ల స్థానిక ఎన్నికలు ఆలస్యమై కేంద్ర నిధులు మరిన్ని రోజులు ఆగిపోయే అవకాశమున్నా, బీసీలకు 42% రిజర్వేషన్ కోసం ఆర్థిక భారం భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర శాసనసభ తీర్మానాన్ని పార్లమెంటు ఎంతవరకు ఆమోదిస్తుంది, పరిధి దాటిన రిజర్వేషన్లను తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో చేర్చటం ఎంతవరకు సాధ్యం అన్న విషయాలను పక్కనపెట్టి, స్థానిక ప్రభుత్వాల ఎన్నికల వరకే ఆలోచిస్తే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రతిపాదన ఎక్కువ, త్వరితగతిన ఆచరణీయమైనది, సరైనది. రాజ్యాంగ సవరణ లేదా కోర్టులో విషయం తేలేలోగా ఈసారికి 42% రిజర్వేషన్‌ను పార్టీ తరపున బీసీలకు టికెట్ల రూపంలో ఇద్దామన్నది సమర్ధనీయం.

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఎప్పుడో ఈ ప్రతిపాదన చేశాయి. ప్రత్యామ్నాయ మహిళా బిల్లును ఈ రకంగా రూపొందించి సుమారు పాతికేళ్ల క్రితమే పార్టీలు, ప్రభుత్వాలు, పార్లమెంటు సభ్యులకు అందజేశాయి. ఇటీవల పార్లమెంటు ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ చట్టంలో కూడా లోపాల్ని సేకరించి ఈమేరకు మార్పుల్ని తెచ్చేందుకు కృషి చేస్తున్నాయి. దీనివల్ల నాయకుల కూతుళ్లు, కోడళ్లు, ఇతర కుటుంబ సభ్యులే కాకుండా... సామాన్య, మధ్య తరగతి నుంచి కూడా సామర్థ్యం, సేవాభావం ఉన్న మహిళలు చట్టసభల్లోకి ప్రవేశించగలుగుతారు. ప్రజాదరణ ఉన్న నేతల్ని – బీసీలు కావచ్చు, మహిళలు కావచ్చు. వారిని సభ్యుల ద్వారా ఎన్నుకునే పద్ధతిని అనుసరిస్తే పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం పెంపొందుతుంది. కాబట్టి, రాజ్యాంగ సవరణ, ఇతరత్రా జాప్యాలు లేకుండా కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలు కూడా స్వచ్ఛందంగా బీసీలకు స్థానిక ప్రభుత్వాల్లో 42% టిక్కెట్లివ్వటం ఆరోగ్యకర మార్పుకి దారితీస్తుంది.

**రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోగా...**

ఇక రెండోది, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల బదిలీ, స్థానిక స్వయంపాలనకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఇప్పుడు 'జీరో'. తన వైపునుంచి ఒక్క రూపాయి ఇవ్వకపోగా, జాతీయ స్థాయి నుంచి వచ్చే స్థానిక నిధుల్ని కూడా కైంకర్యం చేస్తోంది. ఆ కాసిని నిధులు కూడా రాక, ప్రజలకు ముఖం చూపించలేక, జేబులో నుంచో, అప్పుతెచ్చో డబ్బు ఖర్చుపెట్టి అవస్థలు పడుతున్న సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు అనేకమంది ఉన్నారు.

తెలంగాణ వచ్చిన కొత్తలో కేసీఆర్ 'గ్రామజ్యోతి' పేరుతో పంచాయితీల సాధికారతకు ఒక భారీ కార్యక్రమాన్ని ప్రకటించారు. ముఖ్యమంత్రిగా అధికారులతో తన మొదటి సమావేశంలో, భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలకు ఒరవడి దిద్దిన ఎస్.కె.డే గురించి గొప్పగా ప్రస్తావించారు. గ్రామజ్యోతికి నాలుగేళ్ల కాలంలో రూ.25,000 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించి వరంగల్ జిల్లా గంగదేవిపల్లి నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే తర్వాత ఆ పథకం గురించి మాటల్లో కూడా ప్రస్తావించకుండా నీరుగార్చేశారు. ఆరోజు గనక కేసీఆర్ తాను చెప్పినట్లు గ్రామస్థాయి వరకు ప్రభుత్వాలను, పరిపాలనను బలోపేతం చేసి ఉంటే, ఆ తర్వాత సిటిజన్ చార్టర్లతో తెచ్చిన మునిసిపల్ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి ఉంటే, బహుశా 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వేరుగా ఉండేవేమో? మరోసారి ప్రజల విశ్వాసం చూరగొనేవారేమో? హైదరాబాద్ పరిధిలో అభివృద్ధి వేగంగా జరుగుతూ ప్రజలకు ఎంతోకొంత ఫలాలు అందుబాటు లోకి రావటం, మరీ ఢిల్లీ స్థాయి దుర్భర పరిస్థితులు లేకపోవటంతో ఇక్కడ బీఆర్ఎస్‌కి సీట్లు వచ్చాయి గానీ, లేకుంటే ఆ పార్టీ స్థానిక పాలన నిర్వాకానికి, మేయర్‌ని ఉత్సవ విగ్రహం చేసి ఇక్కడ్నుంచి పన్నుల ఆదాయం తీసుకోవటం తప్ప, మురుగు, వరదనీటి పారుదల, ట్రాఫిక్ నిర్వహణ వంటి కనీస వసతుల్ని కూడా పట్టించుకోకుండా

**మళ్లీ కమిటీ**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ "కులగణన ద్వారా ప్రజా సంక్షేమానికి బాటలు వేస్తున్నాం. సర్వే అనేది మొదటి దశ. నమోదును పొడిగించి, మిగిలిపోయినవారు కులగణనలో పాల్గొన్న తర్వాత మొత్తం క్రోడీకరించి, ఆయా వర్గాలకు సంక్షేమం ఎలా అందించాలన్నదానిపై కొత్తగా కమిషన్ లేదా కమిటీ వంటి వ్యవస్థను నియమిస్తాం. దీని విధివిధానాల ఖరారుకు ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తాం" అని ప్రకటించారు. ఈసారి మిగిలిన కులగణనను రాష్ట్ర బీసీ సంఘం పర్యవేక్షిస్తోంది. ఈ మొత్తం ప్రక్రియ తర్వాత... బీసీ జనాభాపరమైన విమర్శకు కొంత గట్టి సమాధానమివ్వటం, నివేదికను ఏదోరకంగా సంక్షేమ పథకాలకు సంధానం చేయటం ద్వారా కులగణనను ఓ పెద్ద సైద్ధాంతిక, విధానపరమైన అంశంగా ప్రచారం చేయటం కాంగ్రెస్ లక్ష్యంగా కనిపిస్తోంది.

చూపిన నిర్లక్ష్యానికి ఇక్కడా ఓటమి పాలయ్యేది.

కాబట్టి స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాలను వికేంద్రీకరించటం, అక్కడి ఎమ్మెల్యేలతో ఘర్షణ లేకుండా వారికి కూడా కొంత పాత్ర కల్పించే వినూత్న పరిష్కారాల్ని వెతకటం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఓట్లపరంగా, బీసీల సాధికారత పరంగా కూడా అవసరం. కానీ ప్రతిపక్షాలు, చివరికి ఆందోళన చేస్తున్న బీసీ సంఘాలూ రిజర్వేషన్ల లక్ష్యమైన ఈ స్థానిక సాధికారత గురించి మాట్లాడటం లేదు. మీడియాలో కూడా ఈ చర్చ లేదు. ఇస్తినమ్మ వాయనం, పుచ్చుకుంటినమ్మ వాయనం తరహాలో రిజర్వేషన్లు ఇచ్చి ఉపయోగమేంటి? పైగా 73,74 సవరణలతో రాజ్యాంగం లోని లోపాన్ని సరిదిద్దే ప్రయత్నం చేసి వాటిల్లో మరో పెద్ద తప్పు చేసిన పార్టీ కాంగ్రెస్. ఆ తప్పును స్థానిక ప్రభుత్వాలకు సాధికారత ద్వారా సరిచేస్తే, ఆ వైఫల్యాన్ని ఘనతగా మార్చే అవకాశం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుంది. కాబట్టి మూడో అంచెలోని పంచాయితీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు నిధులతో పాటు నిజమైన అధికారాలను అందించి, సరైన అనుసంధానానికి ఏర్పాట్లు చేసి జవాబుదారీతనం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తూ మేయర్లు, మునిసిపల్ చైర్మన్లతో మొదలుపెట్టయినా సాధ్యమైనంత మేర ప్రత్యక్ష ఎన్నికల్ని నిర్వహించాలి.

ఇక చివరిగా, ఈమధ్య రేవంత్‌రెడ్డి మలయాళ దినపత్రిక 'మాతృభూమి' తిరువనంతపురంలో నిర్వహించిన 'మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్'లో ముఖ్య అతిథిగా కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. వాటిల్లో ఒకటి, 'జాతీయ స్థాయి నాయకుల పేర్ల మీద ఓట్లు అడిగితే కులం, మతం, వర్గం వంటి సమస్యలు రావు, అదే రేవంత్‌రెడ్డి పేరుమీద అడిగితే 'రెడ్డి' అనో, మరోటనో విభజనను ఆపాదిస్తారు' అనేది.

బీజేపీని ఉదాహరణగా చూపుతూ, సర్పంచ్ ఎన్నికల్లో కూడా వారు మోదీ పేరు మీద ఓట్లు అడుగుతారని, మోదీయే సర్పంచ్ అభ్యర్థి అని ప్రజలు భావించేలా చేస్తారని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు కూడా స్థానికంగా కష్టపడుతూ, సోనియా, రాహుల్ తదితర పేర్లను ఉపయోగించుకోవాలన్నారు.

స్థానిక ఎన్నికల్లోనూ జాతీయస్థాయి నాయకుల పేర్లతో ఓట్లడగటం అనారోగ్యకర కేంద్రీకృత ధోరణి.

తనకు పార్టీ అధిష్ఠానం వద్ద పలుకుబడి ఉందని రేవంత్ పలు సందర్భాల్లో చెప్పారు. తన పరపతిని ఉపయోగించి..స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, వాటి పరిధిలోనే నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధికి చిన్న పట్టణాల అభివృద్ధి, అణగారిన, వెనుక బడిన వర్గాలకి పార్టీ తరపునే స్వచ్ఛందంగా టిక్కెట్లు, వాళు డబ్బు రాజకీయాలన్నీ తట్టుకుని గెలవగలిగేలా దామాషా పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల కోసం ఒక ప్రధాన జాతీయ పార్టీగా పోరాడేలా కాంగ్రెస్ పార్టీని రేవంత్ ఒప్పించాలి. ❖

# యువత డ్రగ్స్ ఉచ్చులో చిక్కుకోవద్దు

దేశంలో మాదకద్రవ్యాల వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోందని, దాన్ని సమూలంగా నిర్మూలించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పలువురు నేతలు పేర్కొన్నారు. డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కార్యక్రమం హైదరాబాద్ సోమాజిగూడ లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. జన వికాస సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' కార్యదర్శి పద్మనాభరెడ్డి ,జనవికాస సేవాసమితి వ్యవస్థాపకుడు పాండు రంగారావు , విశ్రాంత కలెక్టర్ ఎంవీ రెడ్డి, డాక్టర్ దేవేందర్ సింగ్, బీజేపీ నేత సాంబమూర్తి, లోక్‌సత్తా నేత దోసపాటి రాము, జన వికాస సేవాసమితి అధ్యక్షుడు తాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వి.సర్వోత్తమరెడ్డి, ప్రతినిధి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.

# ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వండి

ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై శాసనసభలో మాట్లాడి ప్రభుత్వం నుండి నిధులు విడుదలయ్యేట్లు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను ఉత్తరాంధ్ర చర్చా వేదిక కో-కన్వీనర్, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ కోరారు. ఈ అంశంపై కొణతాల క్యాంపు కార్యాలయంలో చర్చించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలోని మహేందర్ తనయ నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్టతో పాటుగా విజయనగరం జిల్లాలోని తోటపల్లి ఝుంజావతి, వెంగళరాయ, రామతీర్థసాగరం, విశాఖపట్నం జిల్లాలోని రైవాడ జలాశయాల పనులు పెండింగ్‌లో ఉన్నాయని బాబ్జీ తెలిపారు. ఈ మూడు జిల్లాల్లోని పెండింగ్ ప్రాజెక్టుల దుస్థితి చూసి రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. చిన్నపాటి మరమ్మతులకు కూడా నిధులు విడుదల చేయడం లేదన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేయటానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయాలన్నారు.రాష్ట్ర శాసనసభ సమావేశాల అనంతరం ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో జలవనరులు సాగునీటి ప్రాజెక్టుల ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ గెలుపుకన్నా, ఆప్ ఓటమి ఎక్కువ చర్చనీయాంశం

*ఇటీవలి కాలం వరకూ లోక్‌సత్తా వారికి, ముఖ్యంగా లోక్‌సత్తా ఉద్యమ, పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌కి తరచూ ఒక ప్రశ్న ఎదురవుతుండేది. లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు ఇంకా పుట్టనివాళ్లు, ఇప్పుడు యూట్యూబ్ ఛానళ్లలో జర్నలిస్టులుగా ఉన్నవారు కూడా ఇదే ప్రశ్న అడుగుతుంటారు. లోక్‌సత్తాలో కాస్త గుర్తింపు ఉన్నవాళ్లు ఏవైనా శుభకార్యాలు, సమావేశాలకు హాజరైనప్పుడు బంధువులో, తెలిసినవాళ్లో మాటల సందర్భంలో ఈ ప్రశ్నను లేవనెత్తటంతో పాటు కొంత సానుభూతినీ వ్యక్తం చేయటం కద్దు. ఏమిటీ ప్రశ్న – ఢిల్లీ, పంజాబ్‌లలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విజయం సాధించినప్పుడు లోక్‌సత్తా ఎందుకు సక్సెస్ కాలేకపోయింది? ఆప్ వ్యవస్థాపకులు అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కావటంతోపాటు ఆప్ జాతీయ పార్టీ స్థాయికి ఎదగగా, లోక్‌సత్తా జేపీ ఎందుకు రాజకీయ అస్త్రసన్యాసం చేశారు అంటూ అనుబంధ ప్రశ్నలు!*

ఢిల్లీ పేరుకి రాష్ట్రమైనా ఒక పెద్ద నగరపాలిక సంస్థ లాంటిది. దేశంలోనే అత్యధిక స్థాయి ఆదాయాలు, అన్ని రాష్ట్రాల ప్రజలూ ఉండటం వల్ల... విభజనల కన్నా సమస్యలపై స్పందించే శక్తిని, సుపరిపాలన పట్ల మొగ్గును, వినూత్న ఆలోచనల పట్ల ఆసక్తిని, స్వప్రయోజనాల పట్ల అవగాహనను కొంత మెరుగ్గా ఢిల్లీవాసులు ప్రదర్శిస్తుంటారు. లోక్‌సత్తా కృషి వల్ల రద్దయి, దేశానికి లక్షన్నర కోట్ల రూపాయలపైన ఆదాయం తిరిగి దక్కిన 2జీ స్పెక్ట్రమ్ లైసెన్స్‌ల అవినీతి కేసు, లోక్‌సత్తా ఆధ్వర్యంలోనే బెంగుళూరులో జరిగిన 'సాకు' సమావేశం నుంచి అవినీతి వ్యతిరేక ఉద్యమం ఆవిర్భవించింది. ప్రముఖ సామాజిక వేత్త అన్నా హజారే నేతృత్వంలో అది లోక్‌పాల్ ఉద్యమంగా మారి ఢిల్లీ కేంద్రంగా ఆ పోరాటం సాగింది. ఈ ఉద్యమాన్ని జాతీయ మీడియా విస్తృతంగా ప్రచారం చేసింది. సివిల్ సర్వెంట్‌గా పెద్ద గొప్ప ట్రాక్ రికార్డు లేకపోయినా, 'పరివర్తన' సంస్థ ద్వారా సామాజిక కార్యకర్తగా రామన్ మెగసెసే పురస్కారం పొందిన అరవింద్ కేజ్రీవాల్ ఈ ఉద్యమం ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షించారు. రాజకీయాల్లో చేరితే చెప్పుతో కొట్టండని బహిరంగంగా ప్రకటించి, ఆ తర్వాత రెండేళ్లకే, 2013లో 'ఆప్'ను స్థాపించి ఎన్నికల బరిలోకి దిగారు.

ఢిల్లీలో ఎంతో మంచి పాలన అందించిన షీలా దీక్షిత్ ప్రభుత్వం కూడా ఆ అవినీతి వ్యతిరేక ఉద్యమంలో కొట్టుకు పోయింది. కాంగ్రెస్ అంతర్ధానమై ఆ స్థానంలోకి 'ఆప్' ప్రవేశించింది.

ప్రధానమంత్రి నుండి బంట్రోతు వరకూ అందరూ... ఎన్నికవని లోక్‌పాల్ పరిధిలోకి రావాలి, ఇప్పటివరకూ ఉన్న సీబీఐ సహా అన్ని వ్యవస్థలన్నీ కూల్చివేయాలి' అన్న డిమాండ్‌ను, రాజకీయాల పట్ల అన్నా హజారే బృందం ద్వేషాన్ని వ్యతిరేకించినప్పటికీ, లోక్‌పాల్ ఉద్యమాన్ని జేపీ సమర్థించారు. సుప్రీంకోర్టు సుప్రసిద్ధ మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, వివిధ రంగాలలో నిష్ణాతులైనవారందరితో ఢిల్లీలో ఒక రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి పలు అంశాలపై ఏకాభిప్రాయం సాధించి జేపీ ఆధ్వర్యంలో లోక్‌పాల్ బిల్లును రూపొందించారు. సుదీర్ఘ చర్చ అనంతరం లోక్‌సత్తా రూపొందించిన బిల్లులోని అంశాలతోనే లోక్‌పాల్ చట్టం వచ్చింది. ఆప్‌కి తొలినుంచీ జేపీ మద్దతిచ్చారు. దేశ, విదేశాల్లోని లోక్‌సత్తా వాళ్లు ఆప్‌కి ఎన్నికల సమయంలో ప్రచారం చేయటంతోపాటు, వనరుల్ని, నాయకత్వాన్ని అందించారు. 2015, 2020లో ఆప్ ఘన విజయం సాధించింది. 50 శాతానికి పైగా ఓట్లు గెలుచుకుంది. 2014 ఎన్నికల్లో తెలుగునాట లోక్‌సత్తాకి మద్దతివ్వాలని, జేపీ, కేజ్రీవాల్ కలిపి పనిచేయాలని చేతన్ భగత్ వంటివారు ప్రయత్నించినా, వారి విజ్ఞప్తి మేరకు జేపీ బృందం వెళ్లి స్వయంగా కలిసినా, ఆప్‌లో లోక్‌సత్తా విలీనమైతేనే పరిశీలిస్తానని కేజ్రీవాల్ ప్రకటించటంతో అది ఆచరణలోకి రాలేదు. 2014 తర్వాత ఎన్నికల్లో పోటీకి లోక్‌సత్తా దూరంగా ఉంది. అయినా ప్రతి ఎన్నికల్లోనూ ఆప్‌కి వనరుల సమీకరణ సహా అన్ని రకాలుగా జేపీ మద్దతిస్తూ వచ్చారు.

ఓటుకు – తమ జీవితానికి సంబంధాన్ని కొంతమేరయినా స్పష్టంగా అర్థం చేసుకుని మార్పు కోసం ప్రయత్నించే మధ్యతరగతి వర్గాలు ఢిల్లీలో గణనీయ సంఖ్యలో ఉండటం, జాతీయ మీడియా విపరీత ప్రచారాన్నివ్వటం మొదలైన

కారణాల వల్ల ఢిల్లీలో 'ఆప్' గెలుపు సాధ్యమైందని, అలాంటి పరిస్థితులు లేకపోగా, సంపన్నులు, మధ్యతరగతి వర్గాలు మార్పు కోసం పరిమితంగానే ప్రయత్నించే, కులం వంటి ప్రభావాలు ఎక్కువగా ఉండే, ఎన్నికల్లో అక్రమ డబ్బు ప్రభావం దేశంలోనే అత్యధికంగా ఉండే రాష్ట్రాలు లోక్‌సత్తా కార్యక్షేత్రాలుగా ఉన్నాయని ... తేడాను జేపీ ఓపిగ్గా తెలియజేస్తుండేవారు.

అయినా మళ్ళీ ఎన్నికల్లో లోక్‌సత్తా ఎప్పుడు పోటీ చేస్తుంది? 'ఆప్' లాగా ఎప్పుడు అధికారంలోకి వచ్చి జేపీ ముఖ్యమంత్రవుతారు? ప్రశ్నలు కొనసాగుతుండేవి.

లోక్‌సత్తా ఎన్నికల్లో పోటీ చేయలేకపోయినా, దేశంలో ఏ ఇతర పార్టీకన్నా, అత్యున్నత స్థాయి అధికారంలో ఉన్నవారి కన్నా లోతైన రాజకీయ కృషిని ప్రతిరోజు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ద్వారా పార్టీల కతీతంగా చేస్తోందని చెప్పేవారు. పదవులకన్నా దేశంలో మౌలిక మార్పు తమ లక్ష్యం కాబట్టే మూడు రాజ్యాంగ సవరణల్ని, ఏడెనిమిది చట్టాల్ని, పలు విధానపరమైన మార్పుల్ని ఒక ఎంపీ కూడా లేకుండా సాధించగలిగిందని జేపీ వివరిస్తుండేవారు. దేశచరిత్రలో మొట్టమొదటిసారిగా విద్యా ప్రమాణాలను లక్ష్యంగా ప్రస్తావించిన జాతీయ విద్యా విధానం 2020 రావటం, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసి భవిష్యత్తు తరాల మీద మోయలేని భారం మోపే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణపై ప్రభుత్వాలు వెనక్కి తగ్గటం వంటివి ఇటీవలి కాలంలో లోక్‌సత్తా సాధించిన విజయాలు. పాఠశాల స్థాయిలో విద్యా ప్రమాణాల్ని మెరుగుపరచటం, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, వ్యవసాయాన్ని లాభసాటి చేస్తూ గ్రామీణ యువతకు ఉపాధినందించేందుకు చిన్న పట్టణాల అభివృద్ధి, చట్టబద్ధపాలన, అప్పు చేసిన డబ్బుతో తాత్కాలిక, వ్యక్తిగత సంక్షేమ పథకాల్ని ఇవ్వకుండా సంక్షేమం – ఆర్థికాభివృద్ధి మధ్య సమతూకం, ఎన్నికల్లో అక్రమ ఖర్చు లేకుండా దామాషా పద్ధతి, పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం వంటి సంస్కరణల కోసం ఇప్పుడు లోక్‌సత్తా కృషి చేస్తోందని చెప్పేవారు. వీటికి దోహదం చేసేలా మంచి చేసినప్పుడు ఆయా నాయకుల్ని, పార్టీల్ని సమర్థించటం, వీటికి భంగం కలిగించేలా వ్యవహరించినప్పుడు పరిష్కారంతో కూడిన విమర్శ చేస్తూ బహిరంగ చర్చ ప్రమాణాల్ని పెంచుతోందని, సాంకేతికతను వినియోగించుకుంటూ వీలైనంత ఎక్కువమంది ప్రజల్ని, ముఖ్యంగా యువతను క్రియాశీలంగా చైతన్య పరుస్తోందని జేపీ మళ్లీ మళ్లీ తెలియజెప్పేవారు. కేవలం ఢిల్లీలో అధికారం ద్వారా వీటిని సాధించలేకపోయినా, వీటిపై దేశవ్యాప్త చర్చ లేవనెత్తటంలో ఆప్ కీలకపాత్ర పోషించాలని కొంతకాలం క్రితం ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాలల్ని, మొహల్లా క్లినిక్‌లను సందర్శించిన సందర్భంగా కేజ్రీవాల్‌కు మరోసారి మెంటారింగ్ చేశానని, ఆప్ ప్రభుత్వం విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టటం తప్ప మౌలిక మార్పులు తేకున్నా ... పంజాబ్ ఎన్నికల్లో ఆ పార్టీకి లోక్‌సత్తా తరపున మద్దతు ప్రకటించానని, అయితే ఈ లక్ష్యాల సాధన అలా ఉంచి, ఉన్నకొద్దీ వీటికి దూరమవుతూ, తాత్కాలిక తాయిలాల్ని మితిమీరి పంచటం, ఓపీఎస్ వంటి ప్రమాదకర హామీలనివ్వటం ద్వారా ఎన్నికల రాజకీయాన్ని మరింత దిగజార్చటం, ప్రధాన సాంప్రదాయ పార్టీల్లాగా ఓట్ల కోసం లెక్కలు చూపని డబ్బు రాజకీయం చేయటం, వ్యక్తిగత ప్రచారం కోసం ప్రజాధనం దుర్వినియోగం చేయటం, ప్రజలు, మీడియా దృష్టిని ఆకర్షించటానికి అబద్ధపు ప్రచారాలతోపాటు, రాజ్యాంగ వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీయటానికి కూడా వెనుకాడకపోవటం వంటివి తనను నిరాశ పరిచాయని, అందువల్ల ఇటీవల కాలంలో ఆప్‌కి కొంతదూరం పాటిస్తున్నట్లు జేపీ మాట్లాడేవారు.

పాఠశాల స్థాయిలో విద్యా ప్రమాణాల్ని మెరుగుపరచటం, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, వ్యవసాయాన్ని లాభసాటి చేస్తూ గ్రామీణ యువతకు ఉపాధినందించేందుకు చిన్న పట్టణాల అభివృద్ధి, చట్టబద్ధపాలన, అప్పు చేసిన డబ్బుతో తాత్కాలిక, వ్యక్తిగత సంక్షేమ పథకాల్ని ఇవ్వకుండా సంక్షేమం – ఆర్థికాభివృద్ధి మధ్య సమతూకం, ఎన్నికల్లో అక్రమ ఖర్చు లేకుండా దామాషా పద్ధతి, పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం వంటి సంస్కరణల కోసం ఇప్పుడు లోక్‌సత్తా కృషి చేస్తోందని వివరించేవారు.

ఇన్ని చెప్పినా, కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే బెంగుళూరు స్థానిక ఎన్నికల్లో ఆప్‌కి అంతకుముందు లోక్‌సత్తాకి వచ్చిన ఓట్లతో ఐదోవంతు మాత్రమే వచ్చినా... జేపీకి, లోక్‌సత్తాకి అధికారం చుట్టూనే తరచూ ప్రశ్నలు వస్తుండేవి. ఎప్పుడైతే మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్, ఆయన సన్నిహిత సహచరుల మీద బలమైన ప్రాథమిక ఆధారాలున్నట్లు ఆరోపణలు వచ్చి జైలుకెళ్లే పరిస్థితి వచ్చిందో, అప్పుడు తత్వం బోధపడి ఆ తరహా ప్రశ్నలు బంద్ అయ్యాయి.

❖

# 'ఆప్'కి ఆత్మశోధన అవసరం

## ప్రత్యామ్నాయ రాజకీయంతో ప్రధాన సాంప్రదాయ పార్టీలూ అంతరాన్ని తగ్గించుకోవాలి

వరుసగా మూడోసారి సొంతంగా గెలవటం ఓ పార్టీకి అసాధ్యం కాదుగానీ, అంత తేలిక కాదు. బీజేపీతో హోరాహోరీ పోటీ నెలకొన్నప్పటికీ, ఆప్ కే కొంత పైచేయి ఉన్నట్లు భావించారు. దానికితోడు పోలింగ్ గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే 2.28% తగ్గి, 60.54%కి పరిమితమవటం అధికార పార్టీకే మొగ్గు ఉంటుందనే అభిప్రాయం కలిగించింది. అయితే ఎగ్జిట్ పోల్స్‌లో ఎక్కువ శాతం బీజేపీకే గెలుపు మొగ్గునిచ్చాయి. తక్కువ సీట్లు కావటం, ఎక్కువ శాంపిల్స్ సేకరించి, శాస్త్రీయంగా విశ్లేషించటం వల్లనేమో ఈసారి ఎగ్జిట్‌పోల్స్ నిజమయ్యాయి. 47.15 శాతం ఓట్లతో బీజేపీ 48 సీట్లు గెలుచుకోగా, 43.57 శాతం ఓట్లతో ఆప్ 22 సీట్లకు పరిమితమైంది.

27 ఏళ్ల తర్వాత బీజేపీ అధికారంలోకి రావటం కన్నా, ఆప్ అధికారాన్ని కోల్పోవటం, కేజ్రీవాల్ సైతం ఓడిపోవటం అనేక రకాలుగా ఎక్కువ చర్చనీయాంశమనటంలో సందేహం లేదు.

ఎన్నికల్లో గెలవాలంటే, స్థానికంగా, దేశం నలుమూలల నుండి ఢిల్లీకి వలన వచ్చి, దుర్భర జీవితాలు గడిపే అసంఘటిత రంగ సామాన్యుల ఓట్లు ఎంతో కీలకం. అందువల్ల వారి నిత్య జీవితావసరాల్లో కీలకమైన అంశాల్ని ఉచితంగా ఇస్తూ, వారి అభివృద్ధికి దోహదం చేసే విద్య, ఆరోగ్యం వంటి అంశాల మీద కూడా కేజ్రీవాల్ దృష్టి సారించారు. మధ్యతరగతి వారు కూడా ఉచితాలకు అలవాటుపడ్డారు. కానీ కాలక్రమంలో ఉచితాల భారం పెరుగుతూ, పేదల్ని మధ్యతరగతివారుగా, మధ్యతరగతిని ఆ పై స్థాయివారుగా పెంచే అభివృద్ధి నమూనా దెబ్బతింది.

**ఉచితాలు ఉండాలా, వద్దా చర్చ దాటిపోయాం**

సంపన్న రాష్ట్రమైన ఢిల్లీ కూడా తాత్కాలిక సంక్షేమ పథకాలకు కొంత అప్పులు చేయాల్సి వచ్చింది. తాత్కాలిక సంక్షేమ పథకాలు అవసరమే. కానీ ఉత్పాదకంగా ఉండాలి, అభివృద్ధితో సమతూకంతో ఉండాలి. సంక్షేమం – అభివృద్ధి మధ్య ఆ సమతూకం దెబ్బతిని, పార్టీలు పోటాపోటీగా ఉచితాల్ని హామీలు ఇవ్వటం, గెలిచాక అప్పులు చేసి మరీ ఉచితాల్ని అమలు చేయటం చాలా రాష్ట్రాల్లో ఒరవడిగా తయారైంది. రేవిడీ సంస్కృతి అంటూ తాత్కాలిక తాయిలాలను వ్యతిరేకించే మోదీ కూడా, కేజ్రీవాల్ హయాంలోని ఉచితాలన్నీ కొనసాగుతాయని ప్రకటించారు.



ఇవికాక ఆయన పార్టీ మూడు సంకల్ప పత్రాలతో ఇంకొన్ని భారీ తాయిలాల్ని హామీ ఇచ్చింది. అయితే ఓటర్లు ఇటీవలి కాలంలో ఒక సంకేతాన్నిస్తున్నారు. తాయిలాలు తీసుకుంటూనే, అవి గత ఎన్నికలకంటే ఈసారి ఎన్నికల్లో మరింత ఎక్కువ స్థాయిలో ఉండాలి అని. అంటే, తాయిలాలు ఒక పరిధి దాటితే వాటికోసం ఆర్థికాభివృద్ధి అనివార్యం. కాబట్టి, ఫలితాలు ప్రజలందరికీ అందేలా సమ్మిళిత వృద్ధికి చర్యలు తప్పనిసరి అని. అభివృద్ధి ప్రాధాన్యత అర్థమవుతూ ... భవిష్యత్తు పట్ల విశ్వాసం పెరుగుతుంటే, క్రమంగా ఉచితాల పట్ల మొగ్గు తగ్గుతుంది. సంక్షేమం, అభివృద్ధి సమతూకం మరింత మెరుగ్గా సాధ్యమవుతుంది.

**మెరుగైన సంకేతమిచ్చిన ఢిల్లీ ప్రజలు**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ దిశగా ప్రజలు ఇంకా మెరుగైన సంకేతమిచ్చారు. అభివృద్ధి చెందిన దేశాల ప్రజలను గుర్తుకు తెచ్చారు. అభివృద్ధి, తాత్కాలిక తాయిలాలు ఉన్నా, తమకు కనీస సౌకర్యాలున్న పరిపాలన కూడా ముఖ్యమని ప్రజలు స్పష్టం చేశారు. మధ్యతరగతి ప్రజల వల్లే ఒకప్పుడు వేగంగా ఎదిగిన కేజ్రీవాల్, ఈసారి వారి నుంచే గట్టి వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. మరోవైపు బీజేపీ కూడా తాత్కాలిక హామీలు ఇవ్వటంతో పాటు, రూ.12.75 లక్షల ఆదాయం వరకు పన్నుకు కేంద్రం మినహాయింపు ఇవ్వడం, కేజ్రీవాల్, ఆయన మంత్రులపై అవినీతి ఆరోపణలుతో ఆప్ 2020 కంటే 10 శాతం ఓట్లు కోల్పోయి ఘోర పరాజయం పాలైంది.

ఎన్నికల్లో ఎటువంటి అక్రమ ఖర్చు చేయకుండా పారదర్శకంగా వ్యవహరిస్తానని, పేదరికాన్ని తొలగించే, ప్రజల జీవన ప్రమాణాల్ని పెంచే విధానాలను అమలు చేసే ప్రత్యామ్నాయ రాజకీయాన్ని పాదుకొల్పుతానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ ... కాంగ్రెస్, బీజేపీల తరహాలోనే సాంప్రదాయ ఎన్నికల రాజకీయం చేయటంతో

పాటు కనీసం సంపద సృష్టికి దోహదం చేసే, ప్రజల ఆదాయాల్ని పెంచే విధానాలను కాకుండా, పేదరికాన్ని నిరంతరం కొనసాగించే ఆర్థిక పథకాలను అమలుచేశారు. అధికారమే లక్ష్యంగా రాజకీయం చేశారు. కేజ్రీవాల్ వ్యక్తిగత అవినీతికి పాల్పడకపోయి ఉండొచ్చు, కానీ గోవా ఎన్నికల్లో అంత భారీ డబ్బు ఖర్చు కోసం మద్యం కుంభకోణానికి పాల్పడ్డారనటానికి బలమైన ఆధారాలున్నాయి. అది కోర్టులో నిరూపితం అవుతుందో, కాదో చెప్పలేం కానీ, ఆ రాజకీయ అవినీతి ఒక నిష్టుర సత్యమని ఆయన మాజీ సహచరులు, ఆయన్ని దగ్గరగా పరిశీలిస్తున్న రాజకీయ విశ్లేషకులు సైతం చెబుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ స్థాయిలో ఆయన రాజకీయ అవినీతికి, ఎన్నికల్లో డబ్బు వెదజల్లటానికి పాల్పడి ఉండకపోవచ్చు ... కానీ ఆ విషయంలో ఆప్ నుంచి 'జీరో' అవినీతిని ప్రజలు ఆశిస్తారు. అందుకే మిగతా పార్టీల పట్ల చూసీచూడనట్లు వ్యవహరించిన మధ్యతరగతి ... కేజ్రీవాల్ అండ్ కో అవినీతి పట్ల తీవ్ర ఆగ్రహంతో ప్రతిస్పందించారు. కేజ్రీవాల్ చాలా తెలివైన, ఎత్తుగడల్లో ఆరితేరిన రాజకీయ నేత అని చెబుతారు. మద్యం కుంభకోణంలో అరెస్టయి జైలుకెళ్లాక కూడా, కోర్టు షరతులు విధించినా కూడా ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగుతుంటే ఏదో చాణక్య వ్యూహం ఉందనే విశ్లేషణలే ఎక్కువగా వినిపించాయి. కానీ జైలు నుంచి బయటకొచ్చాకగానీ ప్రజల్లో వ్యతిరేకత అర్థం కాలేదు. అప్పుడు కూడా, అతిశీని ముఖ్యమంత్రిని చేసి, ప్రజాతీర్పుతో తాను మచ్చలేని నాయకుడినని నిరూపించుకున్నాకే తిరిగి ముఖ్యమంత్రి పదవి చేపడతానని చెప్పినా, కేజ్రీవాల్ కూర్చున్న సీఎం సీటును ఖాళీగా వదిలి, పక్కనే మరో కుర్చీలో అతిశీ కూర్చోవటం, దాన్ని కేజ్రీవాల్ ఖండించకపోవటం ప్రజలకు వెగటుగా అనిపించింది. అవినీతికి అహంకారం తోడైనట్లు మధ్యతరగతి భావించారు. కొన్ని నెలల ముందు ఇండియా కూటమిగా కలిసి పోటీ చేసి, ఇప్పుడు ఒకరినొకరు తీవ్ర పదజాలంతో విమర్శిం చుకుంటూ, 'ఏదో అదృశ్యశక్తి' ఆదేశించినట్లు వేర్వేరుగా ఓట్లు అడిగేసరికి ప్రజల్లో కొంత తికమక ఏర్ప డింది. బీజేపీ, ఆప్ మధ్య ఓట్ల తేడా కేవలం 3.58% కాగా కాంగ్రెస్ తన ఓట్లను 2% మేర పెంచుకుని 6.26% ఓట్లు సాధించింది. ఆప్, కాంగ్రెస్ కలిసి పోటీ చేసి ఉంటే కూటమి విజయం సాధించేదనటానికి స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నాయి.

**మూలాల్లోకి ఆత్మ పరిశీలన అవసరం**

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ఢిల్లీ అభివృద్ధి కోసం ఎంతో చేసిన ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ ఓడిపోయారు. అదేవిధంగా బీజేపీ తిరిగి అధికారంలోకి

**కొన్ని నెలల ముందు ఇండియా కూటమిగా కలిసి పోటీ చేసి, ఇప్పుడు ఒకరినొకరు తీవ్ర పదజాలంతో విమర్శించుకుంటూ వేర్వేరుగా ఓట్లు అడిగేసరికి ప్రజల్లో కొంత తికమక ఏర్పడింది. బీజేపీ, ఆప్ మధ్య ఓట్ల తేడా కేవలం 3.58% కాగా కాంగ్రెస్ తన ఓట్లను 2% మేర పెంచుకుని 6.26% ఓట్లు సాధించింది. ఆప్, కాంగ్రెస్ కలిసి పోటీ చేసి ఉంటే కూటమి విజయం సాధించేదనటానికి స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నాయి.**

రావటానికి 27 ఏళ్లు పట్టింది. కాబట్టి కేజ్రీవాల్ తన ఓటమి గురించి అతిగా చింతించనక్కర్లేదు. కానీ ఈ ఈవీఎంలపై ఆరోపణలు వంటి వాటితో ఆత్మవంచన చేసుకోకూడదు. మూలాల్లోకి వెళ్ళి లోతుగా ఆత్మపరిశీలన చేసుకోవటం అవసరం. తాను ఎందుకు రాజకీయాల్లోకి వచ్చారో, 'స్వరాజ్యం' అనే దిశానిర్దేశ పుస్తకం ఎందుకు రాసుకున్నారో, ఎంతమంది కెరీర్‌లు కూడా వదులుకుని తనకెందుకు మద్దతిచ్చారో ... ఆ లక్ష్యాన్ని గుర్తుచేసుకోవాలి. స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఆపద్ధర్మంగా అబద్ధాల్ని, ఒక పరిధిమేర ఆరోపణల్ని చూసీ చూడనట్లు వదిలేయవచ్చుగానీ, లక్ష్యాన్ని, విశ్వసనీయతనే దెబ్బతీసేలా రెండు నాల్కల ధోరణితో మాట్లాడటం ఏ రకంగా చూసినా కేజ్రీవాల్ లాంటి నాయ కుడికి తగదు. ఒక పరిధి దాటి నిందారోపణల్ని, విద్వేష పూరిత వ్యాఖ్యల్ని చేసినందుకు మోదీ కూడా ఓట్లు, సీట్ల పరంగా మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

మూలాల్లోకి వెళ్లి వాస్తవాల్ని సమీక్షించుకుంటే విషయం సుస్పష్టం. ఆప్‌కి ప్రధానంగా బలం ఉన్నది ఢిల్లీలో. పంజాబ్‌లో గెలవటం, మరికొన్నిచోట్ల కొంతమేర ప్రభావం చూపటం ఒకరకంగా అద్భుత విజయాలు. ఢిల్లీ దాటి విస్తరించటానికి సాంప్రదాయ రాజకీయ పార్టీల తరహాలో రాజకీయం చేయటం కంటే ఢిల్లీ కేంద్ర బిందువుగా ప్రత్యామ్నాయ రాజకీయాన్ని, సుపరిపాలనను ఒక ఆచరణ సాధ్య నమూనాగా, మొత్తం దేశానికి చూపాలి. దుష్పరిపాలన, అరకొర సంస్కరణలు, ఓటును అమ్ముకోవటం, అప్పు చేసి మరీ ఇచ్చే తాత్కాలిక తాయిలాల వల్ల ఇంతకాలం తమకు జరిగిన నష్టం, ప్రత్యామ్నాయంగా సమ్మిళిత అభివృద్ధి, మంచి పాలన ద్వారా కలిగే ప్రయోజనాలు ప్రజలకు అర్థమయ్యేలా చేయాలి. దేశవ్యాప్తంగా ఇందుకు తోడ్పడే ప్రజాస్వామ్య శక్తుల్ని సమీకరిస్తూ పంజాబ్‌లో కావచ్చు, మరోచోట కావచ్చు ... ఎక్కడ పరిస్థితులు అనుకూలిస్తే అక్కడ ఎన్నికల్లో పోటీ చేస్తూ, కొత్తతరం రాజకీయాన్ని విస్తరించాలి. ఒకపక్క ఈ

***ఢిల్లీ వంటి సంపన్న రాష్ట్రంలో, ఇప్పటికే భారీ తాత్కాలిక సంక్షేమ పథకాల్ని ఇస్తున్న ఆప్, 2025 ఎన్నికల్లో వాటిని కొనసాగిస్తూ కొత్తగా ఉచితాల హామీలనిచ్చినా, అభివృద్ధి వున్నా ప్రజలు ఓడించటానికి ఒక ప్రధాన కారణం – స్థానికంగా, రోజువారీ పాలన అధ్వాన్నంగా ఉండటం. పారిశుధ్యం, దోమల నివారణ, వరదనీటి పారుదల, కాలుష్య నియంత్రణ వంటివి అధ్వాన్నంగా ఉంటే ఎన్ని ఉచితాలనిచ్చినా ప్రజలు ఓడించటం ఖాయం. వేగంగా పట్టణీకరణ జరుగుతున్న మన సమాజంలో ఈ ముప్పు అన్నిచోట్లా కనిపించటం ఖాయం.***


రకంగా ఓపిగ్గా ప్రయత్నిస్తూనే ఈ లక్ష్యాల్ని వేగంగా సాధించటానికి వీలుగా అవసరమైన చట్టబద్ధపాలన, ఎన్నికల సంస్కరణలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, గ్రామీణ చిన్న పట్టణాల అభివృద్ధి, పార్టీల ప్రజాస్వామీకరణ వంటి అంశాల మీద కేజ్రీవాల్ దృష్టిసారించాలి.

**ఎవరికీ సంతోషం కాదు**

కేజ్రీవాల్‌ను వ్యతిరేకించేవారు సైతం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీపరంగా, వ్యక్తిగతంగా ఆయన ఓటమి పట్ల సంతోషంగా లేరు. కేజ్రీవాల్ తన మౌలిక బాధ్యతను గుర్తెరిగి, సూత్రబద్ధత లేని రాజకీయం, లక్ష్యం లేని అధికారం అని మహాత్మాగాంధీ చెప్పిన రెండు మహా పాపాలను చేయకుండా ప్రత్యామ్నాయ రాజకీయం కోసం దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధమైతే ఇప్పటికీ ఆప్‌కి మంచి అవకాశముంది. ఢిల్లీలో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు తక్కువేమీ కాదు. దేశానికి చేసిన నష్టాన్ని సరిదిద్దుకునే రీతిలో వ్యవహరించటంపై ఆప్ భవిష్యత్తు, కొత్తగా వచ్చే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులకు ప్రోత్సాహం ఆధారపడి ఉంటాయి.

**సాంప్రదాయ పార్టీలూ అలర్ట్ అవ్వాలి !**


ఆప్ దేశవ్యాప్తంగా విస్తరించకుండా ఉండటం బీజేపీకి కూడా సంతోషం కలిగించవచ్చు. ఎందుకంటే, ఆప్ కంటే సాంప్రదాయ రాజకీయ కాంగ్రెస్‌ని ఎదుర్కోవటం తేలిక. అయితే, ఆప్ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోకుంటే సాంప్రదాయ ప్రధాన పార్టీలు కూడా మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొద్దిగా సమయం పట్టవచ్చు. ఉదాహరణకు, ఢిల్లీ వంటి సంపన్న రాష్ట్రంలో, ఇప్పటికే భారీ తాత్కాలిక సంక్షేమ పథకాల్ని ఇస్తున్న ఆప్, 2025 ఎన్నికల్లో వాటిని కొనసాగిస్తూ కొత్తగా ఉచితాల హామీలనిచ్చినా, అభివృద్ధి వున్నా ప్రజలు ఓడించటానికి ఒక




ప్రధాన కారణం – స్థానికంగా, రోజువారీ పాలన అధ్వాన్నంగా ఉండటం. పారిశుద్ధ్యం, దోమల నివారణ, వరదనీటి పారుదల, కాలుష్య నియంత్రణ వంటివి అధ్వాన్నంగా ఉంటే ఎన్ని ఉచితాలనిచ్చినా ప్రజలు ఓడించటం ఖాయం. వేగంగా పట్టణీకరణ జరుగుతున్న మన సమాజంలో ఈ ముప్పు అన్నిచోట్లా కనిపించటం ఖాయం. ఇప్పటికే ఉచితాలు వన్‌టైమ్ ఓట్లుగా మారాయి. సమ్మిళిత అభివృద్ధి కూడా కావాలని ప్రజలు అడుగుతున్నారు. రాబోయే కాలంలో అభివృద్ధి ఉన్నా కూడా రోజువారీ పాలన స్థానికంగా సమంగా ఉంటేనే ఓట్లు వేస్తామంటారు. స్థానిక ప్రభుత్వాలకు దేశ జీడీపీలో కేవలం 0.6% ఖర్చు చేస్తున్నట్లు రిజర్వుబ్యాంకు ఆమధ్య తెలిపింది. అభివృద్ధి చెందిన దేశాల్లో నగర మేయర్లు దేశాధ్యక్షుడు, ప్రధానికన్నా ఎక్కువ ప్రాధాన్యత కలిగి ఉంటే, మన దేశంలో ఉత్సవ విగ్రహాల్లా ఉన్నారు. అమెరికా లాంటి దేశంలో మునిసిపల్ బాండ్ల మార్కెట్ విలువ 4 ట్రిలియన్ డాలర్లు (భారతదేశ జీడీపీకి సమానం) కాగా, భారత్‌లో మునిసిపల్ అభివృద్ధికి రాష్ట్ర, యూనియన్ ప్రభుత్వాలు గ్యారెంటీలు ఇవ్వాల్సివస్తోంది. కాబట్టి కనీసం నగరాలతో మొదలు పెట్టయినా స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల్ని బదిలీ చేయటం అవసరం. అదేవిధంగా ఢిల్లీలో స్వల్ప ఓట్ల శాతం తేడాతో ఆప్ అధికారాన్ని కోల్పోయింది. కాంగ్రెస్ పట్ల అభిమానం ఉన్నా వారు కూడా ఎలాగూ గెలిచేపార్టీ కాదు, మూడోస్థానంలో ఉంది. ఓటు వేస్తే వృథా అవుతుందని బీజేపీకో, ఆప్‌కో ఓటు వేశారు. ఎంతపెద్ద పార్టీకయినా, ఎప్పుడైనా ఈ సమస్య తలెత్తవచ్చు. కాబట్టి ప్రతి ఓటుకూ విలువ ఉండేలా, అక్రమ వ్యయం తగ్గేలా, ఎన్నికల సంస్కరణలు తేవటం వంటి మార్పుల కోసం సాంప్రదాయ పార్టీలు కూడా కృషి చేయాలి.

ఈ రకంగా, ఢిల్లీ అసెంబ్లీ తాజా ఎన్నికలు గెలుపోటములకు సంబంధించి మాత్రమే కాకుండా... తాత్కాలిక సంక్షేమ పథకాల ఉత్పాదకత, పరిమితి, అభివృద్ధితో సమతూకం, స్థానిక సాధికారత వరకు ప్రత్యామ్నాయ – సాంప్రదాయ రాజకీయాల మధ్య వ్యత్యాసం తగ్గించే పలు సంస్కరణల ఆవశ్యకతను తెలియచేస్తున్నాయని బీజేపీ, కాంగ్రెస్, ఇతర ప్రధాన పార్టీలూ గుర్తెరగటం అవసరం. ❖

ఎన్నికలు నిష్పాక్షికంగా జరగటం, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయటం, మెజారిటీ సాధించిన వారికి శాంతియుతంగా అధికార మార్పిడి జరగటం ప్రజాస్వామ్యానికి కీలకం. ఈ పని మన దేశంలో సవ్యంగా జరుగుతుందని స్వతంత్రం వచ్చినప్పుడు ఎక్కువ శాతం ఆలోచనపరులు అనుకోలేదు. ప్రపంచంలోనే ఏ దేశంలో లేని రీతిలో స్త్రీ, పురుష సహా ఎటువంటి వివక్ష లేకుండా వయోజనులందరికీ ఓటు హక్కును లిఖితపూర్వక రాజ్యాంగంలో పొందుపరిచి 1950 జనవరి 26 నుంచి అమల్లోకి తెచ్చినప్పుడు కూడా.. భారత్ లో ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరుగుతాయని, అధికార మార్పిడి సజావుగా జరుగుతుందని గాని పలువురు విశ్వసించలేదు. ఇండియా ప్రజాస్వామ్య సామర్థ్యాన్ని కొందరు విదేశీ రాజకీయ ప్రముఖులు, విశ్లేషకులు బహిరంగంగా విమర్శ చేశారు. వీరిలో నోబెల్ విజేతలు కూడా ఉన్నారు. అపార పేదరికానికి, అవిద్యకు, ఛాందస విశ్వాసాలకు, ప్రపంచంలో ఎక్కడా లేనంత భిన్నత్వానికి మన దేశం నిలయంగా ఉండడం అందుకు ప్రధాన కారణం. దానికి తోడు మనకు ప్రాచీన కాలం నుండి ప్రజాస్వామ్య అనుభవం ఉన్నా, ఒక సువిశాల దేశంగా ఆ అనుభవం లేదు. ఆధునిక ప్రజాస్వామ్యానికి కావలసిన హంగులు, ఆ రకంగా మన దేశంలో లోపించాయి. అయితే అపార వైవిధ్యం, సంక్లిష్టత, అమాయకత్వం. అంతరాలు, ఆత్మన్యూనత ఉన్నప్పటికీ మనమంతా ఒక్కటే, సార్వభౌమాధికారం గల ఒకే దేశం అనే భావాన్ని ఆశేతు హిమాచలం ప్రజల్లో పాదుకొల్పి ఏకం చేయటంలో మన జాతీయోద్యమ నేతల కృషిని విమర్శకులు అంచనా వేయలేకపోయారు. గాంధీ వల్ల భారత్ కి స్వాతంత్ర్యం ఇవ్వలేదని అప్పట్లో కొందరు బ్రిటిష్ అధికార ప్రముఖులే వ్యాఖ్యానించారు. కానీ గాంధీ, ఆయన సహచరులు ఒక దేశాన్నే నిర్మించారు అనే అంశం ప్రాధాన్యతను విస్మరించటం వల్ల స్వతంత్రానంతర భారత పరిణామాల గతిని సరిగా గుర్తించలేకపోయారు.




భారత్‌తో పాటు స్వతంత్రం వచ్చిన అనేక వలస రాజ్యాలు ఆ తర్వాత నియంత్రత్వంలోకి జారిపోగా, మన దేశం ఒక రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని దిగ్విజయంగా జరుపుకుంది. ఇందులో రాజ్యాంగ సంస్థగా ఎన్నికల సంఘం పోషించిన పాత్ర అనుపమానమైనది.

తొలి ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ నుంచి మధ్యలో ఎమర్జెన్సీ కాలంలో సహా ఎన్నికలను సక్రమంగా నిర్వహించడంలో 75 ఏళ్లుగా మన యంత్రాంగం సమర్థంగా వ్యవహరించింది. బ్యాలెట్ పత్రాల కాలంలో రిగ్గింగ్‌లు, ఓట్ల పెట్టెల్ని ఎత్తుకుపోవడం, దొంగ ఓట్లు, ఓటరు జాబితాల్లో అవకతవకలు, ఓటర్ల కంటే ఎక్కువ శాతం ఓట్లు పోలవటం, పర్యవసానంగా రీపోలింగులు వంటి సమస్యలు ఉన్నా, మొత్తంగా ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అధికార యంత్రాంగం శాయశక్తులా కృషి చేసేది. సమాజంలో రాజ కీయ వ్యవస్థపై నమ్మకాన్ని నింపేది. ప్రజాదరణ లేనివారు గెలిచారనే భావం ఎన్నడూ కలిగేది కాదు. ఫలితాన్ని అందరూ ఆమోదించేవారు, అధికార బదిలీ శాంతి యుతంగా జరిగేది. ఇప్పుడు కూడా ఇదే కొనసాగుతోంది. అయితే తాను వేసే ఓటుకి – తన జీవితానికి మధ్య సంబంధాన్ని అర్థం చేసుకునే వ్యవస్థల్ని ఇప్పటికీ నిర్మించ కపోవటం వల్ల, ఎన్నికయ్యాక రాజుల భావించుకుని కేంద్రీ కృత పాలనతో పెత్త నం చేసే వ్యక్తి ఆ పదవికి గెలవడానికి తన ఓటు కీలకమని మాత్రమే అర్థమయ్యే పరిస్థితి ఉండటం వల్ల, అధికారమే సర్వస్వమనే రాజకీయ సంస్కృతి గత కొన్నేళ్లుగా ప్రబలటం వల్ల, ఎన్నికల్లో మొదలైన విపరీత ధోరణుల ప్రభావం వాటితో సంబంధంలేని ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మీద కూడా వివాదాస్పద వ్యాఖ్యలకు పురికొల్పుతున్నాయి. ఇందులో ఓటింగ్ యంత్రాలపై అనుమానాల్ని రేకెత్తించడం ప్రధానమైనది.


**ఈవీఎంలపై నిరాధార ఆరోపణలు**

పూర్తిస్థాయి ఎన్నికల్లో 1983లో షాద్‌నగర్ నియోజకవర్గం లో మొదలైన ఈవీఎంల (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు) వినియోగం, క్రమంగా అన్ని ఎన్నికలకూ, నియోజకవర్గాలకూ విస్తరించి విజయవంతంగా కొనసాగుతున్న తరుణంలో, చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో తన ఓటమికి ఈవీ ఎంలే కారణమని వాదన చేశారు. పంజాబ్‌లో కెప్టెన్ అమరీందర్ సింగ్, తమిళనాడులో జయలలిత అలాంటి వాదనలే చేశారు. ఆ తర్వాత ఎన్నికల్లో ఈవీఎంల ద్వారానే గెలిచాక ఆ ఊసే ఎత్తటం మానేశారు. ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు చేసి

కొంత సంచలనం సృష్టించిన పౌర సంఘాల నేతలు, సాంకేతిక నిపుణులు కూడా నిరూపించలేకపోవటంతో, ఆ వివాదం సద్దుమణిగిందనుకుంటున్న సమయంలో ఒక ప్రధాన జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ ఇటీవల ఆ వాదనను తరచూ చేయడం మొదలుపెట్టింది.

ఈ ఆరోపణలకు ఎటువంటి ఆధారాలు చూపలేకున్నా, ఈవీఎంలు ఇంటర్నెట్ అనుసంధానం లేకుండా ప్రతీది ఒక ప్రత్యేక యూనిట్ గా పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందు నుండి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి దశలోను తమ పార్టీ ప్రతినిధి సహా సామూహిక పర్యవేక్షణలో ఉంటున్నా, ఎవరికి ఓటు వేశామో, ప్రతి ఒక్కరు ధృవీకరించుకునేందుకు వీలుగా వీవీ ప్యాట్ రసీదు సదుపాయం ఉన్నా.. ఈవీఎంల హ్యాకింగ్‌కి బీజేపీ పాల్పడుతోందని కాంగ్రెస్ ప్రచారం చేసింది.

తీరా ఫలితాలు వచ్చాక బీజేపీ మెజార్టీ మార్కును అందుకోలేక 240 సీట్లకు పరిమితమైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో గెలుచుకున్న 303 సీట్లలో 20024 సీట్లను 50%కి పైగా ఓటు షేర్‌తో గెలుచుకోగా, ఈసారి అంత భారీ మెజారిటీ సీట్లు 156 కి పరిమితమయ్యాయి. ఎన్‌డీఏ కూటమిగా మాత్రమే తాజా ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ తన సీట్ల సంఖ్యను 47 మేర పెంచుకొని 99 సాధించడంతో పాటు కూటమిగా 143 అధిక స్థానాలతో 234 సీట్లు గెలుచు కుంది. కూటమిలో లేని పార్టీలన్నీ పరాజయం పాలవటంతో, రెండు కూటముల మధ్యే చీలిన ఓట్ల శాతంతో ఎన్డీఏకి 42.5% రాగా, ఇండియా కూటమికి 40.6% వచ్చాయి. దీంతో ఈవీఎంలపై ఆరోపణలు ఆపేసింది. అయితే ఆ తర్వాత హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు చూసి మళ్లీ పాత పల్లవి అందుకుని అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ తరహాలో ఆరోపణలు చేయ సాగింది.



హర్యానాలో గెలవాల్సిన పార్టీ అయి ఉండి కూడా వ్యూహాత్మక తప్పిదాల వల్ల ఓడిపోయి, నెపాన్ని ఈవీఎంలపై కి నెట్టేసింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి , అంతకు కొన్ని నెలల ముందు జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు భిన్నంగా బీజేపీ ప్రధాన భాగస్వామిగా ఉన్న మహాయుతి కూటమి ఘనవిజయం సాధించింది. 288లో 235 సీట్లు కైవసం చేసుకుంది. ఇందులో 135 సీట్లు 50 శాతానికి పైగా ఓట్ల వాటాతో గెలుచుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీగా 13 సీట్లు, కూటమిగా 31 రాగా బీజేపీకి కేవలం 9 సీట్లు రావడం, మహాయుతి అధికారాన్ని నిలబెట్టుకోవచ్చు గానీ భారీ విజయం కష్టమన్న ముందస్తు పోల్ అంచనాల నేపథ్యంలో అసెంబ్లీలో బీజేపీకే సొంతంగా 132 సీట్లు రావడంతో ఈవీఎంలపై కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. కాంగ్రెస్ ఆరోపణలకు ఈసారి మహా వికాస్ అగాఢీ(ఎంవీఏ) కూడా గొంతు కలిపింది.

ఈవీఎంలను తప్పుపడుతున్న నేపథ్యంలో డిసెంబర్ 10, 2024న ఎన్నికల సంఘం ఒక ప్రకటన చేస్తూ 'ఈవీఎంలలో పోలైన ఓట్లకు, వీవీప్యాట్ రసీదులకు మధ్య వ్యత్యాసం కనపడలేదని, దేశమంతా ఏ విధానమైతే అమలు జరుగుతుందో మహారాష్ట్రలోనూ అదే రీతిలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని' వివరణ ఇచ్చింది.

**జమిలి ఆర్భాటం**

భారీ ఎన్నికల సంస్కరణ అంటూ జమిలి ఎన్నికల బిల్లును బీజేపీ లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దేశమంతా అన్ని ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలని బీజేపీ ప్రకటిత ఎజెండాలో భాగం అన్న మాట వాస్తవం. లా కమిషన్ కూడా గతంలో జమిలి ఎన్నికలకు సిఫార్సు చేసింది. ఇంతవరకు బాగానే ఉంది. ఈవీఎంలపై ఆరోపణలతో పోలిస్తే, జమిలి ఎన్నికల ప్రతిపాదన కొంతవరకు బాధ్యతాయుతమైనది. స్థానిక ప్రభుత్వాల నుంచి జాతీయస్థాయి వరకు ఎన్నికల్లో అప్రజాస్వామికత ఏమీ లేదు. నిజానికి ఒక పరిపక్వ ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వాగతించ తగ్గది కూడా. రాజ్యవ్యవస్థ ఏర్పాటు లక్ష్యమైన ఉమ్మడి సేవలు అందించే పరిపాలనకు అధికారం మార్గం అయితే, ఆ అధికారానికి ఎన్నికలు మార్గం. మార్గంపై వెచ్చించే సమయం, ఖర్చు , ప్రయాస ఎంత తక్కువ ఉంటే, అంత సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే మన దేశం ఉన్న అపరిపక్వ పరిస్థితుల్లో జమిలి ఎన్నికల వల్ల ఫలితం కన్నా సమస్యలు తలత్తే అవకాశం ఎక్కువ. స్థానిక, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రభుత్వాల విధులు, వాటిని సమర్థంగా నిర్వహించటానికి అవసరమైన నాయకత్వ సామర్థ్యాలపై సగటు ఓటర్ కి అవగాహన ఉండే వ్యవస్థను మనం ఇప్పటికీ నిర్మించ లేకపోయాం. దీంతో రాష్ట్రంలో ఎవరు ముఖ్యమంత్రిగా ఉంటే ఆ వ్యక్తిని, పార్టీని చూసి ఓటు వేయడం ఎక్కువ శాతం జరుగుతూ ఉంటుంది. ఏకకాలం ఎన్నికల వల్ల ఈ వివేచన రహిత ఓటింగ్ మరింత సాధారణమయ్యే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చెబుతున్నట్లు, రాష్ట్రాల ప్రాధాన్యత పెరగడమే తప్ప తగ్గటం ఉండదు. ఒకవేళ ఇప్పటికిప్పుడు స్థానిక ప్రభుత్వాలకు అన్ని రకాలుగా సాధికారతతో మూడో అంచెను బలోపేతం చేసినా వెంటనే మార్పు రాదు. ఫలితాలకు కొన్ని దశాబ్దాలు పట్టవచ్చు. ఈ నేపథ్యంలో జమిలి వల్ల ఓటు సద్వినియోగం పై అవగాహన పెరగాల్సింది పోయి సన్నగిల్లే అవకాశముంది.

రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ వేసి ఆ నివేదిక ఆధారంగా బిల్లును మోడీ ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఒక మాజీ రాష్ట్రపతి నేతృత్వంలో కమిటీ వేయడం అసాధారణం.

అలాంటప్పుడు చాలా పెద్ద ఎన్నికల మార్పుల్ని దేశం ఆశిస్తుంది. కానీ జమిలి ఎన్నికల పరిధిలో కూడా అశాస్త్రీయ ప్రాతిపదికల మీద సిఫార్సులు , గందరగోళం నివేదికలో కనిపిస్తాయి.

ఉదాహరణకు మనది బ్రిటన్ అనుసరించిన వెస్ట్ మినిస్టర్ పార్లమెంటరీ నమూనా. ఇందులో చట్టసభ ఎప్పుడైనా రద్దయ్యే అవకాశం ఉంది. దీనికి కోవింద్ కమిటీ పరిష్కారం- ఎప్పుడు సభ రద్దయితే అప్పుడు ఎన్నికల్ని నిర్ణీత కాలవ్యవధిలో మిగిలిన కాలానికి జరపటం. అంటే మళ్లీ మళ్లీ ఎన్నికలు జరపకుండా ఉండటం కోసం మళ్లీ మళ్లీ ఎన్నికలు జరుపుతున్నారన్నమాట. జమిలి ఎన్నికల లక్ష్యాన్నే గందరగోళంలోకి నెట్టే పరిష్కారమిది. చట్టసభలు జాతీయస్థాయిలో గాని రాష్ట్ర స్థాయిలో గాని రద్దు కాకుండా ఉండటం మన పార్లమెంటరీ వ్యవస్థలో అసాధ్యం. 1971లో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు జరగగా, ఆ తర్వాత 1980, 1991, 1998, 1999ల్లో లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు జరిగాయి. అదేవిధంగా రాష్ట్రాల్లో కేరళలో 1960 నుంచి 1991 వరకు ఆరుసార్లు ముందుగా ఎన్నికలు జరగగా, హర్యానాలో 1968 నుంచి 2000 మధ్య ఐదు సార్లు అసెంబ్లీకి ముందస్తు జరిగాయి. ఇదే రీతిలో కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, గుజరాత్, బీహార్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కూడా జరిగాయి . కోవింద్ కమిటీ సిఫారసు ప్రకారమైతే 1999లో ఎన్నికైన వాజపేయి ప్రభుత్వం 2001 లోనే మళ్లీ ఎన్నికలకు వెళ్లాల్సి వచ్చేది.

మరో వంక, జమిలి వల్ల జాతి ఆదాయంలో 1.5శాతం దేశానికి అదనంగా సమకూరుతుందని కోవింద్ కమిటీ పేర్కొంది. అంటే, జమిలి జరుగుతాయని చెబుతున్నా 2029-30 నాటికి ఓ పది లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూరాలి. అది ఎలాగో నివేదికలో తగిన విశ్లేషణ లేదు. ప్రభుత్వాల స్థిరత్వం రీత్యా ఆ లాభం అనుకున్నా, అస్థిర ప్రభుత్వాలున్న పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్, వాజపేయి లాంటి వారి హయాంలోనే దేశాభివృద్ధి ఎక్కువగా పరుగులు తీసింది. జర్మనీ, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా మొదలైన దేశాల్లో అధ్యయనం చేసినట్లు కమిటీ చెబుతున్నా, ఆర్థికావృద్ధి పెరుగుదల, ద్రవ్యోల్బణం తగ్గుదల, పెట్టుబడులు వంటి విషయాల్లో అంచనాలకు భారత్‌లో తగిన ప్రాతిపదికలు కనిపించవు.

1967 వరకు మన దేశంలో ఏకకాలంలోనే ఎన్నికలు జరిగాయి. కానీ ఆ తొలి 20 ఏళ్లలో ఆ తర్వాత కూడా జీడీపీ పెరుగుదల మైనస్‌లలోకి వెళ్లిన సందర్భాలున్నాయి. దేశ ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తూ రాష్ట్రాలు తాత్కాలిక వ్యక్తిగత తాయిలాల్ని పోటాపోటీగా హామీ ఇస్తూ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం జెమిని వల్ల ఏమీ తగ్గలేదని 2024లో కూడా రుజువైంది. ఉదాహరణకు ఈవేళ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నన్ని తాత్కాలిక పథకాలు దేశంలో ఎక్కడా లేవు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రం మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.

### ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం తగ్గే అవకాశం?

ఇక జమిలి వల్ల ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం తగ్గి జాతీయ పార్టీగా బీజేపీ బలపడుతుందనుకోవడం కూడా వాస్తవం కాకపోవచ్చు, అందుకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలలో ఎన్నికలే తాజా ఉదాహరణ.

తెలంగాణ, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతిన్న బీజేపీ, ఆ తర్వాత కొన్ని నెలల్లోనే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించింది. తెలంగాణలో బీజేపీకి అసెంబ్లీ కంటే లోక్‌సభకు సుమారు 22% ఓట్ షేర్ పెరిగి, సగం సీట్లు వచ్చాయి. అదేవిధంగా మహారాష్ట్రలో లోక్‌సభ మొత్తం 48లో 9 సీట్లు మాత్రమే గెలుచుకున్న బీజేపీ, ఆ తర్వాత కొద్ది నెలల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థి కాంగ్రెస్ ఎంవీఏ కూటమిని కేవలం 46 సీట్లకు పరిమితం చేస్తూ అంతకు ఐదు రెట్లకు పైగా సీట్లను మహాయుతి కూటమిగా గెలుచుకుంది. హర్యానాలోనూ లోక్‌సభలో దెబ్బతిని, ఆ తర్వాత అనూహ్యంగా అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. జమిలి ఎన్నికలు జరిగి ఉంటే, ఆ రాష్ట్రాలన్నిటిలో బీజేపీ దెబ్బతినే అవకాశం ఉండేది.

అయితే ఈ విషయంలో బీజేపీ అంచనా మరోలా ఉండుండొచ్చు. 1967 తర్వాత ఏకకాల ఎన్నికలు గాడి తప్పి లోక్‌సభ, పలు రాష్ట్రాలకు వేర్వేరుగా జరగటం మొదలయ్యాక, అప్పటిదాకా గుత్తాధిపత్యం చెలాయించిన జాతీయ పార్టీ కాంగ్రెస్ క్రమంగా బలహీనపడింది. కొన్ని రాష్ట్రాల్లో ఉనికిలో లేకుండా పోయింది. జాతీయ స్థాయిలోనూ మనుగడ కోసం పోరాడాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. జమిలి ఎన్నికలు జరిగితే జాతీయ పార్టీగా బీజేపీ బలంగా ఉంటుందని, క్రమంగా రాష్ట్రాల్లోనూ ప్రాంతీయ పార్టీల స్థానాన్ని ఆక్రమించ గలుగుతుందని ఆ పార్టీ నాయకత్వం కాంగ్రెస్ అనుభవం నుంచి అనుకుంటుండొచ్చు. అదేవిధంగా, వేర్వేరు ఎన్నికలకు అవకాశం లేకుంటే, ప్రజలు కూడా భావోద్వేగాల కంటే కొంత ఆలోచనకు ప్రాధాన్యత నిచ్చి జాతీయస్థాయిలో ప్రభుత్వం వైపు మొగ్గు చూపుతారనుకుంటుండవచ్చు. కొంతమంది సీనియర్ సెఫాలజిస్టులు కూడా ఈ రకంగా భావిస్తున్నారు. కానీ రాష్ట్రాలకు ప్రాధాన్యత పెరుగుతున్న మన ఫెడరల్ వ్యవస్థలో అది అతి ఊహాగానమే కావచ్చు.వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఈ అంశంపై పునస్సమీక్ష చేయటం మేలు. ఈవీఎంలపై బాధ్యతారహిత ఆరోపణల కంటే సంక్షోభానికి అసలైన పరిష్కారాల మీద దృష్టి సారిం చడం ఉపయోగకరం.

### అసలు సంక్షోభం

జమిలి ఎన్నికల్ని 32 పార్టీలు సమర్థించగా, 15 వ్యతిరేకించాయని, ప్రజల్లో ఎక్కువమంది సమర్థించారని కోవింద్ కమిటీ తెలిపింది. మన ప్రభుత్వాలు జాతీయ , రాష్ట్రస్థాయిలో రోజుకు 20వేల కోట్ల దాకా ఖర్చు పెడుతున్నాయి. భారతదేశ పరిస్థితుల్లో అనవసరమైన, నిరర్థకమైన ఏకకాల ఎన్నికల ద్వారా క్రమంగా ఖర్చు తగ్గి అయిదేళ్లలో ఓ అయిదారు వేల కోట్లు ఆదా అవుతాయేమో! అయినా మన మధ్యతరగతి పార్టీలు, నేతలు, గణనీయ సంఖ్యలో

జమిలి ఎన్నికల్ని సమర్థించడానికి ప్రధాన కారణం– తరచూ ఎన్నికలతో విసిగిపోవటం, చట్టసభలు సమావేశం అవుతున్న రోజుల కంటే ఎక్కువ రోజులు పాటు దేశంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీ అభ్యర్థి అనిపించు కోవాలంటే కనీసం రూ. 25–30 కోట్లు ఖర్చు పెట్టగలిగి ఉండాలి. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులకు రూ. 100 కోట్లు దాకా ఖర్చవుతుంది. 70 స్థానాలున్న ఢిల్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో రూ. 4,000–5,000 కోట్లు ఖర్చయినట్లు అంచనా. తెలంగాణలో హుజూరాబాద్, మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనే వందల కోట్లు ఖర్చుపెట్టారు. ఓ అంచనా ప్రకారం, మునుగోడు ఉప ఎన్నికలో చేసిన ఖర్చు, బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో పార్టీలన్నీ కలిపి పెట్టిన ఖర్చు కంటే ఎక్కువ. దీంతోపాటు ప్రతి తాత్కాలిక సంక్షేమ పథకం వన్ టైం ఓటుగా మాత్రమే పనిచేస్తూ ప్రతి ఎన్నికకు కొత్త పథకాన్ని పోటాపోటీగా ప్రకటించాల్సి రావడం, వాటి వల్ల తాత్కాలిక ఉపశమనం తప్ప పేదరికం తగ్గకపోవటం, ఉత్పాదకత పెరగక పోవటంతో.. దేశ వనరులు, తమ పన్నుల డబ్బు వృథా అవుతున్నాయని కాస్త ఆలోచించగల ప్రజల ఆవేదనగా ఉంది. కానీ దానికి పరిష్కారం జమిలి కాదు. ఏకకాల ఎన్నికల వల్ల తాత్కాలిక పథకాల జోరు జాతీయ స్థాయి కూడా విస్తరించే అవకాశం ఉంది. కొందరు అంటున్నట్లు సరిగా పనిచేయడం లేదంటూ ప్రజా ప్రతినిధుల్ని వెనక్కి రప్పించేందుకు 'రీ కాల్' హక్కును ప్రవేశపెట్టడం కూడా కాదు. జమిలికి తోడు రీకాల్ వంటి వాటి వల్ల ఎప్పుడు పదవి నుంచి దిగిపోవాలసి వస్తుందోనన్న ఆందోళనతో వ్యక్తిగత, తాత్కాలిక పథకాలు మరింత ఎక్కువ అయ్యే ప్రమాదం ఉంది. రాజీనామా చేసిన ప్రజాప్రతినిధి ఉప ఎన్నిక ఖర్చు భరించేలా చేయటం, ఉపఎన్నిక నిర్వహించకుండా ఓట్ల సంఖ్యలో తర్వాతి స్థానంలో ఉన్న అభ్యర్థిని ఎన్నికైన ప్రతినిధిగా ప్రకటించటం, నిర్దిష్ట పదవీకాలంలోగా రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు కాకుండా ఏర్పాట్లు వంటి పద్ధతుల ద్వారా జమిలి లేకుండానే ఆ విధానం ద్వారా ఆశిస్తున్నట్లు ఎన్నికలు తరచూ జరగకుండా చేయవచ్చు. అయినా కూడా సమస్య సాంకేతికంగా కొంత పరిష్కారం అవుతుంది తప్ప, ఎన్నికల్లో అక్రమ ఖర్చు తగ్గదు .(2024 లో జమిలిగా జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికలలో పార్టీలు కనీసం 10,000 కోట్లు ఖర్చుపెట్టినట్లు అంచనా . ఇందులో అత్యధికం ఓట్ల కొనుగోలుకే వెచ్చించారు) ఎన్నికల అసలు లక్ష్యమైన మంచి పరిపాలన, తాత్కాలిక తాయిలాలకు దుబారా, అప్పు లేకుండా ఆర్థిక క్రమశిక్షణతో ప్రజాధనం ప్రతి రూపాయి సద్వినియోగం సాధ్యమయ్యే అవకాశాలు పెరగవు. ఒక్క ఓటు ఎక్కువ వేస్తే గెలిచినట్లు, తక్కువ వస్తే ఓడినట్లు అనే ఫస్ట్ – పాస్ట్– ది –పోస్ట్ (ఎఫ్‌పిటిపి) ఎన్నికల పద్ధతిలో, మన దేశంలో ఉన్న పరిస్థితుల్లో ఈ మార్పు ఇప్పట్లో సాధ్యం కాదు. కాసిని ఓట్లు పోతే ఫలితాలు తారుమారవుతుండటం, రెండో స్థానంలో ఉన్న అభ్యర్థులకు ఎన్ని ఓట్లు వచ్చినా వృథా కావటం, గెలిచే




అవకాశం ఉన్న రెండు పార్టీల మధ్యే పోటీ కేంద్రీకృతం కావటం, ప్రత్యామ్నాయ, ప్రగతిశీల ఆలోచనలున్న పార్టీలు నిలదొక్కుకోలేకపోవటం వంటి ధోరణులు ఓ విష వలయంలా కొనసాగుతూ పూర్తిస్థాయి అభివృద్ధి జరగకుండా అడ్డుకుంటూ రాజకీయ అవినీతిని, తాత్కాలిక తాయిలాలను పెంచి పోషిస్తున్నాయి. ఓటుకి, జీవితానికి మధ్య సంబంధం అర్థం కాని పేద దేశంలో, నిజమైన అక్షర జ్ఞానం లేకుండా అధికారాన్ని పూజించే, అధికారమే సర్వస్వం అనుకునే మన సామాజిక, రాజకీయ సంస్కృతిలో, ఎఫ్‌పిటిపి ఎన్నికల వ్యవస్థలో గెలుపు కోసం ఒక్క ఓటుకి కూడా వేల రూపాయలు వెదజల్లే పరిస్థితి ఎందుకు ఉందో ఈ గణాంకాలు చూస్తే అర్థమవుతుంది. ఇటీవలి మహారాష్ట్ర , హర్యానా ఎన్నికలనే తీసుకుందాం పోలైన ఓట్లకి గెలిచిన సీట్లకి పొంతన కనిపించదు. మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాలపై ఎన్సీపీ (ఎస్‌పీ)అధినేత శరత్ పవార్ మాట్లాడుతూ, '80 లక్షల ఓట్లు పోలైన కాంగ్రెస్ పార్టీ 15 స్థానాలు గెలుచుకోగా, 79 లక్షల ఓట్లు వచ్చిన ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేనకు 57 సీట్లు వచ్చాయి. 58 లక్షల ఓట్లు పోలైన అజిత్ పవార్ ఎన్సీపీ 41 స్థానాలు గెలుచుకోగా, 72 లక్షల ఓట్లు వచ్చిన ఎన్సీపీ (ఎస్పీ) కి పది సీట్లు మాత్రమే వచ్చాయి' అన్నారు. దీనికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ, 'మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో 1,49,13,914 ఓట్లు పోలైన బీజేపీ కేవలం 9 స్థానాల్లో విజయం సాధించగా, 96,41,856 ఓట్లు దక్కిన కాంగ్రెస్ 13 సీట్లు గెలుచుకుంది. 73,77,674 ఓట్లు దక్కించుకున్న శివసేన (ఉద్ధవ్) ఏడు స్థానాలు గెలుచుకోగా, అంతకంటే తక్కువగా 58, 51,166 ఓట్లు పొందిన ఎన్సీపీ (ఎస్పీ) 8 స్థానాలు గెలిచింది' అని బదులిచ్చారు. అదేవిధంగా హర్యానాలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 39.94% ఓట్లు సాధించిన బీజేపీకి 48 సీట్లు రాగా, 39.09% సాధించిన కాంగ్రెస్ కి 37(2019 ఎన్నికల్లో 28.0% ఓట్ షేర్ కి 31 సీట్లు) వచ్చాయి. ఇలా తక్కువ ఓట్లకు ఎక్కువ

**ఏ దేశ ఎన్నికల వ్యవస్థ 100% కచ్చితత్వంతో లేదు. ఎన్నో లోపాలున్నాయి. అమెరికాలో సాధారణంగా ఎక్కువ ఓట్లు పొందిన పార్టీకి సీట్లు వస్తాయి. మనదేశంలో ఓట్లకు, సీట్లకు అంతరం ఉంటుంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ 20% ఓట్లు పొందినా ఒక్క సీటు రాలేదు. కాంగ్రెస్ 5 శాతం ఓట్లతో రెండు సీట్లు గెలిచింది. 2019తో పోలిస్తే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 0.6% ఓట్లు తక్కువ రాగా 63 సీట్లు కోల్పోయింది. కాంగ్రెస్ రెండు శాతం ఓట్లు అధికంగా రాగా, పార్టీ సీట్ల సంఖ్య 44 నుంచి 99 కి పెరిగింది.**

**-సంజయ్ కుమార్, సెఫాలజిస్ట్,**
**'లోక్‌నీతి' సహ డైరెక్టర్**

సీట్లు, కొద్దిపాటి ఓట్ల శాతం తేడాలు అధికారం కోల్పోవటానికి మనదేశంలో గత మూడు నాలుగు దశాబ్దాలలో ఎన్నో ఉదాహరణలు చెప్పవచ్చు.

**స్వామి కార్యం, స్వకార్యం నెరవేర్చే పరిష్కారాలు**

ఈ రకంగా సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి కొరవడటం, అపరిపక్వ ప్రజాస్వామ్యం వల్ల ఓట్లున్న చాలా సందర్భాల్లో సీట్లుగా మారే ఎన్నికల వ్యవస్థ కాకపోవడంతో రాజకీయాలు అక్రమ డబ్బుమయమై సమర్థులు, నిజాయితీపరులు, సామా న్యులు చట్టసభలకు ఎన్నికయ్యే పరిస్థితులు అరుదై పోతున్నాయి. మూడో స్థానంలోకి జారిపోయిన ప్రధాన సాంప్రదాయ రాజకీయ పార్టీలు కూడా నిర్వహణ ఖర్చులు భరించలేక కొన్ని సందర్భాలలో అదృశ్యమైపోతున్నాయి. దీనికి తోడు ఫిరాయింపుల జోరుతో అవే ముఖాలు అన్ని ప్రధాన పార్టీల్లో, ముఖ్యంగా అధికార పార్టీలో కనిపిస్తూ యథాతథస్థితి కొనసాగుతోంది. ఈ మొత్తంలో అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం తరచూ దెబ్బతింటూ దేశం, భవిష్యత్తు తరాలు భారీ మూల్యం చెల్లిస్తున్నాయి. దీనికి పరిష్కారం మన దేశ పరిస్థితులు కనుగుణంగా దామాషా ఎన్నికల పద్ధతి, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, వంటి సంస్కరణలో ఉంది తప్ప జమిలి, ఈవీఎంలపై ఆరోపణలతో కాలయాపనలో లేదు. వ్యక్తి కన్నా, పార్టీ కన్నా దేశం మిన్న అని కాగితాలు, ప్రసంగాల్ని దాటి ఆచరణలో నాయకులు వ్యవహరించటం ఉన్న కొద్ది అరుదైపోతోంది. ప్రతి ఓటుకో విలువ ఉండే దామాషా పద్ధతి, ఎమ్మెల్యేలపై ఆధార పడాల్సిన అవసరం లేకుండా ముఖ్యమంత్రిని ప్రజలే నేరుగా ఎన్నుకోవడం వంటి మార్పుల వల్ల పార్టీల మీద అక్రమార్జన ధనభారం, డబ్బు, కులం, ముఠాబలం ఉన్న నాయకులను వెతికిపట్టుకొని అభ్యర్థులుగా ఉండమని బతిమలాడుకోవాల్సిన దుస్థితి ఉండదు. పోటాపోటీగా మితిమీరి తాత్కాలిక సంక్షేమ పథకాలను ప్రకటించాల్సిన అవసరం ఉండదు. స్వామి కార్యం, స్వకార్యం కూడా నెరవేరి దేశాభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలు, పార్టీల మనుగడకు ఢోకా ఉండదు.

సమర్థత, నిబద్ధత, సేవాభావం, సృజనాత్మక ఆలోచనలు ఉన్నవారు, ముఖ్యంగా యువత పుట్టుక నేపథ్యంతో సంబంధం లేకుండా వేగంగా ఎదిగేలా, అభ్యర్థుల, నాయకత్వ స్థానాల ఎంపిక సభ్యులు, ప్రజాభిప్రాయం ద్వారా జరిగేలా పార్టీల్ని ప్రజాస్వామీకరించటం కూడా అవసరం. నేతల కుటుంబ సభ్యులు రాజకీయాల్లోకి రావడం తప్పేమీ కాదు, కానీ పదవు లకు వేగంగా ఎదగటానికి అదొక్కటి అర్హత కాకూడదు. లేకుం టే, వంశపారంపర్య రాజకీయాలు కేంద్రీకృత నాయ కత్వంతో భవిష్యత్తులో పార్టీలు కూడా సంక్షోభంలో పడతాయి.

**ఏకత్వం అంటే ఏకరూపం, ఏకకాలం ఎన్నికలు కాదు**

అదానీ లంచాలు లాంటి ఆరోపణలు కావచ్చు, ఓట్లు- సీట్లు అంతరం వల్ల దుష్పరిణామాలు, రాజకీయానికి-పరి పాలనకు వైరుధ్యం, అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విధానాల పరంగా కాకుండా అధికారమే ప్రాతిపదికగా ఘర్షణలు పెరిగి అగాధ ఏర్పడడం కావచ్చు- వీటికి నిజమైన పరిష్కారంగా అందించే సంస్కరణ మీద దృష్టి సారించకుండా..ఉన్నది చెడగొట్టడం, కొండను తవ్వి ఎలుకనుపట్టే నిరర్థక మార్పుల్ని తేవటం కోసం ప్రయత్నించటం తగదు. అపార భిన్నత్వం రీత్యా ప్రపంచంలోని అన్ని దేశాల కంటే, చివరికి చైనా కంటే కూడా, భారత్‌లో మార్పు తేవటం కష్టమని అంతర్జాతీయ రాజనీతిజ్ఞులే తేల్చారు. కానీ దేశాన్ని ఏకం చేయటమంటే ఏకరూపంలోకి తేవడం, ఏకకాల ఎన్నికలు పెట్టటం కాదు . జాతీయ ఉద్యమంలోలా కృషి చేయటం. సంస్కర్తకి అపార సహనం ఉండాలని జాతీయ ఉద్యమ సారథి మహాత్మాగాంధీ చెప్పిన మాటను విస్మరించ కూడదు. దామాషా ఎన్నికల పద్ధతికి మారటానికి ప్రత్యేకించి ప్రయాస కూడా అక్కర్లేదు. రాజ్యాంగ నిర్మాతలు ముందు చూపుతోనే ముందుకు ఏర్పాట్లు చేశారు. మనం చేయ వలసిందల్లా కాస్త వాస్తవికతతో, లక్ష్య శుద్ధితో, హేతుబద్ధంగా, ఆచరణ సాధ్యంగా ఆలోచించి వ్యవహరించటం.

**ఏకాభిప్రాయం అవసరం**

దేశ సుస్థిరాభివృద్ధికి అవసరమైన మౌలిక మార్పులపై రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉండాలి. ఈ క్రమంలో తక్షణావసరంగా ఎన్నికల వ్యవస్థను మార్చి కొద్దిపాటి ఓట్లతో అధికారం ఎక్కడ కోల్పోతామోనని ప్రతి ఓటు కోసం అక్రమ డబ్బుతో వెంపర్లాడాల్సిన అవసరం లేకుండా.. పార్టీల విధానాలు, అభ్యర్థుల చరిత్ర ఆధారంగా ప్రతి ఓటుకు విలువ ఉండే పద్ధతి తేవటం, దీర్ఘకాలంలో ఆ మార్పు సుస్థిరానికి, సమర్థ నాయకుల మధ్య కూడా పోటీ, ప్రజలకు ఎంపిక స్వేచ్ఛ పెరగటానికి స్థానిక ప్రభుత్వాల్ని పటిష్ట పరచడం అవసరం. ఈ రకంగా నిజంగా అవసరమైన మార్పులను ఎన్నికల వ్యవస్థలో తెచ్చేందుకు జాతీయ పార్టీలు చిత్తశుద్ధితో కృషి చేయాలి, హేతుబద్ధ, సానుకూల చర్చతో ఏకాభిప్రాయ సాధనకు యూనియన్ ప్రభుత్వం చొరవ చూపాలి. ❖

# రూ.3,22,359 కోట్లతో ఏపీ 25-26 బడ్జెట్



***ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం, అభివృద్ధిపథంలో పరుగులు పెట్టించి ఆర్థికంగా పరిపుష్టం చేయాలన్న లక్ష్యాలకు పటిష్టమైన పునాదులు వేసే సంకల్పంతో 2025-26 సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రభుత్వం ఆవిష్కరించింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను రూ.3,22,359 కోట్లతో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో ప్రవేశపెట్టారు. రాష్ట్ర బడ్జెట్ రూ. మూడు లక్షల కోట్ల మార్కును దాటటం ఇదే మొదటిసారి. రూ. 48,341 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు.***

సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలుకు వీలైనంత ప్రాధాన్యతనిస్తూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు బడ్జెట్‌లో విస్తృత కసరత్తు చేశారు. గత ప్రభుత్వ పాలన వల్ల ఏర్పడిన ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితులను అధిగమించేందుకు ప్రయత్నం చేశారు.

రూ.40,635 కోట్ల మూలధనం ప్రతిపాదించారు. విద్యారంగంలో సంస్కరణలు, దిద్దుబాట్లకు వీలుగా పాఠశాల, ఉన్నత విద్యకు కలిపి రూ.34,311 కోట్లు కేటాయించారు. జలవనరుల శాఖకు రూ.18,019 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు రూ. 6,705 కోట్లు; రాజధాని అమరావతికి రూ.6,000 కోట్లు ప్రతిపాదించారు.

సూపర్-6లో భాగంగా మరో రెండు పథకాల అమలుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. 'తల్లికి వందనం' కోసం రూ.9,407 కోట్లు, 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్'కి కలిపి రూ.9,400 కోట్లు ప్రతిపాదించింది. ఇప్పటికే అమలు చేస్తున్న దీపం 2.0 పథకానికి రూ.2,601 కోట్లు కేటాయించింది. తెలుగుభాష పరిరక్షణకు ఈ బడ్జెట్‌లో రూ.10 కోట్లు ఇచ్చారు.

**ముఖ్య కేటాయింపులు (శాఖలవారీగా, రూ.కోట్లలో);**

✳ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి - 18,848
✳ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ - 13,862
✳ పాఠశాల విద్య - 31,806
✳ ఆరోగ్యం - 19,265
✳ ఇంధన శాఖ - 13,600
✳ వ్యవసాయం - 11,636
✳ సాంఘిక సంక్షేమం - 10,909
✳ రవాణాశాఖ - 8,785
✳ ఎస్.సి సంక్షేమం - 20,281
✳ ఎస్.టి సంక్షేమం - 8,159
✳ బీసీ సంక్షేమం - 47,456
✳ మైనారిటీలు - 5,434
✳ మహిళ, శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమం - 4,332
✳ నైపుణ్యాభివృద్ధి శిక్షణ - 1,228
✳ రహదార్లు, భవనాలు - 8,785
✳ యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ - 469
✳ గృహ మంత్రిత్వశాఖ - 8,570
✳ యువతకు డీఎడిక్షన్ - 10
✳ పరిశ్రమలు, వాణిజ్యం - 3,156
✳ ఆర్టీజీఎస్ - 101
✳ జల్‌జీవన్ మిషన్ - 2,800
✳ వ్యవసాయ అనుబంధ రంగాలు - 13,487
✳ పౌర సరఫరాలు - 3.806
✳ ఎన్టీఆర్ భరోసా ఫించను - 27,518
✳ స్వచ్ఛ ఆంధ్ర - 820
✳ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం - 3,486
✳ ఆదరణ పథకం - 1000

ఏటా నిలకడగా 15 శాతానికి పైగా జీఎస్‌డీపీ వృద్ధి సాధించటం ద్వారా 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న బృహత్ లక్ష్యంతో రూపొందించిన స్వర్ణాంధ్ర-2047 పది మార్గదర్శక సూత్రాల సాధనకు ఈ బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు చేశారు.

గత ప్రభుత్వం ఏకంగా 95 కేంద్ర ప్రభుత్వ పథకాలను నిలిపివేయడం వల్ల ఆంధ్రప్రదేశ్ రూ.39,642 కోట్లు నష్టపోయినట్టు అంచనా. కొన్ని పథకాలకు యూనియన్

**నాలుగు ప్రాధాన్య రంగాలు**

**స్వర్ణాంధ్ర విజన్ - 2047 సాధనకు బడ్జెట్‌ను 4 ప్రాధాన్య రంగాలుగా విభజించింది. మొత్తంగా రూ. 2,39,846 కోట్లు కేటాయించింది.**

**(రూ.కోట్లలో) :**

**1) పారిశ్రామిక, నైపుణ్యాభివృద్ధి - 12,112**

**2) ఆర్థిక, సాంకేతిక పురోగతి - 55,730**

**3) సామాజిక సమ్మిళిత, సాధికారత - 1,42,349**

**4) సుస్థిర సాగు, కరవు రహిత రాష్ట్రం కోసం - 29,655**

**+ ఈ విభాగాల కింద సంబంధిత రంగాలకు కేటాయింపులు చేశారు.**

**2025-26 ఏపీ బడ్జెట్ స్వరూపం**
**(రూ.కోట్లలో)**
**మొత్తం 3,22,359.33**

| | |
|---|---|
| **రాబడి** | |
| మూలధన వసూళ్లు - | 1,04,382.80 |
| రెవెన్యూ వసూళ్లు - | 2,17,976.53 |
| రెవెన్యూ లోటు - | 33,185.97 |
| **ఖర్చులు** | |
| మూలధన చెల్లింపులు - | 24,430.16 |
| రెవెన్యూ వ్యయం - | 2,51,162.5 |
| రుణాలు, అడ్వాన్సులు - | 6,130.95 |
| మూలధన వ్యయం - | 40,635.72 |
| ద్రవ్య లోటు - | 79,926.90 |

ఇచ్చిన నిధుల్ని పక్కదోవ పట్టించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక తన వాటాగా రూ.9,371 కోట్లు వెచ్చించి 74 పథకాల్ని పునరుద్ధరించింది. మిగతావాటినీ పునరుద్ధరించే దిశగా ఈ బడ్జెట్‌లో నిర్ణయాలు



ప్రకటించింది.

నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీల్లో చేసిన పనులకు బిల్లుల చెల్లింపు విధానాన్ని గత ప్రభుత్వం పూర్తిగా కేంద్రీకరించింది. ప్రస్తుత బడ్జెట్లో ఎక్కడికక్కడే నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు బిల్లులు చెల్లించుకునే స్వేచ్ఛను కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా పబ్లిక్, ప్రయివేటు భాగస్వామ్యంతో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రభుత్వం 20 శాతం వయబిలిటీ గ్యాప్ ఫండ్ ఇచ్చే కొత్త విధానాన్ని ప్రతిపాదించింది. దీనికోసం రూ.2,000 కోట్ల కార్పస్‌ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు.

**రూ. లక్ష కోట్ల అప్పు అవసరం**

ఆంధ్రప్రదేశ్ తాజా వార్షిక బడ్జెట్ సాకారం కావాలంటే రూ.1,04,382 కోట్ల రుణం తీసుకోవాలి. ఇందులో బహిరంగ మార్కెట్ నుంచి రూ.80,456.50 కోట్లు, యూనియన్ నుంచి రూ. 21,700 కోట్లు, ఇతర సంస్థల నుంచి 1500 కోట్లు రుణం తీసుకోనున్నట్లు బడ్జెట్ పత్రాల్లో ప్రభుత్వం పేర్కొంది. కార్పొరేషన్ల రూపంలో రుణాలు తీసుకోవడానికి ఇంతవరకూ ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన విలువ రూ.2,44,643 కోట్లుగా తెలిపింది.

**అప్పులు, వడ్డీల భారమే రూ. 60 వేల కోట్లు.**

గత ప్రభుత్వం చేసిన అప్పుల భారం వల్ల వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏపీ సర్కారు అప్పులు, వడ్డీల రూపంలో చెల్లించాల్సింది దాదాపు రూ.60 వేల కోట్ల వరకూ వుండనుంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.33,752.91 కోట్లు మాత్రమే.

**రెవిన్యూ, ద్రవ్య లోటు కట్టడి సాధ్యమా?**

2024-25లో రూ.37,743 కోట్లకే రెవిన్యూ లోటును పరిమితం చేస్తామని నాడు బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. కానీ, సవరించిన లెక్కల ప్రకారం ఇప్పటికే రెవిన్యూ లోటు రూ. 48,311.47 కోట్లకు చేరింది. అదేవిధంగా ద్రవ్యలోటు రూ. 68,742.65 కోట్లకు పరిమితం చేస్తామని అప్పట్లో పేర్కొన్న, ఇప్పటికే రూ.73,362.36 కోట్లకు చేరింది. ఈ నేపథ్యంలో, వచ్చే ఆర్థిక సంవత్సరం రెవిన్యూ లోటు రూ. 33,000 కోట్లకు నియంత్రించటం, ప్రజారుణాన్ని రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 35 శాతానికి పరిమితం చేస్తామని తాజా బడ్జెట్‌లో చెప్పిన అంచనాలు ఎంతవరకూ ఆచరణ సాధ్యమన్న సందేహాలు వినిపిస్తున్నాయి. ❖





యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ గోల్డెన్ జూబ్లీ, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా 25 కీలక ఉపన్యాసాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 'బలమైన , సుస్థిరమైన భారత్ ; మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా అడుగులు ' పేరుతో ఏర్పాటు చేసిన ఈ ప్రసంగాల పరంపరలో 'స్వేచ్ఛ , అభివృద్ధి , సమ్మిళితత్వం' పై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగించారు . సమ్మిళిత అభివృద్ధికి కావలసిన మౌలికాంశాలకు అవరోధాలను, పరిష్కారాలను వివరించారు.





RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th March, 2025 Posting Date 15 &16th of every month

# Happy International Women's Day 2025

## మహిళా రిజర్వేషన్ చట్టం అవకాశాన్ని అందుకునేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధమవ్వండి



ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం భారతీయ స్త్రీలు, ముఖ్యంగా యువతులకు ప్రత్యేకమైనది. ఓటు వేసే స్థాయి నుంచి.. అసెంబ్లీ, పార్లమెంట్‌లో సీటు సంపాదించి తమ సాధికారతకు, సమాజ, దేశ సమగ్రాభివృద్ధికి మార్గం వేసే అవకాశం వారికి లభించనుంది. త్వరలో అమలుకానున్న మహిళా రిజర్వేషన్ చట్టం ఈ అవకాశం కల్పించనుంది. అయితే ఆ చట్టాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వారు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి.

తమ చదువును, కెరీంను, జీవితాన్ని బ్యాలన్స్ చేసుకుంటూ, చుట్టూ ఉన్న సమాజం గురించి కూడా అమ్మాయిలు కొంత పట్టించుకోవాలి. స్థానిక స్థాయి నుండి పరిపాలన, రాజకీయంపై అవగాహన పెంచుకోవాలి. ఈ దేశంలో మౌలిక మార్పుల కోసం లోతైన అధ్యయనం, విశ్వసనీయతతో దశాబ్దాలుగా రాజకీయ సంస్కరణల కృషి చేస్తూ, క్రమంగానైనా గణనీయ ఫలితాల్ని సాధిస్తూ, మహిళా రిజర్వేషన్ చట్టం అమలయ్యే లోగా అందులోని లోపాల్ని కూడా సరిదిద్దటానికి పార్టీలకతీతంగా ప్రయత్నిస్తున్న ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్ సత్తా సంస్థల్ని, సోషల్ మీడియా వేదికల్ని ఇందుకోసం సద్వినియోగం గావించుకోండి. క్రమంగా ఓపెన్ కేటగిరీ సీట్లలో పోటీ చేసి గెలిచే స్థాయికి ఎదగండి.

**మహిళల సాధికారత = పురుషుల, సమాజ సాధికారత**

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
FDR, లోక్ సత్తా వ్యవస్థాపకులు

https://www.youtube.com/@JPLoksattaOfficial

------------------------------------

Instagram @jploksatta

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.
Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.